www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
ప్రకాశం
బుధవారం 23, ఆగస్టు 2017



విద్యుత్‌దీపాల అలంకరణలో ఒంగోలులోని ప్రకాశం భవన్



ధీరోదాత్తుడు

టంగుటూరి ప్రకాశం పంతులు



- స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర
- ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి
- ప్రకాశం పేరుతో జిల్లాకు కీర్తి ప్రతిష్ఠ
- నేడు 145వ జయంతి వేడుకలు ■ భారీ ఏర్పాట్లు
- స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో విగ్రహావిష్కరణ

2లో

టంగుటూరి ప్రకాశం పంతులు.. ఆయన జీవితం ఓ ఆదర్శం! వ్యక్తిత్వం ఉన్నతం! ఆయన పోరాటం ఓ స్ఫూర్తి! ప్రజలే ప్రాణంగా, సమాజాభివృద్ధే ధ్యేయంగా ఆయన చేసిన త్యాగాలు, సేవలు అనిర్వచనీయం! సైమన్ గో బ్యాక్ అంటూ తెల్లవాళ్ల తుపాకులకు గుండెను ఎదురొడ్డిన ధీరోదాత్తుడు! తెలుగు వాళ్ల తెగువను ఎలుగెత్తి చాటి స్వాతంత్ర్య పిపాసను రగిలించిన ధీశాలి! అందుకే ఆయన ఆంధ్రకేసరి అయ్యారు. నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆ మహోన్నత వ్యక్తి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ఊరూవాడా కార్యక్రమాల నిర్వహణకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ప్రకాశం పంతులు జన్మస్థలమైన మన జిల్లాలో భారీ ఏర్పాట్లు జరిగాయి.


వినోదరాయునిపాలెంలో ఏర్పాటు చేస్తున్న ప్రకాశం పంతులు కాంస్య విగ్రహం

పొగాకు రైతుల్లో అలజడి

- ఉత్తరాదిలో ఉత్పత్తి పెంపునకు వ్యాపారుల ప్రతిపాదన
- గత ఏడాది మాదిరిగానే ఉంచాలంటున్న దక్షిణాది రైతులు
- అధికోత్పత్తి కొనుగోలుపై కొరవడిన స్పష్టత
- నేడు హైదరాబాద్‌లో పొగాకు బోర్డు సమావేశం
- రానున్న సీజన్ పంట సాగు, ఉత్పత్తి ఖరారుపై నిర్ణయం
- వాదనలు వినిపించేందుకు వెళ్లిన రైతు ప్రతినిధులు



ఒంగోలు, ఆంధ్రజ్యోతి : రాష్ట్రంలో ఈ సీజన్ పొగాకు పంట ఉత్పత్తి ఖరారు, కర్నాటకలో కొనుగోళ్ల ప్రారంభం తదితర కీలక అంశాల అజెండాతో భారత పొగాకు బోర్డు పాలక మండలి సమావేశం బుధవారం హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయం చేస్తారన్న దానిపై రైతుల్లో ఆందోళన

మిగతా 15వ పేజీలో



ఒంగోలులో నిర్వహించిన ధర్నాలో అభివాదం చేస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు

స్తంభించిన బ్యాంకింగ్

బ్యాంకింగ్ రంగ పరిరక్షణ, బడా బాబుల నుంచి బకాయిల వసూళ్లు తదితర డిమాండ్‌లతో బ్యాంకు ఉద్యోగులు మంగళవారం చేపట్టిన సమ్మె జిల్లాలో విజయవంతమైంది. 299 ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలు మూతపడ్డాయి. సుమారు ఏడు వేల కోట్ల రూపాయల లావాదేవీలు స్తంభించాయి. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బ్యాంకు ఉద్యోగులు ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు.



15లో

అజరామర పోరాటసిరి.. ఆంధ్రకేసరి

నేడు టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి

ఒంగోలు కల్చరల్ : టంగుటూరి గోపాలకృష్ణయ్యది పేద బ్రాహ్మణ కుటుంబం. 1982 ఆగస్టు 23న టంగుటూరి గోపాలక్రిష్ణయ్య, హనుమాయమ్మ దంపతులకు మూడో సంతానంగా ప్రకాశం పంతులు వినోదరాయునిపాలెంలో జన్మించారు. ప్రకాశం 11వ ఏటనే తండ్రి మరణించాడు. ఆయన తల్లి ఒంగోలులో పూటకూళ్ల నడిపేవారు. సంతానాన్ని పోషించేందుకు ఆమె అష్టకష్టాలు పడుతుండడంతో ప్రకాశం పంతులు తెలిసిన వారిళ్లలో వారాలు చేసుకునే వారు. ప్రకాశంకు చిన్నతనం నుంచి ఆటలన్నా, నాటకాలన్నా తగని మోజు. దీంతో ఆయన చదువు నత్తనడక నడిచింది. అతి కష్టం మీద మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు సహకారంతో మెట్రిక్ ఉత్తీర్ణులయ్యారు.

రాజమండ్రికి వెళ్లడంతో దశ తిరిగిన జీవితం

ఇమ్మానేని హనుమంతరావు రాజమండ్రికి నివాసం మార్చటం టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని మలుపుతిప్పింది. ఆయన ప్రకాశాన్ని కూడా తనతో పాటే రాజమండ్రి తీసుకెళ్లారు. అక్కడ ఆయన్ను ఎఫ్ఏ చదివించి ఆ తర్వాత మద్రాసులో న్యాయశాస్త్రం చదివించారు. ప్రకాశం పంతులు కొంతకాలం ఒంగోలులో న్యాయవాద వృత్తిచేసినా, ఆయన రాజమండ్రిలో న్యాయవాదిగా అటు పేరుప్రఖ్యాతలతోపాటు డబ్బు బాగా సంపాదించారు.

స్వాతంత్ర్య సమరసింగమై

బారిస్టరు చదువు కోసం ప్రకాశం 1904లో ఇంగ్లాండు వెళ్లారు. 1907లో భారతదేశానికి తిరిగివచ్చి మద్రాసు హైకోర్టులో న్యాయవాద వృత్తి చేపట్టారు. 1921లో న్యాయవాద వృత్తిని వదిలి స్వాతంత్ర్య సమరంలో అడుగిడేనాటికి ప్రకాశం పంతులు అత్యంత ధనవంతులు. తాను సంపాదించిన ఆస్తిపాస్తులన్నీ దేశసేవ కోసమే ఖర్చు చేశారు. 1921లో ఆంధ్రప్రాంతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై అదే సంవత్సరం స్థాపించిన స్వరాజ్య దినపత్రిక తెలుగు, తమిళ భాషలలో విశేష ఆదరణ పొందింది. ప్రకాశం పంతులకు ధైర్యసాహసాలు ఎక్కువ. 1928లో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారి తుపాకీ గుళ్లకు ఏ మాత్రం భయపడలేదు. 'ధైర్యముంటే నన్ను కాల్చండి' అని గుండెచూపి సవాలు చేసిన ధీశాలి ఆయన. అందుకే ఆయనను ప్రజలు అప్పటి నుంచి 'ఆంధ్రకేసరి'గా బిరుదు ఇచ్చారు. అనంతరం గాంధీ పిలుపుమేరకు ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు.

ప్రకాశం ఒడిలో పలు పదవులు

తొలుత ప్రకాశం పంతులు తన 35 ఏళ్ల వయసులోనే రాజమండ్రి పురపాలక సంఘ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1937లో రాజాజీ మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా ప్రకాశం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై 13 నెలలు కొనసాగారు. స్వాతంత్ర్యానంతరం అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి 1953లో తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు పనిచేశారు. 82 సంవత్సరాల వయసులో 1957 మే 20న తనువు చాలించిన టంగుటూరి ప్రకాశం పంతులను స్మరిస్తూ 1970 ఫిబ్రవరి 2న నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల కలయికతో ఏర్పడిన జిల్లాకు నాటి ప్రభుత్వం 'ప్రకాశం' జిల్లాగా నామకరణం చేసింది.

వారసులు ఒంగోలులో...

టంగుటూరి ప్రకాశం పంతులు వారసులు నేటికీ ఒంగోలులో ఉన్నారు. ఆయన పెరిగిన వినోదరాయునిపాలెం ఒంగోలుకు కూతవేటు దూరంలో ఉంది. ఇన్నేళ్లు అభివృద్ధికి నోచుకోని వినోదరాయునిపాలెంపై ఇపుడు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. సీసీ రోడ్ల నిర్మాణం, టంగుటూరి ప్రకాశం విగ్రహం ఏర్పాటు వంటి చర్యలు ఇప్పటికైనా చేపట్టడం హర్షణీయం. ఆయన జీవిత చరిత్రను, పోరాటస్ఫూర్తిని తెలియజెప్పేలా ప్రతి పాఠశాలలో చర్యలు తీసుకుంటే భావితరాల గుండెలలో 'ఆంధ్రకేసరి' అజరామరంగా నిలిచి ఉంటారు.



జన్మించింది అత్యంత సామాన్య కుటుంబం.. చిన్నతనంలోనే వెంటాడిన కటిక పేదరికం.. అయినా చెక్కుచెదరని ధీరోధాత్త గుణం.. న్యాయవాదిగా లక్షలు సంపాదించి దేశ స్వాతంత్ర్యం కోసం ఆస్తినంతా కర్పూరంలా కరగదీసిన దానశీలి.. తన పోరాట వ్యూహంతో.. తన నాయకత్వ పటిమతో తెలుగువారి గుండెల్లో 'ఆంధ్రకేసరి'గా చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయనే ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు.

ప్రకాశం జన్మస్థలానికి మహర్దశ



ప్రకాశం పంతులు పుట్టిన నాటి పూరిల్లు స్థానంలో నేడు భవనం



వినోదరాయునిపాలెం వ్యూ

- రూపుమారుతున్న వినోదరాయునిపాలెం
- కోటి రూపాయలతో అభివృద్ధి
- ప్రకాశం కాంస్య విగ్రహావిష్కరణ

వినోదరాయునిపాలెం(నాగులుప్పలపాడు): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి ఉత్సవాలు బుధవారం ఆయన జన్మస్థలమైన నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఆయన జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. దీంతో ఆ గ్రామ రూపురేఖలు మారిపోతున్నాయి.

146 ఏళ్లకు వినోదరాయునిపాలెంలో అభివృద్ధి పరుగులు

ప్రకాశం పుట్టిన వినోదరాయునిపాలెంలో 146 ఏళ్లకు అభివృద్ధి పరుగులు పెడుతోంది. మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ దత్తత గ్రామంగా స్వీకరించి ఆ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టారు. గ్రామంలో రూ.40 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా పరిషత్ హైస్కూలుకు 10లక్షలతో ప్రహరీ, పాఠశాల ఆవరణలో నిలువెత్తు కాంస్య విగ్రహ ఏరాటుకు సన్నాహాలు చేపట్టారు. గ్రామంలో ఇప్పటికే ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి ప్రత్యేక శ్రద్ధతో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మించడంతో ప్రభుత్వం ఓడీఎఫ్ గ్రామంగా ప్రకటించింది. దీంతో పాటు తమ్మకుంట చెరువు అభివృద్ధి పనులు, ఫిల్టర్‌బెడ్ నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టారు. వీటితో పాటు సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బి.ఎన్.విజయకుమార్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా రూ.45లక్షల నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. సుమారు కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతుండడంతో గ్రామ రూపురేఖలు మారుతున్నాయి.



సీసీ రోడ్డు



సిద్ధమవుతున్న సీసీరోడ్డు



కలెక్టరేట్‌కు విద్యుద్దీకరణ

ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో అందుకు అనుగుణంగా ఒంగోలుతో పాటు ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలెంలో పలు కార్యక్రమాలు నిర్వహించనుంది. బుధవారం ఉదయం 9గంటలకు ప్రకాశం భవన్‌లోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం దేవరంపాడులో విజయస్థూపం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తారు. వినోదరాయునిపాలెంలో జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ పి. నారాయణ, మంత్రి శిద్దా రాఘవరావు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు.

మహనీయుడు పుట్టిన గ్రామంలో పుట్టడం అదృష్టం

నడిపినేని శేషగిరి



ప్రకాశం లాంటి మహనీయుడు పుట్టిన గ్రామంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా. ఆయన స్ఫూర్తికే గ్రామం పేరు చరిత్రలో నిలిచింది.

గ్రామభివృద్ధి ఆ మహనీయుని చలవే

కొండపి శ్రీనివాసరావు



వినోదరాయునిపాలెం అభివృద్ధి ఇప్పుడు శరవేగంగా జరుగుతుందంటే ఆ మహనీయుని చలవే. ఎన్నిజన్మలు ఎత్తినా ఆయన రుణం తీర్చుకోలేం. మా గ్రామాన్ని ప్రభుత్వం గుర్తించిందంటే ప్రకాశం పంతులు పుట్టడమే కారణం.

పోరుమామిళ్ళపల్లిలో మూడు ఇళ్లల్లో చోరీ

- **ఓ గృహంలో 11 తులాల బంగారం, రూ 40వేలు అపహరణ**
- **మరో రెండిళ్లలో చోరీ సొత్తు ఎంతో తేలాల్సి ఉంది**

కంభం: మండలంలోని పోరుమామిళ్ళపల్లి గ్రామంలో రోడ్డుపక్కనే తాళాలు వేసి గ్రామాలకు వెళ్ళిన మూడు గృహలను దొంగలు దోచుకెళ్ళారు. ఈ సంఘటనలో ఓ గృహంలో 11 తులాల బంగారు, రూ.40వేల నగదు పోయినట్లు తెలుస్తుంది. చోరీ జరిగిన మరో రెండు గృహల యజమానులు అందుబాటులో లేకపోవడంతో ఎంత విలువైన సొమ్ము పోయిందో తెలియడంలేదు. తమ గృహలలో చోరీ జరిగిందన్న విషయం తెలుసుకున్న బాధిత గృహస్థులు స్వగ్రామం బయలుదేరినట్లు తెలిసింది. వివరాలలోకి వెళితే పోరుమామిళ్ళపల్లిలో రోడ్డుకు సమీపంలోనే పక్కపక్కనే గృహలు నిర్మించుకొని నివశిస్తున్న జె. రామాంజనేయులు, అతని తల్లి రాములమ్మ, కూతురు పసుపులేటి లక్ష్మమ్మలు ఇటీవలనే ఇళ్ళకు తాళాలు వేసుకొని తమ బంధువుల ఊళ్ళకు వెళ్ళారు. జె. రాములమ్మ నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన కుమార్తె ఉన్న కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు వెళ్ళింది. పక్కనే ఉన్న పసుపులేటి లక్ష్మయ్య పది రోజుల క్రితం తాళం వేసి హైదరాబాద్‌లోని తమ కుమార్తె ఇంటికి వెళ్ళారు. అలాగే రామాంజనేయులు తన అత్తగారి ఊరైన నంద్యాలకు భార్య, పిల్లలతో వెళ్ళాడు. మూడు కుటుంబాబు తమ గృహలకు తాళాలు వేసి వెళ్ళడం దొంగలకు కలిసి వచ్చింది. దొంగలు ఎప్పుడు ఈ గృహలకు వేసిన తాళాలు పగలగొట్టి చోరీ చేశారో తెలియదు. కానీ మంగళవారం ఉదయం బంధువులు తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అలాగే ఆయా గ్రామాలలో ఉన్న బాధితులకు కూడా సమాచారం ఇవ్వడంతో నంద్యాలలోఉన్న రామాంజనేయులు తన భార్య లక్ష్మితో కలసి కంభం వచ్చాడు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్‌టీం ముందుగా రామాంజనేయులు గృహంలోకి వెళ్ళగా బీరువా, పెట్టెల తాళాలు పగలగొట్టి బీరువాలోని వస్తువులు, బట్టలు చిందవందరగా పడేసి ఉన్నాయి. బీరువా లాకర్ లో దాచిన నాలుగు బంగారు గాజులు, కమ్మలు, చైన్ ఇతర బంగారు ఆభరణాలు మొత్తం రూ 3లక్షల విలువచేసే 11 తులాల బంగారం, రూ 40వేల నగదు ఇతర వస్తువులు పోయినట్లు రామంజనేయులు, లక్ష్మి లు తెలిపారు. మిగిలిన రాములమ్మ, లక్ష్మయ్య గృహలలో ఉన్న బీరువాలను, ట్రంకు పెట్టెను పగలగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడేసి ఉండటం కనిపించింది. అయితే ఈ రెండు గృహలలో విలువైన వస్తువులు ఏమి పోయాయో బాధితులు వస్తేగాని తెలియదు.

కంభంలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలతో అప్రమత్తమైన పోలీసులు రాత్రి 11గంటల నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు విస్తృతం గా పెట్రోలింగ్ తిరుగుతున్నారు. అయితే దొంగలు పట్టణ ప్రాంతం వదిలి గ్రామీణ ప్రాంతంలో ఒకేసారి మూడు గృహలలో చోరీకి పాల్పడడంతో వారు ఉలిక్కిపడ్డారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది.


ఆధారాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 టిప్పర్లు పట్టివేత

దర్శి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను దర్శి పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ముండ్లమూరు మండలం చింతలపూడి గ్రామసమీపంలోని చిలకలేరు వాగు నుంచి గుంటూరుకు చెందిన 2 టిప్పర్లు, దర్శికి చెందిన 1 టిప్పర్ ఇసుక నింపుకొని మార్కాపురం వెళ్తుండగా దర్శి ఎస్‌ఐ ఎం. సుబ్రమణ్యంకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్ళి దర్శి పరిసరాలలో టిప్పర్లను అదుపులోనికి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తునట్లు ఎస్‌ఐ సుబ్రమణ్యం తెలిపారు. ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికి అక్రమాలు ఆగడం లేదు. గతంలో ఎన్నోసార్లు ముండ్లమూరు మండలంలో చిలకలేరు, గుండ్లకమ్మ, దర్శి మండలంలో దోర్నపు వాగు, మూసీ నదులలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టుబడ్డాయి. కొన్ని సందర్భాలలో రాజకీయ కారణాల వల్ల కఠినచర్యలు తీసుకోకపోవడం వల్ల ఇసుక అక్రమ రవాణాదారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తునే ఉన్నారు. పోలీసులు దాడులు చేసినప్పుడు కొంతకాలం మౌనంగా ఉండి మళ్ళీ ఇసుక అక్రమ వ్యా పా రం చేస్తున్నారు. కొంతకాలంగా ఇసుక అక్రమ వ్యాపారం జరగడం లేదని అధికారులు చెబుతూ వచ్చారు. తాజాగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు పట్టుబడడంతో అక్రమ వ్యాపారం మళ్ళీ బట్టబయలైంది.


దర్శి పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్లు

7 మంది కోడిపందేల రాయుళ్ళకు జైలుశిక్ష

ముండ్లమూరు : మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని అడవుల్లో ఈనెల 18వ తేదీ కోడిపందెం వేస్తున్న సమాచారం అందడంతో ఎస్‌ఐ పి.బాలరంగయ్య దాడిచేసి పట్టుకున్నారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా కెల్లంపల్లికి చెందిన నలుగురు, దర్శికి చెందిన ముగ్గురికి ఏడురోజుల పాటు జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.50 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ బాలరంగయ్య తెలిపారు.

డెంగ్యూ జ్వరంతో చిన్నారి మృతి

అద్దంకి: అద్దంకి మండలం శంకవరప్పాడులో బిజ్జం పూజిత(9) డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. నాలుగు రోజులగా జ్వరం రావటంతో అద్దంకి, ఒంగోలు, గుంటూరు వైద్యశాలల్లో వైద్యం చేయించారు. సోమవారం అర్ధరాత్రి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు పొం దుతూ పూజిత మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


బిజ్జం పూజిత(ఫైల్ ఫోటో)

కంటైనర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

పంగులూరు: మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గుంటూరుజిల్లా వాసులు ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు నర్సరావుపేట నుంచి పశువుల దాణాలోడుతో ఒంగోలు వస్తున్న లారీ జాగర్లమూడివారిపాలెం వద్ద ఫ్లైఓవర్ ఎక్కే సమయంలో వెనుక టైరు పంక్చరైంది. దాంతో లారీ ఓనర్ కనపర్తి సాంబశివరావు, చిట్టాబత్తిన చిన్నయ్య టైరుకు పంక్చరు వేసుకునే యత్నంలో ఉన్నారు. ఇదే సమయంలో పొగాకు లోడుతో గుంటూరు వైపు నుండి కృష్ణపట్నం పోర్టుకు వెళ్తున్న కంటైనర్ వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దాంతో అక్కడికక్కడే వారు మృతిచెందారు. మృతుల్లో లారీ యజమాని కనపర్తి సాంబశివరావు(31) గుంటూరు జిల్లా ప్రత్తిపాడువాసి, డ్రైవర్ చింతాబత్తిన చెన్నయ్య(45) గుంటూరులోని శారదా కాలనీవాసిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను అద్దంకి వైద్యశాలకు తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ సుధీర్ కేసు నమోదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, మరొకరికి గాయాలు

కొండపి: మండలంలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన ఇరిగల ఈశ్వర్ రెడ్డి(24) కొండపి- పెదకండ్లగుంట గ్రామాల మధ్యన మలుపులో మోటార్ సైకిల్ పైన పడి దుర్మరణం చెందారు. జాళ్లపాలెం గ్రామానికి చెందిన ఈశ్వర్ రెడ్డి సోమవారం రాత్రి మరణించి ఉంటాడని తెలుస్తోంది. మృతుడు రోడ్డు పక్కన పిచ్చిచెట్లలో పడి కనిపించనందున మంగళవారం మధ్యాహ్నం వరకు ఎవరూ గుర్తించలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.

మర్రిపూడి మండంలోని అయ్యపరాజుపాలెం గ్రామానికి చెందిన నల్లపు వెంకటేశ్వర్లు మద్యం మత్తులో మంగళవారం సాయంత్రం టంగుటూరు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. నల్లపు వెంకటేశ్వర్లుకు గాయాలు కాగా 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనలో మరో మోటార్ సైకిల్‌పై ఉన్న ఇలవర గ్రామానికి చెందిన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి అరెస్టు

- **తొమ్మిది గ్రాముల బంగారం, పట్టు చీరలు స్వాధీనం**

ఒంగోలు క్రైం : సీసీ కెమెరా ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. తాలూకా ఇన్‌స్పెక్టర్ గంగా వెంకటేశ్వర్లు వివరాలను మంగళవారం వెల్లడించారు. తెలంగాణాకు చెందిన నల్గొండ జిల్లా గుర్రం పూడి మండలం, సంగాలి జి.గూడెంనకు చెందిన సమీవత్‌సే హదీరామ్ ప్రస్తుతం ఒంగోలులోని శ్రీరాం కాలనీలో నివసిస్తూ ఆటో నడుపుతున్నాడు. ఈనెల 14న సత్యనారాయణ పురంలో నివాసం ఉంటున్న రాజేష్ కుమార్ తన భార్య, బంధువులను సెంట్రల్‌పార్కు వద్ద ఆటో ఎక్కించాడు. వారు ఇంటివద్ద దిగిన తరువాత ఆటోలో మరోబ్యాగ్ ఉండగానే ఆటోడ్రైవర్ వెళ్లిపోయాడు. ఆటోలో ఉన్న బ్యాగ్‌లో తొమ్మిది సవర్ల బంగారు అభరణాలు, పట్టుచీరలు ఉన్నాయి. తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆటో వెనుక వైపు ఉన్న ఆర్.ఎస్ చౌదరి అనే పేరు ద్వారా ఆటోను గుర్తించి దాన్ని ఆరోజు నడిపిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద తొమ్మిసవర్ల బంగారు ఆభరణాలు, పట్టు చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన హెడ్ కానిస్టేబుళ్ళు టి.బాలాంజనేయులు, వై.చంద్రశేఖర్, కానిస్టేబుల్ హరిబాబు, రాంబాబు, శివరాంలను ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.


స్వాధీనం చేసుకున్న బంగారం, పట్టుచీరలు, వెనుక నిందితుడు

యువతిని మోసగించిన కేసులో యువకుడి అరెస్టు

అద్దంకి: మండలంలోని మణికేశ్వరంలో ఓ యువతిని ప్రేమించి మోసగించిన కేసులో అదే గ్రామానికి చెందిన షేక్ కరిముల్లాను అద్దంకి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. పోలీసులు కథనం మేరకు మణికేశ్వరం గ్రామానికి చెందిన ఓ యువతి, అదే గ్రామానికి చెందిన షేక్ కరిముల్లాలు 2010 నుండి 2013 మధ్య కాలంలో ప్రేమించుకున్నారు. అనంతరం ఆ యువతి ఉద్యోగరిత్య ఏడాది పాటు చెన్నైలో ఉంది. ఆ సమయంలో వేరొక వ్యక్తితో సంబంధం ఉందన్న అనుమానంతో కరిముల్లా ఆమె ప్రేమను నిరాకరించారు. కరిముల్లాకు అదే గ్రామానికి చెందిన వేరొక యువతితో వివాహం నిశ్చియమయ్యింది. ఈ నేపథ్యంలో తనను కరిముల్లా ప్రేమించి మోసగించాడని, శారీరకంగా కూడా అనుభవించి మోసగించి మరొక యువతితో పెళ్లికి సిద్దమయాయడని ఈ నెల 16వ తేది స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కరిముల్లాకు 17వ తేది ఉదయం మరొక యువతితో వివాహం జరగగా ప్రేమికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం కరిముల్లాను సిఐ హైమారావు, ఎస్‌ఐ సుబ్బరాజుల ఆధ్వర్యంలో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.


నిందితుడు కరిముల్లా, వివరాలు వెళ్లడిస్తున్న సీఐ హైమారావు, ఎస్‌ఐ సుబ్బరాజు

నిత్యావసర వస్తువుల పంపిణీ

గిద్దలూరు: పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో సూపర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక, శారీరక వికలాంగ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం స్వర్గీయ గడ్డం వెంకట రామిరెడ్డి, రమాదేవి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులైన నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జీకే.మోహన్ రెడ్డి, డాక్టర్ జీకే.సుదర్శనరెడ్డిలు మంగళవారం రూ.10 వేల విలువైన మూడు సీలింగ్ ఫ్యాన్లు, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధి గోపాలరెడ్డి, కంటి ఆసుపత్రి ప్రతినిధి బాల క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డంతా బురదమయం

ప్రజల అవస్థలు

గిద్దలూరు : పట్టణంలోని నల్లబండ బజారులో పాత సత్యనారాయణ థియేటర్ రోడ్డు దుస్థితిలో ఉన్నది. ఈ రోడ్డులో గతంలో కొంత మేర తారు రోడ్డు వేయగా డ్రైనేజి కాలువలు లేక వర్షపు నీరు, ఇండ్లలోనుంచి వచ్చిన మురికి నీరు రోడ్డు మధ్యలో నిలబడి రోడ్డంతా గుంతలు పడి తారురోడ్డు ఆనవాళ్ల లేకుండా పోయింది. ఈ రోడ్డు గుండా పాములపల్లి గ్రామం వెళ్లే రోడ్డు మెటల్ రోడ్డుగా ఉండగా ఇక్కడ కూడా డ్రైనేజి కాలువలు లేక నిరంతరం రోడ్డుపైనే నిలువ ఉంటుండటంతో రోడ్డంతా గుంతల మయమై, బురదమయమై నడిచేందుకు వీలుకాని పరిస్థితి నెలకొన్నది. సైకిళ్లు, స్కూటరిస్టులు ఈ బురదలో వెలుతూ నిత్యం జారిపడుతూ గాయాలపాలవుతున్నారు. ఈ మొత్తం రోడ్డులో ఒక వైపు నుంచి డ్రైనేజీ కాలువ నిర్మాణం గత వారంలో మొదలయింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మించి మొత్తం రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చి ఇబ్బందులు తీర్చాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.


నల్లబండ బజారులోని రోడ్డు దుస్థితి

7వ రోజుకు చేరిన తపాలా సమ్మె

గిద్దలూరు: డిమాండ్ల సాధన కోసం తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారానికి 7వ రోజుకు చేరింది. స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు ధర్నా చేశారు. స్పందన సేవా సంస్థ అధ్యక్షుడు పిక్కిలి పుల్లయ్య శిబిరం వద్ద ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ ఆందోళనా కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పఠాన్ అబ్దుల్ ఆజాద్‌ఖాన్, యూనియన్ నాయకులు క్రిష్టారెడ్డి, షహన్‌షా, భరత్‌కుమార్, విశ్వం, రహమత్ బాష తదితరులు పాల్గొనగా, పోస్టల్ అధికారి రంగస్వామి సమ్మెకు మద్దతు ప్రకటించారు.

బీజేపీ కార్యవర్గం

గిద్దలూరు: గిద్దలూరు రూరల్ మండల బీజేపీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా సారె ఓబులపతిని ఇటీవలే నియమించగా మిగతా కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ నాయకులు కె.వెంకటేశ్వరరావు, ఏనుగుల పద్మావతి తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసులు, బంగారు శ్రీనివాసాచారి, కె.తిరుపాల్‌రెడ్డి, కె.స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి మల్లారెడ్డి, కార్యదర్శులుగా ఎస్.శ్రావణ్, ఎస్.శ్రీనివాసరాజు, వై.విజయ్, కోశాధికారిగా కె.కృష్ణమాచారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

రుణాల మంజూరుకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

కొమరోలు: 2017-18 స్వయం ఉపాధి పథకంలో భాగంగా కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు బుధవారం నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో డి.నరసయ్య తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు మైనారిటీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. గురువారం బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాల కోసం, 28న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని ఎంపీడీవో కోరారు.

ఉచిత వైద్య శిబిరం

బేస్తవారపేట: మండలంలోని పిటికాయగుళ్లలో సర్పంచ్ నర్రా సత్యనారాయణరెడ్డి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కోటేశ్వరరావు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

పరమత సహనం పాటించడం మానవధర్మం

కంభం: పరమత సహనం పాటిస్తూ అన్ని మతాల వారి పండుగలను గౌరవిస్తూ అన్నదమ్ముల్లా ఐక్యంగా జరుపుకోవడం అభినందించదగ్గ విషయమని మార్కాపురం డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. ఈనెల 26న వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ రామానాయక్ అధ్యక్షతన జరిగిన శాంతిసంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను కొత్తగా ఈ ప్రాంతానికి బదిలీపై వచ్చిన హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు తామందరం ఒక్కటేనని మాలో కులమతబేధాలు లేవని ఒకరి మతాన్ని, ఆచారాలను తాము గౌరవిస్తామని చెప్పడం తనకు సంతోషంగా ఉందన్నారు. అందరం పండుగలను సుహృద్భావ వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కంభం చెరువులో నీరు లేనందున రామన్న కతువ వద్దకు, అలాగే కంభం చెరువు అలుగు, తూముల వద్ద ఉన్న కొద్దిపాటి నీళ్లలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నందున అందుకు తగ్గ బందోబస్తును ఏర్పాటుచేస్తామన్నారు. ఊరేగింపు సమయంలో ఎలా ఉండాలో పలువురు పెద్దలు ఇచ్చిన సలహాలు, సూచనలను పరిగణలోనికి తీసుకుంటామన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామానాయక్, డీటీ జితేంద్ర, ఫైర్ ఆఫీసర్ బాల చెన్నయ్య, జడ్పీటీసీ సయ్యద్ జాకీర్, కంభం సర్పంచ్ స్టార్‌బాష, వాసవి విద్యాసంస్థల ఛైర్మన్ గోళ్ళ సాంబశివరావు, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కంభం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జడ్పీటీసీ సయ్యద్ జాకీర్ అన్నారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సమావేశానికి ఎంపీపీ కొత్తపల్లి జ్యోతి అధ్యక్షత వహించారు. సయ్యద్ జాకీర్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు చెప్పే సమస్యలను చిరునవ్వుతో పరిష్కరించేందుకు ప్రయత్నించాలిగాని విసుగును ప్రదర్శించరాదన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో హనుమంతరావు, ఇరిగేషన్ డీఈ నాగార్జునరావు, ఉపాధిహామీ ఏపీవో ఏడుకొండలు, డీటీ జితేంద్ర, హౌసింగ్ ఏఈ సురేష్, వ్యవసాయాధికారి మీరయ్య, కంభం సర్పంచ్ స్టార్‌బాష, ఎంఈఓ మాధవకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులను అడ్డుకున్న రైతులు

పరిహారం ఇవ్వాలని డిమాండ్

రాచర్ల: వెలుగొండ ప్రాజెక్టు పైపులైన్ కాలువ పనులను గౌతవరం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం అడ్డుకున్నారు. తురిమెళ్ళ గ్రామం నుంచి గౌతవరం, రాచర్ల గ్రామాల మీదుగా కడప జిల్లా కు పైపులైన్ ద్వారా కాలువ పనులను గత కొన్ని రోజులుగా చేపట్టారు.

అయితే, కాలువ కింద పోయే పొలాలకు ప్రభుత్వం ఎకరాకు రూ.3.93 లక్షలు ప్రకటించింది. గౌతవరం గ్రామంలో 80 మంది రైతులకు చెందిన 40 ఎకరాల భూముల నుంచి ఈపైపులైన్ కాలువ వెళుతున్నది. ప్రస్తుతం పంట నష్టపోయామని, ఆ పంట నష్ట పరిహారం కూడా రైతులు కోరడంతో సం బంధిత గుత్తేదారు నిరాకరించారు. దీంతో కా లువ తీస్తున్న ఎక్స్‌కవేటర్‌ను రైతులు అడ్డుకుని తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని పనులను నిలిపివేశారు. దీనితో ప్రాజెక్టు అధికారులు, గుత్తేదారులు వెనుతిరిగారు.


కాలువ పనులను అడ్డుకుంటున్న రైతులు

పంట నమోదు చేసుకోవాలి

గిద్దలూరు: రైతులు తప్పనిసరిగా తాము సాగుచేసుకున్న పంటను నమోదు చేయించుకోవాలని, నమోదు చేసుకోకపోతే నష్టం జరిగిన సందర్భాలలో నష్ట పరిహారం పొందలేరని మండల వ్యవసాయాధికారి ఎస్ . రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కంచిపల్లి, అంబవరం గ్రామాలలో పత్తి, తదితర పంటలను పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. పత్తికి రసం పీల్చే పురుగు పట్టిందని కాన్ఫిడార్ వాడాలన్నారు. అలాగే బోరాన్, జింక్, మెగ్నిషియం లాంటి సూక్ష్మ పోషకాలు వాడాలన్నారు.

సమ్మె విజయవంతం

కంభం: బ్యాంకుల పరిరక్షణ, ప్రభుత్వ సంస్కరణలకు వ్యతిరేకంగా తాము చేపట్టిన దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెతోనైనా కేంద్ర ప్రభుత్వం దిగి రావాలని పలువురు బ్యాంకు ఉద్యోగులు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఇబ్రహీం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ముందు జరిగిన ధర్నాలో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలకు చెందిన బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సంద్భంగా బ్యాంకు యూనియన్ సెక్రటరీ ఎం.రాజేష్ మాట్లాడుతూ బ్యాంకుల విలీనాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. నిరర్థక ఆస్తుల మాఫీలను ఎత్తివేయాలని, ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసే వారిని శిక్షించాలన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకొని సామాన్య ప్రజానీకానికి బ్యాంకు సేవలను సులభంగా, చౌకగా అందించాలనే ఉద్దేశంతోనే తాము ఈ సమ్మెలో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

రాయితీ జమకాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

కొమరోలు: పెట్టుబడి రాయితీ రైతులకు తమ ఖాతాల్లో నగదు జమకాకుంటే వారు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మరలా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని రౌతుపల్లె, ద్వారకచర్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మెర్సీ మాట్లాడుతూ రాయితీపై ఆయిల్ ఇంజన్లు, పీవీసీ పైపులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీఈవో హనుమంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

బేస్తవారపేట: బేస్తవారపేట మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా డాక్టర్ పి.హుస్సేనయ్య, కార్యదర్శిగా కంభం శ్రీనివాసులు, కోశాధికారిగా సయ్యద్ నజీర్ బాష, ఉపాధ్యక్షులుగా పిక్కిలి గిరిధర్, సత్యేలి కృష్ణ, కో ఆర్డినేటర్‌గా పోసా వెంకటేశ్వర్లు కటకం రామకృష్ణ ఎన్నికకాగా, మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొర్రపాటి రామారావు ఆర్థిక సహాయంతో కుట్టమిషన్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి

ఎంపీడీవోకు సన్మానం

కంభం: కంభం మండల ఈవోఆర్డీగా, ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఆరు సంవత్సరాలుగా పనిచేస్తూ ఎంపీడీవో వేటపాలెంకు బదిలీపై వెళుతున్న నేతాజి మంచితనానికి మారుపేరుగా పేరుతెచ్చుకున్నారని ఎంపీపీ కొత్తపల్లి జ్యోతి, జడ్పీటీసీ సయ్యద్ జాకీర్, కంభం సర్పంచ్ స్టార్‌బాషా, తదితరులు కొనియాడారు. ఈ సందర్భంగా నేతాజీతో పాటు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళుతున్న చంద్రశేఖరను ఘనంగా సన్మానించారు.

రేపు విద్యా సంస్థల బంద్

గిద్దలూరు: కర్నూలు పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షునిపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల దాడిని నిరసిస్తూ గురువారం బంద్ నిర్వహిస్తున్నట్లు ఏపీటీసీఏ జిల్లా కార్యదర్శి పి.పరమేశ్వరరెడ్డి, జోన్ అధ్యక్షుడుజి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేమారెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గిద్దలూరు నియోజకవర్గంలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

గిద్దలూరు: వివిధ కార్పొరేషన్‌లలో ఉపాధి అవకాశాలకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఈ నెల 23 నుంచి తమ కార్యాలయం ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. క్రిష్ణమూర్తి తెలిపారు. బుధవారం మైనారిటీ, ఎస్టీ కార్పొరేషన్‌లకు సంబంధించి ఇంటర్వ్యూలు జరుగుతాయి. గురువారం బీసీ కార్పొరేషన్‌కు, 28న కాపు కార్పొరేషన్‌కు, 29న ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారందరూ తగిన డాక్యుమెంట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

సినిమాలు •

గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- ఫిదా
వెంకటేశ్వర	- లై
నటరాజ్	- జయ జానకి నాయక

అద్దంకిలో సెంటర్ పార్కింగ్ ప్రారంభం

అద్దంకి: అద్దంకి పట్టణం మెయిన్‌రోడ్డులో మంగళవారం నుంచి సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈరోడ్డులో రెండు వైపులా ఆక్రమణలు తొలగించిన తరువాత గత రెండు రోజుల నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు రోడ్డుకు మధ్యలో 6 అడుగుల వెడల్పుతో సెంటర్ పార్కింగ్ కోసం వైట్ మార్కింగ్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నగర పంచాతీ సిబ్బంది అన్ని షాపుల వద్దకు వెళ్లి వాహనాలను పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసుకునే విధంగా కొనుగోలుదారులకు చెప్పాలని సూచనలు చేశారు. ఈక్రమంలో ముందుగా షాపుల నిర్వాహకులు తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో ఉంచగా కొనుగోలుదారులు కూడా అదే బాటన వాహనాలను నిలిపారు. అయితే ఇంకా కొంతమంది మాత్రం పాత పద్దతిలోనే షాపుల ముందు వాహనాలు ఉంచుతుండటంతో ట్రాఫిక్‌కు కొంతమేర ఇబ్బంది కలుగుతుందని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఆక్రమణలు తొలగించిన తరువాత ఆ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయకపోవడం, విద్యుత్ స్తంభాలను మార్జిన్‌లోకి మార్చకపోవడంతో కొంతమేర అసౌకర్యంగా ఉందని, నగర పంచాయతీ అధికారులు ఆయా పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మెయిన్ రోడ్డులో సెంటర్‌పార్కింగ్‌లో ఉంచిన వాహనాలు

పారిశుధ్య కార్యక్రమాలపై అశ్రద్ధ వద్దు : ఆర్డీవో

అద్దంకి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ఆర్డీవో శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం అద్దంకి గీతామందిరం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీ, పారామెడికల్ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వెంటనే తనకు తెలియజేయాలని మెడికల్ అధికారులకు సూచించారు. ఇటీవల ద్వారకానగర్‌లోని బాలునికి డెంగ్యూ సోకటానికి గల కారణాలను మోదేపల్లి డాక్టర్ విజయ్‌చంద్రను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ సోకిన ప్రదేశంలో పారిశుధ్య నిర్వహణపై ఎటువంటి చర్యలు చేపట్టారని మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. కాగా సమావేశానికి హాజరు కాని అద్దంకి, సంతమాగులూరు మండలాల్లోని కార్యదర్శులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో హేమాద్రి నాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజన్‌నాయుడు, దేవాదాయశాఖ అసిస్టెంట కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఏపీజీబీ : ఆర్ఎం

పంగులూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలను అందిస్తుందని ఒంగోలు రీజనల్ మేనేజర్ పీవీ.ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముప్పవరం, పంగులూరులోగల ఏపీజీబీ శాఖల పనితీరును పరిశీలించిన ఆర్ఎం ఖాతాదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను మంగళవారం పంగులూరులో విలేఖర్లకు వివరించారు. ఒంగోలు రీజన్ పరిధిలో గల 72 శాఖల్లో 1150 కోట్లు డిపాజిట్లు కలిగి ఉండగా 1410 కోట్లు రుణాలుగా ఇవ్వడం జరిగిందన్నారు. 90 శాతం రికవరీతో సాధించడం ద్వారా రుణ మొత్తాలను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. గేదెలు, గొర్రెలు, మైనార్ ఇరిగేషన్, ట్రాక్టర్లు, గృహరుణాలు, ఉన్నత చదువుకోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రూ.20 లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఎలాంటి తనఖా లేకుండా రైతులకు ట్రాక్టర్లు, కార్ల కొనుగోలుకు రుణ వసతి కల్పిస్తున్నామని ప్రతాప్‌రెడ్డి చెప్పారు. రైతులు క్రాప్‌లోనే తీసుకున్నా దానితో సంబంధం లేకుండా వాహనాల కొనుగోలు రుణం ఇస్తామని, ఎస్ఆర్‌టీవో కింద ట్రాన్స్‌పోర్టు వాహనాల కొనుగోలుకు 15 శాతం మార్జిన్‌తో లభిస్తుందన్నారు. పంట రుణాలు ఏడాదిలోగా చెల్లించి ప్రభుత్వాలు ఇచ్చే వడ్డీ రాయితీని రైతులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సీవీ.రామేష్‌బాబు బీఎం శ్రీనివాస్‌దేవ్, సిబ్బంది పాల్గొన్నారు.



పంగులూరులో బ్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రతాప్‌రెడ్డి

బ్యాంకింగ్ వ్యవస్థను ప్రైవేటీకరణ తగదు



అద్దంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

అద్దంకి రూరల్: కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేయటం హేయమైన చర్య అని స్టేట్ బ్యాంక్ స్టాఫ్ యూనియన్ జోనల్ సెక్రటరీ బి.సుధాకరరావు అన్నారు. యుఎఫ్‌బీయూ బ్యాంక్ ఎంప్లాయిస్ పిలుపు మేరకు మంగళవారం అద్దంకి పట్టణంలోని బ్యాంక్‌లను మూసి వేసి సిబ్బంది తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల మొండి బకాయిలను వసూలు చేయడానికి తగిన అనుమతులు ఇవ్వకుండా బ్యాంక్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. బ్యాంక్ ఉద్యోగుల జీతాలు పెంచకుండా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రవేశ పెట్టటం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని ఆయన కోరారు.

ఇబ్బందిపడిన ఖాతాదారులు

బల్లికురవ: ఉద్యోగుల సమ్మెతో జాతీయ బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. కొణిదెన గ్రామంలోని స్టేట్ బ్యాంకు, అంబడిపూడిలోని ఆంధ్రబ్యాంకులు తెరుచుకోలేదు. ఖాతాదారులు బ్యాంకులు మూత పడటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు ఏటీఎం కూడా పనిచేయకపోవడంతో నగదుకు అవస్థలు ఎదుర్కొవాల్సి వచ్చింది

రైతులందరికీ రిమోట్ మోటార్లు : ఏడీఈ

సంతమాగులూరు: రైతులందరూ ఇంటి వద్ద నుంచే పొలానికి నీరు పెట్టుకునే విధంగా రిమోట్ ద్వారా పనిచేసే మోటార్లు రైతులకు ఉచితంగా ఇవ్వటం జరుగుతుందని విద్యుత్ ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సంతమాగులూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద రైతులకు విద్యుత్ ఆదా చేసే మోటార్లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రైతులు వినియోగించుకుంటున్న మోటార్లను ప్రభుత్వం తీసుకుని వారికి విద్యుత్ ఆదా చేసే మోటార్లు, రిమోట్ ద్వారా పనిచేసే 5హెచ్‌పీ మోటార్లను ఉచితంగా ఇవ్వటమే కాక ఐదేళ్ల పాటు మెయింటెనెన్స్ కూడా ప్రభుత్వమే చూసుకుంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం జిల్లాకు 10 వేల మోటార్లు మార్చేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, లైన్‌మన్‌లు ఆంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ ప్లీనరీను జయప్రదం చేయండి : గరటయ్య

సంతమాగులూరు: అద్దంకిలోని వైసీపీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జరిగే ప్లీనరీను జయప్రదం చేసేందుకు బూత్ కమిటీ సభ్యులందరూ కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త బాచిన చెంచుగరటయ్య కోరారు. మంగళవారం పుట్టావారి పాలెం కేఎంసీ అతిథిగృహంలో బూత్ లెవల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మెత్తం 254 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇప్పటికే ప్రతి బూత్‌కు 11మంది సభ్యులను కమిటీలుగా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అద్దంకిలో జరిగే ప్లీనరీను కార్యకర్తలందరూ గ్రామాల నుంచి బైక్‌లపై ర్యాలీగా రావాలని కార్యకర్తలకు సూచించారు. పుట్టావారిపాలెం చెందిన 10 ముస్లిం కుటుంబాల వారు గరటయ్య సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో విజయరెడ్డి, షేక్ ఆదాం షఫీ, కుంచాల వెంకటేశ్వర్లు,బత్తుల శ్రీనివాసరాయుడు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

బల్లికురవ: సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంటల సాగులో పెట్టుబడి తగ్గి రైతులకు ఎంతో లాభం కలుగుతుందని ఏవో రవిబాబు తెలిపారు. మంగళవారం బల్లికురవ మండంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఇదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, సుబ్బయ్య సేంద్రియ వ్యవసాయంతో సాగు చేస్తున్న వంగ తోటలను పరిశీలించి అభినందించారు. రైతులంతా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఏఐజెడీఎస్‌యూ ఉద్యోగులకు మద్దతు

చీరాల: గత కొద్ది రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న ఏఐజెడీఎస్‌యూకు మద్దతుగా భారత్ యూనియన్ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు మార్క్ తదితరులు పాల్గొన్నారు. ఏడు రోజులుగా కొనసాగుతన్న రిలేదీక్షలో శిబిరంలో టి.రమేష్‌బాబు, రమణమూర్తి, రామాంజనేయులు,ప్రసాద్, శ్రీను, మీరఖాన్, మోహన్‌రావు, ఏడుకొండలు, మధు, అంకయ్య, అనీల్‌లు కూర్చున్నారు.

రాష్ట్ర టూరిజం దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

చీరాల : రాష్ట్ర టూరిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చీరాల చైతన్యభారతి డిగ్రీ కళాశాలలో టూరిజంశాఖ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం శాఖపరంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను, తీరప్రాంతంలో టూరిజంశాఖ పరంగా చేపడుతున్న నూతన కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్‌పెయింటింగ్, క్విజ్, ఫొటోగ్రఫీ, పేపర్‌ప్రజంటేషన్‌లపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టూరిజంశాఖ జిల్లా కో ఆర్డినేటర్‌లు డాక్టర్ శివాజీ, డాక్టర్ కృష్ణ, పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు పత్తి సుబ్బారావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, డైరక్టర్ ముంగర రాంబాబు, అధ్యాపకులు సాయిస్వాతి, ఉస్మాన్, సురేష్, పాల్గొన్నారు.

యూజీసీని వెంటనే అమలు పరచాలి

శింగరకొండ(అద్దంకి రూరల్): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏడో వేతన సంఘం నివేదిక తెలియపరచక పోవటం, అమలు చేయటంలో జాప్యాన్ని నిరసిస్తూ ఆల్‌ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ, కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు మంగళవారం శింగరకొండ కేఆర్‌ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ కళాశాల యూనియన్ ప్రెసిడెంట్ కె.భాస్కర్, కార్యదర్శి కె.ప్రభుదాస్, జీసీటీఏ జిల్లా సెక్రటరీ ఎన్‌వీ.రమణ, జోనల్ ప్రెసిడెంట్ బి.అశోక్ కుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

అద్దంకి రూరల్: ఎల్ఐసీ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఏజెంట్లు అందరూ కలిసి పనిచేయాలని ఎస్‌బీఎం సుబ్బారావు కోరారు. మంగళవారం అద్దంకిలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్‌ల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎల్ఐసీలో ప్రజలకు ఉపయోగకరమైన కొత్త పాలసీలు వచ్చాయని, వాటిని ప్రజలకు వివరించి వారికి అత్యధిక రిటర్న్ వచ్చే వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవో మధుసూదనరావు, ఏవో సుబ్బారావు, ఏబీఎం వెంకటస్వామి పాల్గొన్నారు.

మిలీయం మార్చ్‌ను జయప్రదం చేయండి

అద్దంకి రూరల్: మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఎంఈవో నూనె విజయ్‌కుమార్ మంగళవారం అద్దంకి సీఆర్సీ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగిఏ మిలీనియం మార్చ్‌కు అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు సర్వేశ్వరరావు, జయరావు, ఎం.నాగరాజు, పూర్ణబ్రహ్మజీ, కోటినాయక్, జాషువా, అన్వర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకులు

బీమాతో భరోసా



ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు వరం

అవగాహనలేక పొందలేకపోతున్న వైనం

ఎర్రగొండపాలెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖ ద్వారా కార్మికులకు అందిస్తున్న బీమా పథకాన్ని ఉపాధిహామీ కూలీలకు కూడా వర్తింపజేస్తున్నారు. దీనిపై అవగాహనలేక చాలామంది వినియోగించుకోలేకపోతున్నారు. ఇప్పుడు అందరికీ చంద్రన్న బీమా పథకం ఉంది కదా అని చాలామంది సరిపెట్టుకుంటున్నారు. అయితే, చంద్రన్న బీమాలో కొన్ని రాయితీలు మాత్రమే ఉండగా కార్మికశాఖ ద్వారా అమలుచేస్తున్న బీమాలో అదనపు అవ కాశాలు ఉన్నాయి.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలుచేస్తున్నది. ఉపాధి కూలీల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రమాదావశాత్తు కూలీలు మరణించినా అంగవైకల్యం పొందినా వారి కుటుంబం వీధిన పడకుండా బీమా పథకాన్ని వర్తింపజేస్తుంది. భవన నిర్మాణ కార్మికులకు వర్తింపజేసే బీమా సౌకర్యాలను ఉపాధికూలీలకు కూడా వర్తింపజేస్తూ వారికి లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. చంద్రన్న బీమా పథకం ఉందన్న ధీమాతో ఈ పథకాన్ని కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం ఉపాధి హామీలో 7,29,273 జాబ్‌కార్డుల్లో 13లక్షల మందికి పైగా కూలీలు ఉన్నారు. వారిలో 6,91,657 మంది పురుషులు, 6,86,549 మంది మహిళలు ఉన్నారు. సగటున ప్రతిఏటా పనులకు వస్తున్న వారు రెండు లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరంతా ఈ పథకం ఉపయోగాలు తెలుసుకుని బీమా ప్రీమియం చెల్లించినట్లయితే ప్రయోజనం పొందవచ్చు.

పథకం పొందేందుకు చేయవల్సింది

కార్మికుల బీమా పథకాన్ని ఉపాధి హామీ కూలీలు పొందాలంటే ఒక్కొక్కరికి సభ్యత్వ నమోదుకు రూ.50, నెలకు ఒక రూపాయి చొప్పున అయిదేళ్లవరకు రూ.60 మొత్తం బీమా కోసం రూ.110 కార్మికశాఖ అందించే ఫార్మెట్ ప్రకారం చలానాను ఆంధ్రాబ్యాంకులో తీయాలి. అనంతరం ఉపాధి సిబ్బంది, కార్మికశాఖ అధికారులు కలిసి వారి వద్ద ఉన్న దరఖాస్తును పూరించి నిబంధనల ప్రకారం సంవత్సరంలో 50 పనిదినాలు చేసినట్లు ఆన్‌లైన్ పత్రం, రెండు ఫొటోలు, రేషన్‌కార్డును జతచేసి సంబంధిత అధికారులకు లేదా నేరుగా కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లి అందజేయాలి. దీని ద్వారా ఈ పథకంలో వారు నమోదవుతారు.

ఎవరు అర్హులు

భవన నిర్మాణ కార్మికుల బీమా పథకం ఉపాధి హామీ కూలీలకు కూడా వర్తించాలంటే ఉపాధి పథకంలో సంవత్సరంలో కనీసం 50 రోజులు పనిచేసి ఉండాలి. 50 రోజులు పనిచేసినట్లు తప్పనిసరిగా సంబంధిత ఏపీవో ద్వారా ఆన్‌లైన్ పత్రాన్ని కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాలి. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం గుర్తింపుకార్డులను అందజేస్తుంది.

పథకం ద్వారా పొందే సాయం

- దరఖాస్తు చేసుకుని గుర్తింపుకార్డు పొందిన వ్యక్తి సాధారణ మరణం పొందితే రూ. 30 వేల ఆర్థికసాయం అందజేస్తారు.
- మహిళా కూలీలైతే ప్రసూతి సమయంలో కాన్పు ఖర్చులకోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తారు.
- కూలీల కుమార్తెలకు వివాహం చేయాల్సి వస్తే అందుకు ఖర్చుల కింద రూ.10 వేలు, ప్రసూతి సమయంలో కూడా రూ.20 వేలు ఆర్థికసాయం అందజేస్తారు.
- దరఖాస్తుదారులు అనారోగ్యంతో వైద్యశాలలో చేరితే రూ.9వేలు ఖర్చులకోసం ఇస్తారు.
- ఒకవేళ ప్రమాదంలో మరణించినట్లయితే రూ.5 లక్షల ఆర్థిక సాయం కుటుంబానికి ఇస్తారు.

చంద్రన్న బీమా ద్వారా అందే ప్రయోజనం

- ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు అందజేస్తారు.
- సాధారణ మరణం సంభవిస్తే రూ.30 వేలు చెల్లిస్తారు.
- అంగవైకల్యం కలిగితే రూ.3,62,500 అందజేస్తారు.
- 9,10, ఇంటర్ విద్యార్థులున్నవారికి ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లలకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. (కార్మికశాఖ అందించే ఇతర రాయితీలు చంద్రన్న బీమాలో లేవు)

ఉపాధి కూలీలందరికి ఈ పథకాలపై అవగాహన కల్పించి వారిని కార్మికశాఖ అందించే బీమాలో నమోదు చేసుకునేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ప్రభుత్వం అందించే పలు రాయితీలు పొందే వీలుంటుంది.

సుబాబుల్, జామాయిల్ రైతులకు న్యాయంచేయాలి

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలు జరిగేలా చూడాలి

మార్కెటింగ్ శాఖ కమిషనర్‌ను కోరిన రైతు సంఘాల నేతలు

ఒంగోలు కలెక్టరేట్: సుబాబుల్, జామాయిల్ కర్రకు ప్రభుత్వం నిర్ణయించిన ఒప్పంద ధరలు అమలు కాకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని, గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. గుంటూరులో మంగళవారం మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్‌ను కలిసి సుబాబుల్, జామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 143జీవోతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ జీవోలోని జె క్లాజును తొలగించి జిల్లాలో ప్రకటించిన ఒప్పందంలో జామాయిల్ కర్రకు రైతులే తాట తీసి, సరఫరా చేయాలనే నిబంధనలను తొలగించాలని కోరారు.

జిల్లాలో జామాయిల్, సుబాబుల్‌కు టన్ను రూ. 1800 నుంచి రూ.2100 వరకు మాత్రమే ధర లభిస్తుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ రూ 3700 వరకు ధర లభిస్తుంది కదా అని రైతు సంఘ నేతలను ప్రశ్నించారు.

దీనిపై చుండూరి రంగారావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో ధరకు కొనుగోళ్ళు చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ధర అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అచార్య రంగ కిసాన్ సంస్థ కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ 1999లో జారీ చేసిన 188 జీవో ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ధర విధానం అమలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ జిల్లాకు ఆ జిల్లాలో ధరలు నిర్ణయించడం వల్ల ప్రకాశం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకొని సుబాబుల్, జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెడ్డి, సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమారెడ్డిలు మాట్లాడుతూ ఎస్‌పీఎం కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలను రైతులకు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నల్లధనం సృష్టికి కారకులైన భద్రాచలం పేపర్ మిల్లు ఉద్యోగులపై చర్యలు తీసుకొని జిల్లాలో పేపర్ మిల్లు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆయా అంశాలపై స్పందించిన కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో సుబాబుల్, జామాయిల్ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సుబాబుల్, జామాయిల్ కర్రకు మద్దతు ధరపై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రైతు సంఘాలను కూడా ఆహ్వానించే విధంగా చర్యలు తీసుకుంటానని రైతు సంఘాల నేతలకు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి రమేష్, నల్లమాలపు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సంక్షేమ పథకాలకు రూ.840 కోట్లు

గిద్దలూరు: లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ పథకాలకు రూ.840 కోట్లు కేటాయించిందని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ కపిల్ బాషా అన్నారు. స్థానిక షాదీఖానా ఆవరణలో మంగళవారం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ మైనారిటీ సంక్షేమ పథకాలపై జరిగిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సబ్సిడీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మైనారిటీల సంక్షేమం కోసం దుల్హాన్ పథకం, మౌజన్ పథకం, ఇమామ్‌లకు వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడీ సయ్యద్ సిరాజుల్లా మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక సబ్సిడీ పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిద్దలూరు ప్రాంతానికి రుణాల లక్ష్యాలను పెంచాలని టీడీపీ మైనారిటీ నాయకులు షేక్ యూసఫ్ అలీ కోరారు. సమావేశంలో ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం కన్వీనర్ షేక్ గుడిసె మహబూబ్ బాషా, మైనారిటీ సంఘాల నాయకులు పి.జుల్ఫుల్లాఖాన్, పి.ఖాదర్‌ఖాన్, పి.పెద్ద సయ్యద్‌మియా, షేక్ చాంద్‌బాషా, ఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు షేక్ మౌళాలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిల్‌బాషా

పీవీఆర్‌కే ప్రసాద్‌కు ఘన నివాళి

ఒంగోలు కార్పొరేషన్: హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించిన సనాతన సారథి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ అని హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ అళహరి చెంచలరావు అన్నారు. మంగళవారం ప్రసాద్ సంస్మరణ సభను స్థానిక సంతపేటలోని షిరిడి సాయి మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ట్రస్ట్ ఛైర్మన్‌గా ఆయన సేవలను కొనియాడారు. ఆయన దిశ, నిర్దేశాలను జిల్లా కమిటీ కొనసాగిస్తుందన్నారు. సభ్యులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా ఉన్నపుడు తిరుమల అభివృద్ధికి ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కె.కుసుమకుమారి, తన్నీరు శ్రీనివాసరావు, యూవీ.రత్నం, పలువురు పాల్గొని నివాళులు అర్పించారు.

ఫెన్సింగ్ కేంద్ర కమిటీ సభ్యుడుగా నాగేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్: ఫెన్సింగ్ అసోసియేషన్ కేంద్ర కమిటీ సభ్యులుగా నగరానికి చెందిన వి. నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈనెల 20న చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో జరిగిన ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికలలో నాగేశ్వరరావును ఏకగ్రీవంగా నియమించారు. ప్రస్తుతం ఆయన ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా, జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

హౌసింగ్ ఫర్ ఆల్ అందరూ ఉపయోగించుకోవాలి

ఒంగోలు కార్పొరేషన్: పట్టణ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి యోజన హౌసింగ్ ఫర్ ఆల్‌ను అందరూ ఉపయోగించుకోవాలని నగర కమిషనరు సంకురాత్రి వెంకట కృష్ణ కోరారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో హౌసింగ్ ఫర్ ఆల్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజి, క్లాస్ ఎంఐజి-1, క్లాస్ ఎంఐజి 2 విభాగాలలో నివాసాలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు కార్పొరేషన్ కార్యాలయంలో అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అందుకు సంబంధించిన వివరాలను, ఒక్కో ప్లాట్‌కు అయ్యే వ్యయం, ఇతర వివరాలను తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనరు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు లెక్చరర్ల సమావేశం

ఒంగోలు విద్య: అసోసియేషన్స్ ఆఫ్ ప్రయివేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ (ఏపీఎల్‌టీ) సమావేశాన్ని గురువారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నట్లు ఏపీఎల్‌టీ ప్రతినిధులు దారా మోహనరావు, డాక్టర్ నూకతోటి రవికుమార్‌లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన డిగ్రీ పరీక్షల మూల్యాంకనం నిధులు నాలుగు నెలలు గడిచినా విడుదల కానందున పోరాట కార్యాచరణకు సంసిద్ధం కానున్నట్లు వారు తెలిపారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదురుగా ఉన్న రూట్స్ సెంటర్ ఫర్ ఇంగ్లీషు కార్యాలయంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రయివేటు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

న్యాయవాద చట్టసవరణ విరమించుకోవాలి

ఒంగోలులీగల్: న్యాయవాద వృత్తి స్వతంత్రతను దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న న్యాయవాద చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అఖిలభారత న్యాయవాదుల సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు యడవల్లి రమేష్, జిల్లా అధ్యక్షుడు కె.శంకర్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందితే న్యాయవాదులకే కాకుండా కక్షిదారులకు కూడా నష్టం కలుగుతుందన్నారు. ఈ బిల్లు ద్వారా న్యాయవ్యవస్థకు సంబంధంలేని వ్యక్తులను బార్ కౌన్సిల్‌లో ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమంలో న్యాయవాదులంతా పాల్గొనాలని కోరారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విందు వినోదాలు, వేడుకలకు ఖర్చులు అంచనాలు మించు తాయి. ఆరోగ్యం, ఆహార విషయాలపై శ్రద్ధ చూపిం చాలి. రిటైల్, హోటల్, వైద్య రంగాల వారికి వృత్తిప రంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతములతో ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొం టారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. పెట్టుబడుల్లో నిదానం అవసరం. లాభిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రియల్ ఎస్టేట్, రిటైల్, గృహనిర్మాణ రంగాలు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరులు, బంధుమిత్రులను కలుసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాల్లో కొంత అసౌకర్యానికి గురవుతారు. ఒక సమాచారం కలవరపెడుతుంది. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియత ముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడుకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయండి. షాపింగ్‌లో వస్తువుల నాణ్యత గమనించండి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. వ్యక్తి గత అవసరాల కోసం ఖర్చు చేస్తారు. కీలక నిర్ణ యాలు వాయిదా వేయండి. మీ నిర్ణయాలను సమీక్షించుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రయాణాల్లో చికాకులు తప్పకపోవచ్చు. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బృంద కార్యక్రమాల్లో అసౌకర్యానికి గురవుతారు. స్నేహి తులు, ప్రియతముల కోసం ఖర్చులు అధికం.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మర్యాద లకు భంగం కలిగే అవకాశంఉంది. కుటుంబ పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సృజ నాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.



మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): సమావేశాలు, బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలు,వర్తులు సత్ఫలితా లను ఇవ్వకపోవచ్చు. ఒక సమాచారం ఆందో ళన కలిగిస్తుంది. న్యాయ,బోధన, కన్సల్టెన్సీ రంగాల వారికి శుభప్రదం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మనసును ఏదో వెలితి వెంటాడుతుంది. పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. క్రయవిక్రయాలలో నాణ్యత గమనించండి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమి త్రులతో వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. కొత్త పరిచయాలు లాభిస్తాయి. సాహస ప్రయత్నాలకు, పందాలకు అనుకూల సమయం కాదు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

తలసీమియా రోగుల కోసం రిమ్స్‌లో రెండు వార్డులు

● ఎన్టీఆర్ వైద్యసేవ కింద సేవలను ప్రారంభించిన రిమ్స్ డైరెక్టర్



తలసీమియా వార్డును ప్రారంభిస్తున్న డైరెక్టర్ వల్లీశ్వరి



రిమ్స్‌లో తలసీమియా రోగుల వార్డు

ఒంగోలునగరం: తలసీమియా వ్యాధి ప్రాణాంతక కష్టమైనది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గిపోయి ప్రాణాలు తీసే వ్యాధి ఇది. జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తలసీమి యా వ్యాధి వస్తే రక్తంలోని హిమోగ్లోబిన్‌ను బట్టి కొత్తగా రక్తం ఎక్కించాల్సి ఉంది. వ్యాధి తీవ్రతను బట్టి నెలలో రెండు మూడు సార్లు కూడా రక్తంఎక్కించాల్సి ఉంటుంది. ఇక నెల వారీ మందులు రూ.5 వేల నుం చి రూ.10వేల ఖర్చు అవుతాయి. ఈ సేవలన్నీ జిల్లాలో ఇప్పటి వరకు అందుబాటులో లేవు. దీంతో జిల్లాలోని తలసీమియా పిల్లలకు రాష్ట్రంలోని హైద రాబాద్, ఇతర రాష్ట్రాల్లో చెన్నై, బెంగుళూరు వంటి నగరాలకు తీసుకుపోయి వైద్యం అందించాల్సి వచ్చేది. పేదలకు ఇది తలకు మించిన భారంగా ఉండేది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఇటీవల తలసీమియా వ్యాధిని కూడా ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేర్చింది. అయితే ఈ సేవలు ఇప్పటి వరకు జిల్లాలో అందుబాటులోకి రాలేదు. మంగళ వారం నుంచి ఈ సేవలను రిమ్స్ వైద్యశాలలో ప్రా రంభించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ సేవలను ఉచితంగా అందిస్తారు. ఇందుకోసం రిమ్స్ వైద్యశాలలో ప్రత్యేకంగా రెండు వార్డులను కేటాయించారు. మొత్తం 40 బెడ్లు తలసీమియా రోగుల కో సం అందుబాటులో ఉంచారు. తలసీమియా రోగులకు ఉచిత సేవలను మంగళవారం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వల్లీశ్వరి ప్రారంభించారు.

జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ ఇప్పటికే 43 తలసీమియా రోగులను గుర్తించింది. వీరికి ఈ వార్డుల్లో అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందజేస్తారు. వారికి రక్తం ఎక్కించటం, మందులు ఉచితంగా అందించటం, వారికి తిరుగు ప్రయాణానికి అయ్యే ఖర్చులు చెల్లిం చటం వంటి సేవలు మంగళవారం నుంచి అంద బాటులోకి వచ్చాయి. తలసీమియా వైద్యసేవలు ప్రారంభం సందర్భంగా ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న తలసీమియా రోగులకు ఇక నుంచి నాణ్యమైన సేవలు అందుబాటులోకి తెచ్చా మన్నారు. వైద్య ఒకోసం రోగులు ఇతర ప్రాంతాలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. వారికి అవసరమైన అన్ని సేవలను ఎన్టీఆర్ వైద్యసేవ కింద అందిస్తామ న్నారు. ఈ సేవలు అందించినందుకు రిమ్స్ వైద్యులకు కూడా తగిన పారితోషికం అందజేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 43 మంది తలసీమియా చిన్నారులు ఉంటే వారిలో 20 మందికి సేవలు ప్రారంభించిన తొలి రోజునే వైద్య సేవలు అందించామని చెప్పారు. వైద్య సేవలు ప్రారంభ కార్యక్రమంలో రిమ్స్ సూప రింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ నాయక్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా మేనేజర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనంపాడులో పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు, రేకుల షెడ్ - రూ.1.5లక్షల నష్టం



పిడుగుపాటుకు దెబ్బతిన్న రామారావు ఇంటి ముందు భాగం

అద్దంకి: మండలంలోని బొమ్మనం పాడులో సోమవారం అర్ధరాత్రి దాటిన తర వాత 1.25 గంటలకు పిడుగులు పడి చెన్ను పాటి రామారావు కు చెందిన రెండు అంతస్తుల ఇంటి ముందు భాగం లోని ఎలివే షన్ దెబ్బతింది. ఎలివేషన్‌తో పాటు బిగించిన అద్దాలు కూడా పగిలి పోయాయి. ఇంటి ఎలివేషన్ పెచ్చులు ఊడి పలు ప్రాంతాలు పడ్డాయి. ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్ పై కూడా పెచ్చులు పడి రేకులు పగిలాయి. పిడుగు పాటుకు ఇంట్లో ఉన్న విద్యుత్ వైరింగ్ దెబ్బతింది. దీంతో విద్యుత్ ఆధారంగా ఉన్న వస్తువులు మాడిపోయాయి. సమీపంలో ఉన్న మరో మూడు ఇళ్ళ లో ఫ్యాన్ లు తదితర వస్తువులు పనిచేయటం లేదు. సుమారు 1.50 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు భావి స్తున్నారు. పిడుగు పడ్డ సమయంలో ఒక్కసారి గా పెద్ద శబ్దం రావటంతో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఆందోళన కు గురయ్యారు. పిడుగు పాటుకు గురైన ఇంటిని తహసీల్దార్ బ్రహ్మయ్య, వి ఆర్ ఓ బాషా పరిశీ లించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.



పగిలిన రేకుల షెడ్డు

రెవెన్యూ శాఖలో పదోన్నతులు

● ఫైల్‌కు కలెక్టర్ ఆమోదం

● నేడు ఉద్యోగులకు కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్ : రెవెన్యూ శాఖలో గత కొన్నేళ్ళ నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు జిల్లా కలెక్టర్ వాడరేవు విన య్‌చంద్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలో వివిధ మండలాల్లో జూనియర్ అసిస్టెంట్లు అన్ని రకాల టెస్ట్ ఉత్తీర్ణులై రెవెన్యూ ఇన్ స్పెక్టర్(ఆర్ఐ)ల పదోన్నతుల కోసం ఎదు రు చూస్తున్నారు. కొంతకాలంగా జూ నియ ర్ అసిస్టెంట్లు పదోన్నతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికా రులను కలిసి సమస్యను వివరించారు. జి ల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి పదోన్నతుల జాబితాను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్న 39 మంది ఉద్యోగులకు ఆర్ఐ లుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఆర్ఐలకు పోస్టింగ్‌లు కూడా ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. పదో న్నతి పొందిన 39 మంది ఉద్యోగులకు బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో కౌన్సె లింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో జిల్లాలో ఖాళీల ప్రకారం భర్తీ చేయను న్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు జిల్లా అధికారులు సమాచారం పంపారు. మరో వైపు జిల్లాలో ఆర్ఐ పోస్టుల ఖాళీల వివరాలను కూడా సిద్ధం చేశారు. బదిలీల కౌన్సిలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు.

అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో యువకుల డిష్యూం..డిష్యూం



విద్యార్థులను చెదరగొడుతున్న ఎస్ఐ సుబ్బరాజు, సిబ్బంది

అద్దంకి: అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వేదికగా త రచూ విద్యార్థుల మధ్య ఘర్షణలు చోటు చేసుకు టున్నాయి. మంగళవారం సాయంత్రం రెండు డిగ్రీ కళాశాలల విద్యార్థుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. పంగులూరుకు చెందిన ఓ విద్యార్థిని అద్దంకి పట్టణం లోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదు వుతోంది. ఈ నేపథ్యంలో మరో డిగ్రీ కళాశాలలో చదు వుతున్న అద్దంకి పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆ యువతి పట్ల కామెంట్లు చేస్తూ వేధిస్తున్నా డు. దీంతో విద్యార్థిని తీవ్రంగా స్పందించి చెప్పుతో కొడ తానని హెచ్చరికలు కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే 10 రోజుల క్రితం ఒకసారి రెండు కళా శాలల విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. తిరిగి వేధింపులు కొనసాగుతుండటంతో ఆ విద్యార్థిని విష యాన్ని తన సోదరుడు అయిన విద్యార్థి దృష్టికి తీ సుకు పోయింది. ఈ నేపథ్యంలో యువతిని వేధింపు లకు గురి చేస్తున్న విద్యార్థి మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉండటంతో యువతి తరపు విద్యార్థులు దాడికి దిగారు. దీంతో ఇరు వర్గా లకు చెందిన పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడకు చేరుకొని తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగారు. విధుల్లో ఉన్న హోంగార్డు భాస్కరరావు ఇరు వర్గీయుల ఘ ర్షణను వారించేందుకు యత్నించినా లాభం లేకపో యింది. సుమారు అర్ధగంట పాటు ఇరువర్గీయుల విద్యార్థులు ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుబ్బరాజు సిబ్బందితో వచ్చి లాఠీలకు పనిచెప్పడంతో విద్యార్థులు పరుగులు తీశారు. ఘర్షణలో పాలు పంచుకున్న ముగ్గురు విద్యార్థులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ఘర్ష ణ బాధ్యులైన రెండు కళాశాలల విద్యార్థులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు వి వరాలు సేకరించి తల్లిదండ్రులను కూడా పిలిపించి మాట్లాడతామని ఎస్ఐ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సాయంత్రం సమయంలో అదనంగా పోలీసు సిబ్బం దిని కేటాయించనున్నట్లు చెప్పారు.

మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

మెంటల్ ఎబిలిటీ

1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు

2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు

6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people

7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck

8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156

9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5

10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM

13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529


14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్

15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు

16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు

17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు

18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?



ఎ) 260 బి) 220 సి) 280 డి) 240

19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

L_8	N_4	M_{80}
M_4	L_3	N_{25}
N_6	M_8	?


ఎ) L_{100} బి) N_{80} సి) M_{60} డి) L_{120}



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?



ఎ) 172 బి) 186 సి) 144 డి) 196

21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు

22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు

23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV

24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP

25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV

26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు

27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు

28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం

29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19

30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు

31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
సి) గం. 11.15 ని. డి) గం. 11.30ని.

32. అజయ్‌కు అతని తల్లిదండుల పెళ్లి రోజు నవంబరు 11, 15ల మధ్య అని గుర్తు. అతని సోదరి ఆర్తికి నవంబరు 13, 17ల మధ్య అని గుర్తు. అయితే వారి తల్లి దండ్రుల పెళ్లి రోజు ఎప్పుడు?
ఎ) నవంబరు 15 బి) నవంబరు 13
సి) నవంబరు 14 డి) ఏదీకాదు

33. (36 X 1/4) of 4 ÷ 6 x 2 - 8+6ను సూక్ష్మీకరించండి?
ఎ) 36 బి) 10 సి) 42 డి) ఏదీకాదు

34. P అంటే ÷, Q అంటే x, R అంటే -, S అంటే + అయితే 36P4Q5R8S4 విలువ ఎంత?
ఎ) 41 బి) 39 సి) 45 డి) ఏదీకాదు

35. కింది వానిలో సరైన దానిని తెలపండి
ఎ) 18 ÷ 3 X 4 - 5 + 3 = 20
బి) 25 ÷ 5X 3 - 6 + 4 = 15
సి) 35 ÷ 7X 6 - 4 + 7 = 33 డి) ఏదీకాదు

36. SHIPCYS పదంలోని అక్షరాల స్థానాలను మార్చగా ఒక పాత్యాంశం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి అక్షరం ఏమిటి?
ఎ) H బి) P సి) I డి) ఏదీకాదు


37. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్య ఏర్పడే పదాన్ని తెలపండి?
1. Mango 2. Music 3. Margin
4. Marble 5. Medium
ఎ) Music బి) Mango సి) Medium డి) Margin

38. ఈ రోజు నవంబరు 29 ఆదివారం. ఇది లీపు సంవత్సరమైతే మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) మంగళవారం డి) ఏదీకాదు

39. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల ఏది?
ఎ) నవంబరు బి) డిసెంబరు
సి) జనవరి డి) ఏదీకాదు

40. గడియారంలో సమయం గం.2.30 నిలు అయితే గంటల ముల్లు, నిముషాల ముల్లు మధ్య కోణమెంత?
ఎ) 100^0 బి) 90^0 సి) 105^0 డి) ఏదీకాదు

(41-45)



పై రేఖాచిత్రంలో దీర్ఘచతురస్రం భారతీయులను, వృత్తం సైనికులను, త్రిభుజం పురుషులను సూచిస్తుంది. పై రేఖాచిత్రం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

41. భారతీయులైన పురుషులను సూచించే అక్షరం?
ఎ) C బి) G సి) F డి) ఏదీకాదు

42. భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) E డి) ఏదీకాదు

43. పురుషులైన భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) C బి) F సి) D డి) ఏదీకాదు

44. భారతీయులను సూచించే అక్షరం?
ఎ) F బి) B సి) A డి) ఏదీకాదు

45. కేవలం సైనికులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) E డి) ఏదీకాదు

46. అద్దంలో చూసినపుడు సమయం గం.4.20 నిలు. అయితే అసలు సమయం?
ఎ) గం.7.30ని బి) గం7.40ని
సి) గం.8.40ని డి) ఏదీకాదు

సమాధానాలు

		15) ఎ	23) ఎ	31) ఎ	39) బి
1) ఎ	8) ఎ	16) డి	24) బి	32) సి	40) సి
2) బి	9) డి	17) బి	25) ఎ	33) బి	41) సి
3) ఎ	10) సి	18) బి	26) బి	34) ఎ	42) బి
4) సి	11) ఎ	19) ఎ	27) సి	35) సి	43) ఎ
5) ఎ	12) సి	20) సి	28) సి	36) బి	44) బి
6) బి	13) డి	21) బి	29) ఎ	37) డి	45) సి
7) సి	14) సి	22) డి	30) బి	38) ఎ	46) బి

JOBS ఉద్యోగాలు

బిహెచ్ఇఎల్

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బిహెచ్ఇఎల్)- టెక్నీషియన్ అప్రెంటిస్‌ల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 310
అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
క్యాంపస్: బిహెచ్ఇఎల్, ఇడిఎన్, బెంగళూరు
విభాగాలు: ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్/ సివిల్/ మెకట్రానిక్ ఇంజనీరింగ్
అర్హత: 2015 జనవరి 1 నాటికి సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: ఆగస్టు 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.
ఇంటర్వ్యూలు పూర్తయ్యే తేదీ: ఆగస్టు 31
వేదిక: Bharath Heavy Electricals Limited, Electronics Division, Mysuru Road, Bengaluru - 560026
వెబ్‌సైట్: www. bheledn.com
www.bheldn.com

ఐఐటి మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)- జూనియర్ టెక్నీషియన్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 32
పోస్టులు - ఖాళీలు: రిజిస్ట్రార్ 1, సిస్టమ్స్ ఇంజనీర్ 1, సెక్యూరిటీ ఆఫీసర్ 1, జూనియర్ ఇంజనీర్ 3, స్టాఫ్ నర్స్ 4, జూనియర్ టెక్నీషియన్ 12, జూనియర్ అసిస్టెంట్ 10
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఇ/ ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) + ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి లేదా 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్) + పదేళ్ల అనుభవం ఉండాలి.
వయసు: 27 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 8
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: The Assistant Registrar, Recruitment Section, Admin. Building(First Floor), IIT Madras, Chennai - 600036
వెబ్‌సైట్: www.recruit.iitm.ac.in

డిఆర్‌డిఒ

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ)- జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 11
అర్హత: ఫస్ట్ క్లాస్ మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఇన్ సైకాలజీ ఉత్తీర్ణత + నెట్ అర్హత పొంది ఉండాలి.
వయసు: 28 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: మొదటి రెండేళ్లు నెలకు రూ.25,000 మూడో ఏడాది నెలకు రూ.28,000 ఇస్తారు. హెచ్ఆర్ఏ + మెడికల్ ఫెసిలిటీస్ తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15000 ఇస్తారు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు రూ.10ల ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌ను జతచేసి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7
చిరునామా: Director DIPR, Lucknow Road, Timarpur, Delhi - 110054

గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?

ఆదేశిక సూత్రాలు

1. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) అమెరికా సి) బ్రిటన్ డి) రష్యా
2. ఆదేశిక సూత్రాల ముఖ్య లక్ష్యం?
ఎ) సామ్యవాద వ్యవస్థను ఏర్పాటు చేయడం
బి) సంక్షేమ రాజ్యస్థాపన(లేదా) శ్రేయోరాజ్య స్థాపన
సి) పెట్టుబడిదారి వ్యవస్థను రూపొందించడం
డి) కమ్యూనిస్ట్ వ్యవస్థను రూపొందించడం
3. ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ ఏ దేశం నుంచి స్వీకరించింది?
ఎ) రోమ్ బి) అమెరికా సి) స్పెయిన్ డి) రష్యా
4. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) రెండో భాగం 5 నుంచి 11 ఆర్టికల్ వరకు
బి) మూడో భాగం 12 నుంచి 35 ఆర్టికల్ వరకు
సి) నాలుగో భాగం 36 నుంచి 51 ఆర్టికల్ వరకు
డి) 4(ఎ) భాగం, 51(ఎ) ఆర్టికల్
5. ప్రభుత్వ విధానాలను రూపొందించడం, వాటిని అమలులో వేటిని ప్రాథమికాలుగా భావిస్తారు?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు
6. ఆదేశిక సూత్రాలకు చట్ట సంరక్షణ లేదు, వీటిని కోర్టుల ద్వారా అమలు పరచడానికి వీలు లేదు అని తెలిపే అధికరణం?
ఎ) 36వ బి) 37వ సి) 38వ డి) 39వ
7. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు వేటి ప్రభావ ఫలితం?
ఎ) సామ్యవాద భావాలు బి) ప్రాథమిక హక్కులు
సి) ప్రాథమిక విధులు డి) పైవన్నీ
8. మన రాజ్యాంగ పీఠికలో 'సామ్యవాద' అనే పదాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
9. సామ్యవాదాన్ని అమలుచేయడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు?
ఎ) విధివిధానాలు బి) ప్రాథమిక విధులు
సి) ప్రాథమిక హక్కులు డి) ఆదేశిక సూత్రాలు
10. ఆదేశిక సూత్రాలను ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు జవాబుదారిగా నిలవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది?
ఎ) గాంధీ బి) నెహ్రూ సి) పటేల్
డి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
11. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ ప్రవేశికలో ఉదహరించిన ఆశయాలను పోలి ఉంటాయని అన్నది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) బి.ఎన్.రావు
సి) ఎన్.గోపాలస్వామి డి) గాంధీజీ
12. ఆదేశిక సూత్రాలు శాసన వ్యవస్థకు కరదీపం వంటిదని పేర్కొనది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) ఎన్.గోపాలస్వామి
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు
13. ఆదేశిక సూత్రాలను వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ అని ఎవరు అన్నారు?
ఎ) ఎం.సి.సెతల్వాడ్ బి) కె.ఎం.మున్షీ
సి) ఎం.సి.చాగ్లా
డి) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
14. భారత ప్రభుత్వం నిర్దేశిక నియమాలను నిజాయతీగా అమలుచేస్తే భారతదేశం ఒక భూతల స్వర్గం అవుతుందని పేర్కొనది?
ఎ) గాంధీ బి) ఎం.సి.చాగ్లా
సి) అంబేద్కర్ డి) ఎం.సి.సెతల్వాడ్
15. బలహీనవర్గాల విద్య, ఆర్థిక స్థితిగతులు మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపే నిబంధన?
ఎ) 44వ బి) 45వ సి) 46వ డి) 47వ
16. ఆదేశిక సూత్రాల్లో ఏ అధికరణం గ్రామపంచాయతీల ఏర్పాటును సూచిస్తుంది?
ఎ) 40 బి) 41 సి) 42 డి) 43
17. స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి అని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 38 బి) 39 సి) 39(డి) డి) 39(ఇ)
18. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఏ రాష్ట్రానికి వర్తించవు?
ఎ)జమ్మూకశ్మీర్ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) సిక్కిం డి) అసోం
19. గోవధను నిషేధించిన రాష్ట్రాలు?
ఎ) ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక
సి) తమిళనాడు, జమ్మూకశ్మీర్
డి) మహారాష్ట్ర, తెలంగాణ
20. గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

21. మత్తుమందులు, మత్తు పానీయాలను నిషేధించి ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి అని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 47వ సి) 48వ డి) 50వ
22. సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తెలంగాణ డి) గుజరాత్
23. ఒకే శిక్షాస్మృతి అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కేరళ సి) గోవా డి) తెలంగాణ
24. కార్మికులకు కనీస వేతనం, కనీస పనిగంటలు కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ
25. మహిళలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 42వ బి) 43వ సి) 44వ డి) 45వ
26. దేశంలోని పౌరులందరికీ ఒకే శిక్షాస్మృతిని అమలు చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 40వ బి) 44వ సి) 50వ డి) ఏదీకాదు
27. ఆరేళ్లలోపు బాలబాలికలకు అందించే బాలబడి విద్యను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 45వ అధికరణంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
28. చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను సంరక్షించాలని, జాతీయ వస్తువులను పరిరక్షించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 48వ బి) 49వ సి) 50వ డి) 51వ
29. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆదేశిక సూత్రాల్లో అదనపు సూత్రాలను చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
30. యువతీయువకులు, బాలబాలికలు దురలవాట్లకు లోనుకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని తెలిపే నిబంధన?
ఎ) 39(ఎ) బి) 39(ఇ) సి) 39(ఎఫ్) డి) 39వ
31. రాజ్యాంగంలో ఏ అధికరణం నిరుద్యోగ భృతిని కల్పించాలని తెలుపుతుంది?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ
32. వృద్ధాప్య పెన్షన్ ఏ అధికరణం ప్రకారం కల్పించాలి?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ
33. ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధాప్య పెన్షన్‌ను కల్పించిన మొదటి ముఖ్యమంత్రి?
ఎ) కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బి) నీలం సంజీవరెడ్డి
సి) వై.ఎస్.రాజశేఖరరెడ్డి డి) ఎన్.టి.రామారావు
34. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేనిది?
ఎ) ఆశ్రయ హక్కు బి) పని హక్కు
సి) విద్య హక్కు
డి) ప్రభుత్వ సహాయ హక్కు
35. ప్రపంచ శాంతికి కృషి చేయడం, అంతర్జాతీయ శాంతిభద్రతలను పెంపొందించుకోవాలని తెలిపే అధికరణం?
ఎ) 50వ బి) 51వ సి) 51(ఎ) డి) ఏదీకాదు
36. పేదలకు ఉచిత న్యాయసహాయం గురించి తెలిపే అధికరణం?
ఎ) 38వ బి) 39వ సి) 39(ఎ) డి) 43(ఎ)
37. యుపిఎ ప్రభుత్వం ఏ అధికరణం ప్రకారం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని కల్పించింది?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ
38. వెట్టిచాకిరి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1973 బి) 1974 సి) 1975 డి) 1976
39. నిరుద్యోగ భృతిని అందిస్తున్న రాష్ట్రాలు?
ఎ) పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
సి) కర్ణాటక, తమిళనాడు డి) మహారాష్ట్ర, బీహార్
40. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వికలాంగులకు ఎంత పెన్షన్ ఇస్తున్నారు?
ఎ) రూ.500 బి) రూ.1000
సి) రూ.1200 డి) రూ.1500
41. వికలాంగులకు భృతిని కల్పిస్తున్న రాష్ట్రాలు?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, సిక్కిం
బి) మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యాన
సి) గోవా, కేరళ, నాగాలాండ్ డి) పైవన్నీ
42. నిర్దేశిక నియమాలు రాజ్యాంగానికి ప్రాణవాయువు వంటిది అని అన్న దౌత్యవేత్త, న్యాయకోవిదుడు ఎవరు?
ఎ) ఎల్.ఎం.సింఘ్వి బి) కె.టి.షా
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు
43. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగం సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
44. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 39(ఎ) సి) 43(ఎ) డి) 48(ఎ)
45. ఆదేశిక సూత్రాలను మూడు రకాలుగా వర్గీకరించిన పరిపాలన శాస్త్రవేత్త?
ఎ) ఎం.పి.శర్మ బి) జి.ఎన్.జోషి
సి) ఎ, బి డి) ఎవరూ కాదు
46. అడవులు, అటవీ జంతువుల సంరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తెలిపే అధికరణం?
ఎ) 39(ఎ) బి) 43(ఎ) సి) 48(ఎ) డి) 50
47. వ్యవసాయం, పశుగణాభివృద్ధిని శాస్త్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 48వ బి) 48(ఎ)వ సి) 49వ డి) 50వ
48. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరులకు పౌష్టికాహారం అందించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ

సమాధానాలు

1) ఎ	8) బి	15) సి	22) డి	31) బి	40) డి
2) బి	9) డి	16) ఎ	23) సి	32) బి	41) ఎ
3) సి	10) డి	17) సి	24) సి	33) డి	42) ఎ
4) సి	11) ఎ	18) ఎ	25) ఎ	34) ఎ	43) బి
5) సి	12) సి	19) ఎ	26) బి	35) బి	44) సి
6) బి	13) డి	20) సి	27) డి	36) సి	45) సి
7) ఎ	14) బి	21) బి	28) బి	37) ఎ	46) సి
			29) ఎ	38) సి	47) ఎ
			30) సి	39) ఎ	48) బి

అడ్మిషన్స్

బిఐఆర్ఇడి

హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బిఐఆర్ఇడి)- గ్రామీణ యువకుల కోసం ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
శిక్షణాంశాలు: మొబైల్ సర్వీసింగ్/ యంయస్ ఆఫీస్/ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్ / ఎలక్ట్రీషియన్ & వ్యవసాయ పంపుసెట్ రిపెయిర్
అర్హత: శిక్షణాంశాన్ని అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 19 నుంచి 30ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తారు.
శిక్షణ కార్యక్రమాల తేదీలు: సెప్టెంబరు 13 నుంచి నవంబరు 7 వరకు
ప్రస్తుతం చదువు కొనసాగిస్తున్నవారు, బిఇడి/ ఇంజనీరింగ్/ ఎంబిఏ/ ఎంసిఏ పూర్తిచేసినవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
వెబ్‌సైట్: www.bired.org

ఉద్యోగాలు

ఐటిబిపిఎఫ్

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపిఎఫ్)- సబ్ ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21(పురుషులకు 18, మహిళలకు 3 పోస్టులు కేటాయించారు)
వయసు: సెప్టెంబరు 22 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: మెట్రిక్యులేషన్ + డిప్లొమా(సివిల్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: రిక్రూట్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

పారదీప్ పోర్ట్ ట్రస్ట్

పారదీప్ పోర్ట్ ట్రస్ట్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 8
పోస్టులు: చీఫ్ మేనేజర్ 4, సీనియర్ మేనేజర్ 2, మేనేజర్ 2
విభాగాలు: ఇన్ఫర్మేషన్/ కమ్యూనికేషన్ & ట్రేడ్ ఫెసిలిటేట్/ఎన్విరాన్‌మెంట్ & సేఫ్టీ/ బిజినెస్ డెవలప్‌మెంట్ & ట్రేడ్ ప్రమోషన్/ కార్పొరేట్ రిలేషన్ & కమ్యూనికేషన్స్
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19
చిరునామా: Secretary, Paradip port Trust, Administrative Building, Paradip - 754142, Jagatsinghpur Dt, Odisha
వెబ్‌సైట్: www.paradipport.gov.in

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

పుల్లలచెరువు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. మంగళవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పరిశరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి తొట్టెల్లో నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు కాలువలో చెత్తలేకుండా చూడాలని సూచించారు. నీటి తొట్టెలను బ్లీచింగ్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగు నీటి కుంటల్లో బ్లీచింగ్, కిరోసిన్ చల్లారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

త్రిపురాంతకం: సద్గురు నాసరయ్య మఠంలో నెలకొల్పిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు కొత్త అనంతయ్య, రామ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆకు పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

త్రిపురాంతకం: ముడివేముల మాజీ సర్పంచ్ దేవినేని గాలెమ్మ (90) గుండె పోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె గతంలో ముడివేముల పంచాయతీకి ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. గాలెమ్మ మృత దేహాన్ని పలువురు నాయకులు, అధికారులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

పెద్దారవీడు: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. 23న ఎస్సీ, మైనార్టీ, 24న బీసీ, కాపు, 28న ఎస్టీలకు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్, కుల,ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్‌తో హాజరు కావాలని తెలిపారు.

మిలియన్ మార్చ్ గోడపత్రిక ఆవిష్కరణ

పుల్లలచెరువు : సీపీఎస్ విధానం రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని కోరుతూ 1వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఉపాధ్యాయులు, ఉద్యోగులు గోడపత్రికను ఆవిష్కరించారు.

సర్పంచ్‌ల సహకారంతోనే నీటి సరఫరా

తాగునీటి పథకం అవగాహనలో జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఈదర

ఎర్రగొండపాలెం : రక్షిత మంచినీటి పథకాలతో గ్రామాలకు తాగునీరు సరఫరా కావాలంటే పంచాయతీ సర్పంచ్‌ల సహకారం అవసరమని జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాలులో వరల్డ్ బ్యాంక్ తాగునీటి పథకంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు పంచాతీయలకు చెందిన 12 గ్రామాలకు తాగు నీటి పథకం ద్వారా నీరు సరఫరా అవుతుందా లేదా అని సర్పంచ్‌లను అడిగారు. ఆరు నెలల తర్వాత ఈ స్కీంను పంచాయతీలకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. సర్పంచ్‌లు చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, మరో 10 మంది సభ్యులు మంచినీటి సరఫరా నిర్వహణ బాధ్యతను పర్యవేక్షించాలన్నారు. మండల కేంద్రాల్లో అధ్యక్షుడిగా జడ్పీచైర్మన్, జ డ్పీటీసీ ఉపాధ్యక్షులు, అధికారులు పర్యవేక్షిస్తారని ఈదర తెలిపారు. తాగునీటి పథకానికి డిపాజిట్లు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పొదిలి ఈఈ మల్లికార్జునరా వు, జడ్పీటీసీలు మం త్రు నాయక్, అ మిరెడ్డి రామిరెడ్డి, ఎంపీపీలు చేదూరి విజయభాస్క ర్, వీ.ప్రభాకర్, ఎంపీడీవోలు హనుమంతరా వు, శ్రీనివాస రావు, ఏఈలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నెలాఖరుకు 'ఉపాధి' పనుల తనిఖీ

- కేంద్ర బృందం రాక
- రికార్డుల సేకరణలో పడ్డ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

పెద్దారవీడు: జిల్లా వ్యాప్తంగా జరిగే ఉపాధి పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం రాకతో, సామాజిక తనిఖీలు నెలాఖరులో ఉండటంతో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది రికార్డుల సేకరణలో పడ్డారు. పెద్ద ఎత్తున ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాల్లో కేంద్ర బృందం తనిఖీలు చేయనుంది. మండలంలోని 2016 నుంచి నేటి వరకు రూ.11 కోట్ల 58 లక్షల 60 వేల నిధులతో ఉపాధి పనులు జరిగినట్లు అధికారులు చెప్తున్నారు. మండలంలో ఎక్కువగా పనులు జరిగేచోట కచ్చితంగా కేంద్ర బృందం పర్యటించే అవకాశం లేకపోలేదు. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది రికార్డులు, మస్టర్ షీట్ల పరిశీలనలో బిజీబిజీ అయ్యారు.



రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

సిబ్బందిలో గుబులు

2016 నుంచి నేటి వరకు జరిగిన ఉపాధి పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం రానుండడంతో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిలో గుబులు మొదలయింది. ఏఏ పనులు పరిశీలిస్తారో, ఏ రికార్డులు తనిఖీ చేస్తారోనని సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. దీంతో ఏ సమాచారం అడిగినా ఇచ్చేందుకు రేయింబవళ్లు కుస్తీ పడుతున్నారు.

గ్యాస్‌పైనే వంట చేయాలి

పుల్లలచెరువు : 56 పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందని, ఇకపై మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ పొయ్యిపైనే వండాలని ఎంఈవో జె.రాంసింగ్ నాయక్ సూచించారు. మంగళవారం పుల్లలచెరువు తాండాలోని పాఠశాలలో గ్యాస్‌పై వంటను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓంకరయ్య, మంత్రునాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వెంకటరామిరెడ్డి

ఎర్రగొండపాలెం :ఎర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీకాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జి.వెంకటరెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

దివ్యాంగులకు ఆర్డీటీ సేవలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

పెద్ద దోర్నాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఆడిటోరియంలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఫ్రీ ప్రైమరీ స్క్రీనింగ్ చెకప్ ఫర్ ఫిజికల్ డిజేబుల్ పథకంలో భాగంగా దివ్యాంగులకు మంగళవారం ఆ సంస్థ వైద్య సేవలు అందించింది. ఫిజియోథెరపిస్ట్ నాగరాజు పలువురిని పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సంస్థ రీజనల్ డైరెక్టర్ రఫిక్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో 407 మందిని గుర్తించామని వారిని పరీక్షించి ఎవరికి ఏ స్థాయిలో ఎటువంటి వైద్యం అవసరమవుతుందో గుర్తించిన మీదట అందుకు తగిన వైద్యం అం దిస్తున్నామన్నారు. కొందరికి వీల్ చైర్‌ల వంటి సామాగ్రిని అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా టీమ్ లీడర్ నాగరాజు, సిబ్బంది రామకృష్ణ, శారద, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై జాప్యం వద్దు



మాట్లాడుతున్న పీడీ పోలప్ప

ఎర్రగొండపాలెం : నియోజకవర్గంలో ఐదు మండలాల్లో పేద ప్రజలకు మంజూరైన ఎన్టీఆర్ గృహాల నిర్మాణంలో ఏఈలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ పోలప్ప అన్నారు. మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ పోలప్ప మాట్లాడుతూ మండలంలో 113 ఎన్టీఆర్ గృహాలు, పెద్దారవీడుకు 55, పుల్లలచెరువుకు 49 గృహాలు మంజూరు కాగా, నేటికీ పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏఈలను హెచ్చరించారు. అంగన్‌వాడీ భవనాల విషయంలో జాప్యం సహించబోమన్నారు. నిర్మాణంలో ఉన్నవి, పనులు ప్రారంభం కానివాటి వివరాలు ఏఈ ప్రభాకర్‌ను అడిగి తెల్సుకున్నారు. సమావేశంలో ఈఈ రాందాస్, డీఈ వేణుగోపాలరెడ్డి, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్లు ఎన్.వెంకటేశ్వర్లు, రవికుమార్, జయపాల్, డీటీ రమాదేవి, సీడీపీవో రమీజాబాను, వి.వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవోలు బి.శ్రీనివాసరావు, టి.హనుమంతరావు, పీఆర్ ఏఈలు, హౌసింగ్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి డిమాండ్

పుల్లలచెరువు: కర్నూలు పట్టణంలో గత రెండు రోజుల క్రితం లంబాడీ మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వారిపైనా, ఆమె చదువుతున్న కట్టా రామలింగారెడ్డి రెసిడెన్షియల్ స్కూల్ యాజమాన్యంపైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ లంబాడీ హక్కుల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో విలేకరుల సమావేశంలో నియోజకవర్గ లంబాడీ హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు ఆర్.బద్దెనాయక్ మాట్లాడుతూ ఈ ఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ నాయకులు నాగేశ్వరరావు, నారాయణనాయక్, నాగేనాయక్, సూర్యనాయక్ పాల్గొన్నారు.

గిరిజన సహకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

పెద్ద దోర్నాల: గిరిజన సహకార సొసైటీలను బలపరచుకొని తద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని కోఆపరేటివ్ సొసైటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దేవండ్ల బాలయ్య అన్నారు. స్థానిక జీసీసీ కార్యాలయంలో గిరిజన సహకార సంస్థ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవం జరిగింది. ఎన్నికల అధికారిగా హాజరైన బాలయ్య మాట్లాడుతూ మండలంలో 433 మంది గిరిజనులు ఓటర్లుగా ఉన్నారని గిరిజన సహకార సంస్థ డివిజన్ మేనేజర్ సొసైటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారని ఆయన అన్నారు. ఈ సొసైటీల ఏర్పాటు వలన గిరిజనులు ఐక్యతను నెలకొని ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగ పరచుకోవచ్చని ఆయన అన్నారు. గిరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని, పిల్లలు విద్యావంతులైనప్పుడే గిరిజన సంక్షేమం సాధ్యమన్నారు. ఆర్ఎఫ్ఆర్ కోఆర్డినేటర్ మంతన్న మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటు వలన గిరిజనులు అభివృద్ధి చెందేందుకు అడవిలో సేకరించిన వల సహాయాన్ని సొసైటీ ద్వారానే విక్రయించుకోవాలని సభ్యత్వం ఉన్నవారికి బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాలను బాలయ్య అందజేశారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది శ్రీధర్, డీలర్ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడి

ఎర్రగొండపాలెం : అరటి, బొప్పాయి తోటలు సాగుకు ఒండ్రు, ఎర్రగరప, నల్లరేగడి నేలలు అనుకూలమని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. ఉద్యాన శాఖ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం టిష్యూ కల్చర్ అరటిలో జీ9 రకం చీడపీడలు లేకుండా మంచి దిగుబడి నిస్తుందన్నారు. 3 అడుగుల గుంత తీసి 50 గ్రాములు సూపర్, 20గ్రాములు పోల్‌డాల్ పొడరు, 20 గ్రాములు గుళికలు కలిపి గుంతలో పూడ్చాలని అన్నారు. మొక్కలు నాటిన మొదటి నెలలో డ్రిప్ సిస్టంలో 20నుంచి 25 లీటర్లు నీటిని అందించాలని తెలిపారు. తల్లి చెట్టు నుంచి వచ్చే పిలకలను తొలగించాలన్నారు. మిగతా పంటల సాగుకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి నబీరసూల్, రైతులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో కాలుష్యం దూరం

మార్కాపురం: మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ కాలుష్యాన్ని నివారించవచ్చని అరవింద సమగ్ర విద్యాకేంద్రం కరస్పాండెంట్ సి.వాణి రాధాకృష్ణ అన్నారు. స్థానిక అరవింద సమగ్ర విద్యా కేంద్రంలో మంగళవారం విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారు చేయించారు. విగ్రహాలకు వేసే రంగులు, ఇతర ముడి సరుకు వినియోగించటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. అనంతరం మట్టి విగ్రహాలను ఇళ్ళలో ఏర్పాటు చేసుకొని పూజించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంకు ఆర్యవైశ్యుల అభినందనలు

మార్కాపురం: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్త పరిచినందుకు మార్కాపురం ఆర్యవైశ్య సంఘం తరుపున అభినందనలు తెలియజేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు తాళ్ళపల్లి వెంకట సత్యనారాయణ మంగళవారం తెలిపారు.

సీఎం, మంత్రికి ఆర్ఎంపీ, పీఎంపీల ధన్యవాదాలు

మార్కాపురం: ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంపట్ల పీఎంపీ అసోసియేషన్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కామినేని శ్రీనివాసులుకు పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు షేక్ మౌలాలి మంగళవారం ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక స్పృహ ఉండాలి

మార్కాపురం: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సరళ అన్నారు. ఒకేషనల్ విద్య, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలో భాగంగా పోస్టాఫీసును మంగళవారం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్‌లో జరిగే లావాదేవీలు, ఖాతాల వివరాలను పోస్టుమాస్టర్ ఎం.రాంప్రసాద్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసులు, రామకృష్ణ, పోస్టల్ అసిస్టెంట్ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

వేతన సంఘ సిఫార్సులు అమలు చేయాలి

మార్కాపురం: 7వ యూజీసీ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయాలని ఎఫిలియేటెడ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (ఏసీటీఏ) ఆధ్వర్యంలో ఎస్‌వీకేపీ కళాశాలలో మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కారదర్శి డాక్టర్ ఈవీ సురేష్ కుమార్ మాట్లాడుతూ పార్ట్‌టైమ్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, 2004 నుంచి విధుల్లో ఉన్నవారికి పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మానాయక్, ఆప్కా యూనిట్ ప్రెసిడెంట్ రంగారావు, సభ్యులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

• సినిమాలు

మార్కాపురం

జగదీశ్వరీ - జయజానకి నాయక
విజయా - రారండోయ్
శ్రీనివాస - నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ - ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి - ఫిదా
విశ్వేశ్వర - లై

పొదిలి

వెంకటేశ్వర - లై
హరికృష్ణ - నేనే రాజు నేనే మంత్రి
రాఘవేంద్ర - జయ జానకి నాయక

నిరుపయోగంగా నీటితొట్లు



నీరు లేని నీటి తొట్లు

తర్లుపాడు: మూగ జీవాల దాహర్తి తీర్చేందుకు వాటర్ షెడ్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువులకు నీటితొట్లు నిర్మించారు. వేల రూపాయలు ప్రభుత్వం వెచ్చించి నీటి తొట్లను గ్రామాలలో నిర్మించినా మూగ జీవాలకు ఉపయోగపడడంలేదు. ఏ ఒక్క తొట్లో కూడా నీరు పోసిన దాఖలాలు లేవు. దీంతో పథకం నిరుపయోగంగా మారింది. అధికారులు నిర్లక్ష్య కారణంగా తొట్లకు నీటి సరఫరా చేయక పోవటంతో కొన్ని తొట్లు శిథిలావస్థకు చేరాయి. మండలంలోని 16 పంచాయతీలకు సుమారు 200కు పైగా పశువుల తొట్లు నిర్మించినా ఏ ఒక్క మూగ జీవానికీ దాహర్తి తీర్చిన దాఖలాలు లేవు. దీంతో అవి విలవిలలాడిపోతున్నాయని పశు పోషకులు వాపోయారు. ఒక్కో తొట్టికి రూ.24 వేల 500 ఖర్చుచేసి నిర్మించినా నిరుపయోగమయ్యాయి.



రెవిన్యూ భూములను పరిశీలిస్తున్న ఏపీడీ మల్లేశ్వరుడు

రెవెన్యూ భూముల్లో మొక్కల పెంపకం

మార్కాపురం (తర్లుపాడు): నాయుడుపల్లిలో కొండలగిరి పచ్చదనంలో భాగంగా 40 ఎకరాలలో మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వాటర్ షెడ్ ఏపీడీ మల్లేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం నాయుడుపల్లి సమీపంలోని రెవెన్యూ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతంలో ఉన్న భూమిలో కాంటూర్ ట్రెంచింగ్ విధానం ద్వారా నేరేడు, శీతాఫలం, మామిడి, కానుగ, గంగిరావి, చింత ఇతర మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ సిబ్బంది శ్రీనివాసరావు, టీవోలు ప్రసన్నకుమార్, దయాకర్, సర్పంచ్ కందుల విజయకళావతి ఉన్నారు.

మంచి నీటి సమస్యను అధిగమిస్తాం

పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్

మార్కాపురం: మున్సిపాలిటీల్లో మంచినీటి సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిధుల కేటాయిస్తున్నారని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ టి.మోహన్ అన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో మంచినీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 180 డీప్ బోర్లకు గాను 38 బోర్లు మాత్రమే అరకొరగా పని చేస్తున్నాయన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఉన్న డెడ్ స్టోరేజీ నీరు 10 రోజులకు మాత్రమే ఓవర్ హెడ్ ట్యాంకులను నింపగలమన్నారు. ప్రస్తుతం సాగర్ నీటిని ట్యాంకర్ల ద్వారా 600 ట్రిప్పులను పట్టణ ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయంగా నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉన్న బోర్లలో 50 బోర్లను రీబోరు చేసేందుకు రూ.50 లక్షల నిధులు కేటాయించామన్నారు. నీటి లభ్యతను బట్టి 15 కిలోమీటర్ల దూరం నుంచైనా బోర్లు వేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దరిమడుగు సమీపంలోని మహమ్మద్‌సాకుంటలో 4 బోర్లు వేయగా మంచి ఫలితాలు ఉండటంతో మరో 4 బోర్లు వేసి నీటి సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీరు వృధా చేయకుండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే మున్సిపల్ అధికారులకు సమాచారం అందిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం మండలంలో నీటి లభ్యత ఉన్న గ్రామాలను పరిశీలిస్తామన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ. రామమోహనరావు, కమిషనర్ షేక్ ఫజులుల్లా, డీఈ ఎర్నాయుడు, కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ మోహన్

స్వచ్ఛభారత్ కన్వీనర్‌గా పోతురాజు

పొదిలి : పొదిలి మండల స్వచ్ఛభారత్ కన్వీనర్‌గా పోతురాజును ఎంపిక చేశారు. మంగళవారం నియామక పత్రాన్ని జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, మండల బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు దాసరి మల్లి చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ తమ పదవికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న పోతురాజు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం: కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ, కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీల్లో ఉన్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి పి.రాజశేఖర్ అన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని వెలుగొండ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్ల క్రితం సొసైటీ భూముల్లో వేసిన బోర్లు ఒట్టిపోవడంతో వ్యవసాయం భారంగా మారిందన్నారు. ఒట్టిపోయిన బోర్లను రీబోరు చేయించటం, వాటికి మోటార్లు, పైపులు మంజూరుకు ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. జాయింట్ ఫార్మింగ్ ఫెడరేషన్‌ను పునరుద్ధరించాలని, ఎరువులు, బత్తాయి, జామ, ఇతర మొక్కలు సంఘాలకు సరఫరా చేయాలని రైతులు కోరారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. వీరప్రసాదు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు సంజీవకుమార్ తిరుమలవాసు, మాజీ అధ్యక్షుడు నెమిలయ్య పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల వేతనాలు అమలు చేయాలని ఏఐపీఈయూ కార్యదర్శి ఎ.రవి అన్నారు. 23న జరిగే సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జీడీఎస్ ఉద్యోగుల వేతన సంఘ సిఫార్సులను అమలుచేసి, సివిల్ సర్వెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

నేటి నుంచి రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

పొదిలి : 2017-18 సంవత్సరానికి సంబంధించి వివిధ కార్పొరేషన్ల కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఈనెల 23వ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో పి.ఝాన్సీరాణి తెలిపారు. 23న తేదీన ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు, 24న బీసీ, కాపు, 28న ఎస్సీ కార్పొరేషన్లను దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు, రేషన్ కార్డులు, ఆధార్‌కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మైనార్టీలకు 30, ఎస్టీలకు 10, కాపు కార్పోరేషన్ 60, బీసీ 50, ఎస్సీలకు 140 యూనిట్లు మంజూరు అయినట్లు తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా ఆయా పత్రాలతో హాజరుకావాలని ఎంపీడీఓ ఝాన్సీరాణి కోరారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

మార్కాపురం: ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యల వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర స్థాయిలో నష్టపోతుందని బ్యాకింగ్ యూనియన్ నాయకులు జటప్రోలు దక్షిణామూర్తి అన్నారు. స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ వద్ద యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు సిబ్బంది విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దక్షిణామూర్తి మాట్లాడుతూ బ్యాంకుల్లో ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యల వలన తీసుకున్న బాకీలు లక్షల కోట్ల రూపాయలు చేరుకున్నాయన్నారు. అప్పులు బ్యాంకులపై భారం పడటమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ ఇస్మాయిల్ సురేష్, యూనియన్ నాయకులు సురేష్, కాశిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అన్ని బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.



విధులు బహిష్కరించిన బ్యాంకు ఉద్యోగులు

సూక్తి

మనకోసం చేసే పని మనతోనే అంతరించిపోతుంది. పరుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది.


జంబ్లింగ్ వర్డ్స్

1. LMIK ▸ ....
2. DYUT ▸ ....
3. ALTS ▸ ....
4 RCKO ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

ఔనా!

2007లో ఓ గూఢచర్యం కేసులో 14 ఉడతలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు.



పాండాలకు ఓ ఆసుపత్రి

నలుపు, తెలుపు రంగుల్లో ముద్దుగా కనిపించే పాండాలంటే.. చాలామందికి ఇష్టం. పాండాలను అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా గుర్తించారు. వీటిని పరిరక్షించడానికి పర్యావరణవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'చైనా కన్జర్వేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ది గెయింట్ పాండా (సీసీఆర్‌సీజీపీ) పనిచేస్తుంది. రోజు రోజుకీ తగ్గిపోతున్న పాండాల సంఖ్యను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైనా ప్రభుత్వం 'డుజియాంగ్యాన్' నగరంలో పాండాల కోసమే ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని 2012లో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే తొలి పాండా ఆసుపత్రి.



జలుబు చేసినా.. జ్వరం వచ్చినా.. డాక్టరు దగ్గరకు వెళుతుంటాం. మరి పాండాలకు జబ్బు చేస్తే? అనారోగ్యంతో అవి బాధపడుతుంటే? అందుకే వాటికోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి ఉంది. అందులో పాండాలను ఎంతో బాధ్యతగా చూసుకుంటారు. ప్రతి రోజూ హెల్త్ చెకప్‌లు చేస్తారు.. మంచి భోజనాన్ని అందిస్తారు. ఇది పాండాల పునరావాస కేంద్రం కూడా. అంతేకాదు ఇక్కడ పాండాలపై పరిశోధనలు చేస్తారు.

పాండాలపై పరిశోధన చేసిన తొమ్మిదిమంది వైద్యులు ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఈ వైద్య బృందం పాండాలకి ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. పాండాలు వ్యాధుల భారినా పడితే తక్షణమే వాటికి వైద్యం చేస్తారు. పాండాల సంతతిని అభివృద్ధి చెందేలా ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తారు. అత్యున్నత సాంకేతిక వ్యవస్థ ఈ ఆసుపత్రిలో ఉంది. ఇది కేవలం పాండాల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆసుపత్రి మాత్రమే కాదు ఇది పాండాల ఉనికిని కాపాడే సంస్థగా కూడా పనిచేస్తుంది. ఈ ఆసుపత్రిలో మొత్తం 33 పాండాలు ఉన్నాయి. 'పాన్ పాన్' అనే పాండా అన్నింటికన్నా వయసులో పెద్దది. దాని వయసు 33 సంవత్సరాలు. పాండాల కోసం ఈ ఆసుపత్రి చేసిన కృషి వల్లే పాండాల సంఖ్య 17 శాతానికి పెరిగింది.

- పాండాల కోసం క్యారెట్లు, పాలు, కార్న్ బ్రెడ్ వంటి ఆహారపదార్థాల్ని అందిస్తారు.
- మనుషులతో ఎలా ప్రవర్తించాలో పాండాలకు చక్కగా నేర్పుతారు.
- అడవుల్లో ఒంటరిగా సంచరించే పాండాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కష్టాల్లో పడిన పాండాలను ఆసుపత్రికి తీసుకువచ్చి వాటిని సంరక్షిస్తారు.
- పాండాలకి ఇష్టమైన ఆహారం వెదురు చెట్లని తెలుసు కదా. పాండాల ఆహారం కోసమే ఆసుపత్రి యజమాన్యం వేల వెదురు చెట్లను పెంచుతుంది. పాండాలు హాయిగా అందులో విహరిస్తాయి. చక్కగా ఆడుకుంటాయి.



మీకు తెలుసా


- పాండా బరువు 100 నుంచి 120 కేజీల మధ్యలో ఉంటుంది.
- వీటి సగటు వయస్సు 20 సంవత్సరాలు.
- ఇప్పటి వరకూ 'బసి' అనే పాండా గరిష్ఠంగా 37 సంవత్సరాలు జీవించింది.
- పాండాలు తమ పిల్లలకి పాలిచ్చి పెంచుతాయి.
- ప్రపంచ వ్యాప్తంగా 1,864 పాండాలు మాత్రమే ఉన్నాయి.

పదాలు కనుక్కోండి

F	I	E	L	K	C	U	S	Y	E	N	O	H
N	P	B	C	A	G	Z	Q	T	T	P	F	Y
G	B	N	L	R	Z	I	Q	D	A	I	S	Y
P	O	I	F	G	O	Y	T	E	L	O	I	V
R	L	G	D	I	H	C	R	O	L	J	B	Q
H	E	A	E	L	Q	B	U	G	X	I	B	X
H	Y	W	V	R	O	V	Q	S	Q	Y	L	I
Q	S	F	O	E	A	G	M	P	F	S	Y	Y
U	L	U	S	L	N	N	I	R	Q	N	X	A
M	R	Q	W	X	F	D	I	R	O	A	C	S
L	T	U	L	I	P	N	E	U	A	P	E	T
C	K	V	C	E	X	S	U	R	M	M	X	E
D	A	F	F	O	D	I	L	S	D	M	S	R

ASTER, CROCUS, DAFFODIL, DAISY, GERANIUM, HONEYSUCKLE, LAVENDER, LILAC, LILY, MARIGOLD, ORCHID, PANSY, SUNFLOWER, TULIP, VIOLET

దారి కనుక్కోండి



మీకు తెలుసా?



మీరు చంద్రుడి పైకి వెళితే.. మీరు మీ బరువులో 16.5 శాతమే ఉంటారు.

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

చెప్పగలరా?

మందులో ఉన్నా
కానీ ముందులో లేను
దాతలో ఉన్నా
కానీ పీతలో లేను
రంగులో ఉన్నా
కానీ చెంగులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

1. త్తుభవిష్య ▸ ....
2. మాణంరాయ ▸ ....
3. వృఅభిద్ధి ▸ ....
4. సంవరంత్స ▸ ....


నవ్వుల్ నవ్వుల్

టీచర్ : కోడి మాంసాహారా? శాకాహారా?
బిట్టు : మాంసాహారికి ఆహారం టీచర్ !
టీచర్ : !!!!!!!!

జవాబులు

చెప్పగలరా? : మందారం
జంతర్‌మంతర్ :
1. భవిష్యత్తు
2. రామాయణం
3. అభివృద్ధి
4. సంవత్సరం
జంబ్లింగ్ వర్డ్స్ :
1. MILK
2. DUTY
3. SALT
4 ROCK

బొమ్మ గీయండి



రంగులు అద్దండి



పొగాకు రైతుల్లో అలజడి

(మొదటి పేజీ తరువాయి)

నెలకొంది. గతానికి భిన్నంగా ఈసారి ఉత్తరాది ప్రాంతంలో పంట ఉత్పత్తి పెంచి దక్షిణాదిలోని తేలిక నేలల ప్రాంతంలో తగ్గిస్తారన్న ప్రచారం ఈ ప్రాంత రైతుల్లో అలజడి రేకెత్తిస్తోంది. ఈమేరకు ఇప్పటికే పొగాకు బోర్డును వ్యాపారులు కోరినట్లు ప్రచారం జరుగుతుండగా, అలా చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. తమ వాదనను బోర్డు సభ్యులకు, అధికారులకు వివరించేందుకు దక్షిణాది ప్రాంత రైతు ప్రతినిధులు హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.

గత సీజన్‌లో 130 మిలియన్ కిలోలకు అనుమతి

గత సీజన్ (2016-17)లో రాష్ట్రంలో 130 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతిచ్చింది. అందులో దక్షిణాది తేలిక నేలలు (ఎస్ఎల్ఎస్) ప్రాంతంలో 45 మిలియన్ కిలోలు, దక్షిణాది నల్ల నేలలు (ఎస్‌బీఎస్) ప్రాంతంలో 39 మిలియన్ కిలోలు, ఉత్తరాది తేలిక నేలల (ఎస్ఎల్ఎస్)లో 42, ఎస్‌బీఎస్‌లో నాలుగు మిలియన్ కిలోలు పరిమితి విధించింది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దక్షిణాది ప్రాంతంలో పంట ఉత్పత్తి తగ్గగా, ఉత్తరాదిలో పెరిగింది. దక్షిణాదిలోని రెండు రీజియన్‌లలో కలిపి 84 మిలియన్ కిలోలకు బోర్డు అనుమతివ్వగా 58 మిలియన్ కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. ఉత్తరాదిలో పరిమితికి మించి 50 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుతం దక్షిణాదిలో అధికారిక పంట కొనుగోళ్లు పూర్తి కాగా, ఉత్తరాదిలో మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే ఉత్తరాదిలో ఇస్తున్న సగటు ధరలు దక్షిణాదిలో లభించడం లేదన్న అభిప్రాయం ఈ ప్రాంత రైతుల్లో అధికంగా ఉంది. పొగాకు వ్యాపారులు, బోర్డు అధికారులు ఉత్తరాది రైతుల పట్ల ఎక్కువ సానుకూల వైఖరి ప్రదర్శిస్తూ దక్షిణాది రైతుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని బహిరంగంగానే ఈ ప్రాంత రైతు నేతలు విమర్శిస్తున్నారు. అందుకు పంట సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పరిమాణం, ధరలు, మార్కెట్ తీరు వంటి పలు అంశాలను ఉదహరిస్తున్నారు.

వ్యాపారుల సరికొత్త ప్రతిపాదన వివాదాస్పదం

రానున్న సీజన్‌కు సంబంధించి ఇటు రైతులు, అటు వ్యాపారుల నుంచి ఇటీవల పొగాకు బోర్డు అధికారులు అభిప్రాయాలు తీసుకోగా గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించాలని రైతులు కోరారు. అవకాశం ఉంటే బ్యారన్‌కు 40 క్వింటాళ్ల మేర అనుమతివ్వాలని కోరారు. అదే సమయంలో గడిచిన ఏడాది కన్నా మూడు మిలియన్ కిలోలు పెంచి 133 మిలియన్ కిలోల మార్కెటింగ్‌కు అవకాశం ఉందని వ్యాపారుల తరపున ఐటీఏ బోర్డు అధికారులకు ప్రతిపాదన ఇచ్చింది. అందులో గతంలో కన్నా ఉత్తరాదిలో ఎనిమిది మిలియన్ కిలోలు పెంచి దక్షిణాదిలో నాలుగు మిలియన్ కిలోలు తగ్గించినట్లు తెలుస్తోంది. అందులోనూ దక్షిణాది తేలిక నేలల్లో భారీగా కోత విధించినట్లు సమాచారం. ఇది వివాదాస్పదమైంది. గత సీజన్‌లో దక్షణాది తేలిక నేలల్లో 45 మిలియన్ కిలోలకు బోర్డు అనుమతివ్వగా ఈసారి దాన్ని 35 మిలియన్ కిలోలకు కుదించాలని వ్యాపారులు సూచించినట్లు తెలుస్తోంది. ఆ సమాచారం మొత్తం దక్షిణాదిలోని పొగాకు రైతుల్లో అలజడి రేపింది. దీన్ని రైతులు, రైతు ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమకు ఉత్పత్తి లక్ష్యాన్ని గతం కన్నా తగ్గించకుండానే బ్యారన్‌కు 40 క్వింటాళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పక్షం రోజుల క్రితం బోర్డు అధికారులు నిర్వహించిన సమావేశంలోనూ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొంత మంది ఏకంగా బ్యారన్‌కు రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లిస్తే పొగాకు సాగును విరమిస్తామని కూడా ప్రకటించారు.

హైదరాబాద్‌కు వెళ్లిన పొగాకు రైతు ప్రతినిధులు

గత ఏడాది మాదిరిగానే రానున్న సీజన్‌లో కూడా అన్ని ప్రాంతాలకు సమంగా పంట ఉత్పత్తికి అనుమతివ్వాలన్న దానిపై దక్షిణాదిలోని రెండు రీజియన్‌లకు చెందిన రైతు ప్రతినిధులు ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఇదే విషయాన్ని వారంతా పొగాకు బోర్డు పాలక మండలి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నల్ల నేలల ప్రాంత పొగాకు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావుల నేతృత్వంలో ఆయా వేలం కేంద్రాల రైతు కమిటీల ప్రతినిధులు హైదరాబాద్ వెళ్లారు. పొగాకు బోర్డు సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు అక్కడి సపల్లా హోటల్‌లో జరగనుంది. ఆలోపు బోర్డు చైర్మన్ ఇతర సభ్యులను రైతు ప్రతినిధులు కలిసి తమ వాదనను వినిపించాలని నిర్ణయించుకున్నారు.

మరో వైపు దక్షిణాదిలో గడిచిన సీజన్‌కు సంబంధించి అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయి ఇంచుమించు పక్షం రోజులు గడిచింది. 57.54 మిలియన్ కిలోలు కొనుగోలు చేయగా సగటున కిలోకు రూ 117.19 ధర లభించింది. అయితే సుమారు 0.80 నుంచి ఒక మిలియన్ వరకు అధికంగా పండిన పంట కొద్ది మంది రైతుల వద్ద ఉండగా దాని కొనుగోలుపై పొగాకు బోర్డు నుంచి స్పష్టత లేదు. సాధారణంగా అధికారిక కొనుగోళ్లు పూర్తయ్యే నాటికి అధిక పంట కొనుగోళ్లపై స్పష్టత ఉంటుంది. అలాంటిది ఈసారి ఇంత వరకు ఎలాంటి చర్యలు లేకపోగా ఎప్పుడు కొంటారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆ విషయాన్ని కూడా బుధవారం బోర్డు పాలక మండలి సభ్యుల దృష్టికి తీసుకెళ్లేందుకు రైతు ప్రతినిధులు సిద్ధమయ్యారు.



ఉద్యోగుల సమ్మెతో బోసిపోతున్న ఒంగోలులోని ఓ బ్యాంకు

స్తంభించిన బ్యాంకింగ్

జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల సమ్మె

పలు ప్రాంతాల్లో ర్యాలీలు, ధర్నాలు

నిలిచిన రూ. ఏడువేల కోట్ల లావాదేవీలు

బ్యాంకుల పరిరక్షణకు ఉద్యోగ సంఘ నేతల పిలుపు

25నుంచి మూడు రోజులు బ్యాంకులకు సెలవులు

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ రంగంలోని బ్యాంకు ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన బ్యాంకుల సమ్మె జిల్లాలో విజయవంతమైంది. జిల్లాలో మొత్తం ప్రభుత్వ రంగ, ప్రైవేటు గ్రామీణ, సహకార బ్యాంకులు కలిపి 471 బ్రాంచిలు ఉండగా అందులోని 299 ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలు మూతపడ్డాయి. ఎస్‌బీఐ, ఆంధ్ర, సిండికేట్, యూనియన్ తదితర ప్రధాన ప్రభుత్వ రంగంలోని బ్యాంకులోల పనిచేసే స్కేల్-3 అధికారి నుంచి అటెండర్ వరకు సుమారు రెండు వేల మంది సమ్మెలో పాల్గొన్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆ బ్యాంకులన్నీ మూతపడగా దాదాపు ఏడు వేల కోట్ల రూపాయాల లావాదేవీలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో ఏటీఎంలు కూడా పనిచేయక నగదు కోసం ఖాతాదారులు ఇక్కట్లు పడ్డారు. సమ్మె సందర్భంగా జిల్లావ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు, ధర్నాలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో పలు బ్యాంకుల ఉద్యోగులు నెల్లూరు బస్టాండు సెంటర్‌లోని ఆంధ్రాబ్యాంకు వద్ద భారీ ధర్నా చేపట్టారు. ప్రధాన పట్టణాలైన చీరాల, అద్దంకి, కందుకూరు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, పొదిలి, దర్శి, కంభం తదితర ప్రాంతాల్లోనూ ర్యాలీలు, ధర్నాలు జరిగాయి. బ్యాంకింగ్ రంగ పరిరక్షణ, పెద్ద బకాయిదారుల నుంచి వసూళ్లు, నూతన బ్యాంకింగ్ విధానం ఉపసంహరణ తదితర డిమాండ్‌తో ఈ సమ్మె చేపట్టిన ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. బ్యాంకింగ్ పరిరక్షణకు మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఒంగోలులో జరిగిన నిరసన కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రతినిధుల పార్థసారధి, పి.కె. రాజేశ్వరరావు, చిట్టితోటి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈనెల 25నుంచి మూడు రోజులు బ్యాంకులకు సెలవులు వచ్చాయి.

ఉప్పు సత్యాగ్రహ ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ

అధికారులకు పలు సూచనలు

ప్రకాశం జయంతి వేడుకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశం

ఒంగోలు రూరల్ : ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామ పరిధిలోని ఉప్పు సత్యాగ్రహ శిబిరం ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులక పలు సూచనలు చేశారు. రోడ్డు సక్రమంగా లేనందున బుధవారం జరగనున్న టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడతారని గుర్తించిన ఆమె ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. బొద్దులూరివారిపాలెం మీదుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోడ్డుకు క్వారీ డస్టు వేయించి వర్షం వచ్చినా వాహన రాకపోకలకు ఇబ్బంలేకుండా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.ఆర్.వి. శశికుమార్, ఈవోఆర్‌డీ బాలచెన్నయ్య, పంచాయతీరాజ్ ఏఈ శివప్రసాద్, ఆర్ఐ వేణుగోపాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పు సత్యాగ్రహ శిబిరం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ నాగలక్ష్మి

వినోదరాయునిపాలెంను సందర్శించిన ఆర్డీవో

వినోదరాయునిపాలెం (నాగులుప్పలపాడు): టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని ఒంగోలు ఆర్డీవో కె. శ్రీనివాసరావు అన్నారు. వినోదరాయునిపాలెంలో హైస్కూల్ ఆవరణలో బుధవారం జరిగే ప్రకాశం పంతులు కాంస్య విగ్రహావిష్కరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అక్కడ ఉన్న అధికారులతో చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, డీపీవో ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖరయ్య, ఈఈ కాంతారావు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి భూముల్లో యథాతథ స్థితి

● హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ● చెరువును పూడ్చవద్దని సూచన

పర్చూరు : మండలంలోని దేవరపల్లి చెరువు భూములను యథాతథ స్థితిలో ఉంచాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. ఆ మేరకు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దేవరపల్లి చెరువు విషయమై గత రెండు నెలలుగా వివాదం కొనసాగిన విషయం విదితమే. చెరువును అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అధికారులు అనేక ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిని తవ్వి చెరువులో కలిపారు. ఇందుకు నిరసనగా దళితులు ఆందోళనకు దిగారు. వీరికి సీపీఎం, ఇతర ప్రజా, దళిత సంఘాలు మద్దతుగా నిలిచాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో ఓ బృందాన్ని దేవరపల్లికి పంపింది. ఆ బృందం ఇచ్చిన నివేదిక ఆదారంగా చెరువు భూములను ప్రభుత్వం తిరిగి దళితులకే అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే తవ్విన చెరువును తిరిగి పూడ్చే పనులను వారం రోజులుగా అధికారులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన రైతు గండు సుబ్బారావు చెరువును పూడ్చకుండా మంచినీటి అవసరాలకు వినియోగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు చీఫ్ జస్టిస్ రమేష్ రంగనాధన్, జస్టిస్ జె. ఉమాదేవి కూడిన బెంచ్ మంగళవారం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. చెరువు పూడ్చివేత పనులు తక్షణమే నిలిపివేసి యథాతథ స్థితిని కొనసాగించి, ఉన్న నీటిని మంచినీటి అవసరాలకు వినియోగించాలని ఆదేశించింది. ఆ భూమిలోకి రెండు వారాలపాటు ఎవ్వరినీ అనుమతించవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.



ప్రశ్నించినందుకు కత్తితో దాడి

చీరాల టౌన్ : అనుమానాస్పందంగా ఉన్న ఓ వ్యక్తిని ఎవరు అని ప్రశ్నించడంతో మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన చీరాల థామస్ పేటలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడు ప్రస్తుతం చీరాల వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం థామస్‌పేటకు చెందిన ఎరిచర్ల ఆనంద్‌బాబు సోమవారం మోహన్ థియేటర్‌లో సినిమా చూసి ఇంటికి బయల్దేరాడు. తన కాలనీలో ఓ ఇంటి ముందు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కూర్చుని ఉండటాన్ని గుర్తించి మీరు ఎవరు అని ప్రశ్నించారు. దీంతో ఆ ఇంట్లో నుంచి సాల్మన్ అనే వ్యక్తి బయటికి వచ్చి ఆనంద్‌బాబుతో వాగ్వివాదానికి దిగాడు. అనంతరం కత్తితో దాడి చేయగా ఆనందబాబు చేతికి గాయమైంది.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

చీరాల టౌన్ : బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం కొత్తపేట పంచాయతీ పరిధిలోని సంపత్ నగర్ వద్ద జరిగింది. చీరాలకు చెందిన సంపత్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కొత్తపేటకు బయల్దేరాడు. ఆయన సంపత్ నగర్‌కు వచ్చే సరికి అదుపు తప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు.

నువ్వు పంట వర్షార్పణం

● బూజు పట్టిపోతున్న కోసిన కుప్పలు ● నష్టపోయిన రైతులు


ధర్మవరం సమీపంలో కోసి గూళ్లు పెట్టి ఉన్న నువ్వు పంట

అద్దంకి: వేసవి పంటల కింద అద్దంకి, మార్టూరు సబ్ డివిజన్‌లలో 2100 ఎకరాలలో నువ్వు సాగు చేపట్టారు. ప్రస్తుతం నువ్వు పంట కోసి ఉండటంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు బూజు పట్టి పనికి రాకుండా పోయింది. అద్దంకి సబ్ డివిజన్‌లోని అద్దంకి, కొరిశపాడు, మద్దిపాడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో 600 ఎకరాల్లో, మార్టూరు సబ్ డివిజన్‌లోని మార్టూరు, పంగులూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 1500 ఎకరాల్లో వేసవి పంటగా నువ్వు సాగు చేపట్టారు. పలు గ్రామాల్లో రైతులు సాగర్ ఆయకట్టులోని మాగాణి పొలాల్లో కూడా నువ్వు పంట సాగు చేశారు. గత 10 రోజులుగా నువ్వు పంటను కోసి ఎండేందుకు కుప్పలుగా పెట్టారు. మంచి ఎండలు ఉంటే నువ్వు రాల్చుకునే అవకాశం ఉంటుంది. కాని గత వారం రోజులుగా ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వర్షపు జల్లులు పడుతుండటంతో నువ్వు కుప్పలు తడిచి మొలకలు వస్తున్నాయి. దీంతో నువ్వులు చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. సరాసరిన ఎకరాకు రూ.5 వేలు ఖర్చు కాగా పంట చేతికి అందితే కనీసం రూ.10 వేల ఆదాయం వచ్చేదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. అసలే కరువు కాలంలో సాగు చేసిన నువ్వు పంట చేతికి వచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారంగా పాడి పరిశ్రమ

● భగ్గుమంటున్న ఎండుగడ్డి
● కొనుగోలు చేయలేక గేదెలు అమ్ముకుంటున్న రైతులు
● తగ్గిన పాల దిగుబడి


ధర్మవరం పాలకేంద్రంలో పాలు పోస్తున్న మహిళలు



అద్దంకి: రైతులకు వ్యవసాయం తరువాత ప్రధాన ఆదాయ వనరు పాడి పరిశ్రమ. గత రెండు సంవత్సరాల నుంచి కరువు పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం రైతులకు భారంగా మారింది. సాగర్ ఆయకట్టులో సైతం వరి సాగు లేకపోవడంతో ఆ ప్రభావం పాడి పరిశ్రమపై ప్రభావం చూపింది. సాగర్ ఆయకట్టు రైతులు తాము సాగు చేసిన మాగాణిలో అవసరమైన మేర వరిగడ్డిని నిల్వఉంచుకొని మిగిలిన దానిని అమ్ముకుంటారు. అయితే వరుసగా రెండు సంవత్సరాలు సాగర్ ఆయకట్టులో వరి సాగు జరగకపోవడంతో ఎండు గడ్డి కొరత ఏర్పడింది. దీంతో పాడి పరిశ్రమ కూడా భారంగా మారి గేదెలను అమ్ముకుంటున్నారు. తమకున్న గేదెలలో సగం అమ్ముకొని మిగిలిన వాటికి అరకొర మేత వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీంతో పాల ఉత్పత్తి కూడా ఘననీయంగా తగ్గింది.

అద్దంకి మండలం ధర్మవరంలో గతంలో రోజుకు 2 వేల లీటర్ల పాల ఉత్పత్తి జరిగేవి. అయితే ప్రస్తుతం పలువురు రైతులు గేదెలు అమ్ముకోవడంతో పాల ఉత్పత్తి 700 లీటర్లకు పడిపోయింది. దీనికి తోడు గేదెలకు సరైన మేత లేక పాల దిగుబడి కూడా తగ్గింది. నిన్న మొన్నటి వరకు ట్రక్కు వరిగడ్డి రూ.12 వేలు ఉండగా ప్రస్తుతం రూ.16 వేలకు చేరింది. పాల ధర కూడా లీటరకు 10 శాతం వస్తే రూ.55 ఉండగా రైతులకు సరాసరిన రూ. 35 మాత్రమే వచ్చే పరిస్థితి ఉంటుంది. గ్రామంలో చాగంటి అనూష కుటుంబానికి గతంలో 6 గేదెలు ఉండగా మేత సరిగ్గా లేక మూడింటిని అమ్ముకున్నారు. మిగిలిన మూడు గేదెలకు తోడు మరో మూడు దూడలు ఉన్నాయి. 6 గేదెలు ఉన్నప్పుడు నెల కు పాల ద్వారా సరాసరిన రూ.20 వేలు వచ్చేవి. వాటిలో రూ.15 వేలు ఖర్చులకు పోయినా మిగిలిన రూ.5 వేలు మిగిలేవి. ప్రస్తుతం గేదెలు తగ్గడం, మేత కొనుగోలు చేయాల్సి రావడంతో పాల ద్వారా వచ్చిన డబ్బులు కూడా సరిపోక అప్పులు చేయాల్సిన పరిస్తితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల దిగుబడి ఘననీయంగా తగ్గినప్పటికి ధరల పెరుగుదల లేకపోవడంతో రైతులు పాడి పర్రిశమను కూడా వదులుకునే పరిస్థితి నెలకొంది.



ఖర్చులకు కూడా చాలడం లేదు

గతంలో మా కుటుంబానికి 6 గేదెలు ఉంటే మేత లేక మూడింటిని అమ్ముకున్నాం. ఉన్న గేదెలకు కూడా ఎండు గడ్డి అందుబాటులో లేకపోవడంతో పిట్టు, తౌడు కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో పాల ద్వారా వచ్చే డబ్బులు మొత్తం దాణాకు కూడా సరిపోవడం లేదు. వేరే పని లేక గేదెలను మేపుకోవాల్సి వస్తుంది. కనీసం పాల ధరైనా పెంచడమో, సబ్సిడీపై సరపడా దాణా సరఫరా చేయడమో చేస్తే మినహా గేదెలను పోషించే పరిస్థితి కనిపించడం లేదు.

-చాగంటి అనూష, ధర్మవరం, అద్దంకి మండలం

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై శ్రద్ధ చూపాలి

● వైద్యఆరోగ్యశాఖ జేడీ వసంతకుమారి

ఒంగోలు నగరం: వైద్యఆరోగ్యశాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమారి ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా నియమితులైన ఆమె మంగళవారం జిల్లాకు వచ్చారు. ఆమె ముందుగా ఒంగోలులో డీఎంహెచ్‌వో యాస్మిన్‌ను కలిశారు. జిల్లాలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమై మాట్లాడుతూ జిల్లాలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెరిగేలా కృషి చేయాలని, అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు మెరుగు పర్చాలని ఆదేశించారు. ప్రతి ప్రోగ్రాం ఆఫీసర్ కచ్చితంగా పీహెచ్‌సీలను, సబ్ సెంటర్లను తనిఖీ చేసి అక్కడ ఉన్న లోపాలను గుర్తించాలన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. జననీ సురక్ష యోజన, జననీ శిశుసురక్ష యోజన కార్యక్రమాలను విజయవతంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌వో శ్రీధర్, ఎన్ఆర్‌హెచ్‌ఎం ఏవో జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యం చట్టబద్ధతపై ఐఎంఏ నిరసన

ఒంగోలు నగరం: ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యానికి చట్టబద్దత కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించటం పట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిరసన వ్యక్తం చేసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు డాక్టర్ రావిపాటి జయశేఖర్, డాక్టర్ నల్లూరి రాఘవరావు, డాక్టర్ విద్యాశంకర్, డాక్టర్ వీరయ్య చౌదరి తదితరులు మంగళవారం ఒంగోలులోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కుంటి సాకులు చూపుతూ రాజకీయ ప్రయోజనాలు ఆశించి మాత్రమే ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యానికి చట్టబద్దత కల్పించేందుకు పూనుకుందని వారు ఆరోపించారు. ఎంబీబీఎస్ వైద్యులు వైద్యం అందించేందుకు గ్రామాలకు వెళ్లటం లేదని ప్రభుత్వం అంటున్న విధంగా నేడు పరిస్థితులు లేవన్నారు. ఎంబీబీఎస్ వైద్యులు కాంట్రాక్టు పద్ధతిపై కూడా గ్రామాల్లో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటున్నారని వారు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించకుండా ఎంబీబీఎస్ వైద్యులను సేవలు అందించాలని చెప్పటం ప్రభుత్వానికి సహేతుకంగా లేదని విమర్శించారు. గ్రామాల్లో వైద్యులు నివాసం ఉండే విధంగా కనీస మౌలిక సౌకర్యాలు కూడా కల్పించటంలో ప్రభుత్వం ఇప్పటికీ తగిన చర్యలు తీసుకోవటం లేదన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయకుండా వైద్యులను నిందించటం సమంజసం కాదని పేర్కొన్నారు. వైద్యరంగాన్ని అనుత్పాదక రంగంగా చూస్తూ ఆ రంగంపై ఖర్చు చేస్తున్న వ్యయాన్ని వృథాగా భావిస్తుందని వారు ఆరోపించారు. ఎన్టీఆర్ వైద్య సేవ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అనేకం అమలు చేస్తున్నా ఇప్పటికీ ప్రజలు వైద్యం కోసం తమ జేబు నుంచే 70 శాతం ఖర్చు భరిస్తున్నారన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యానికి చట్టబద్దత కల్పించటం వెనుక ప్రభుత్వం ఓటుబ్యాంకు రాజకీయం నడుపుతుందని ఐఎంఏ నాయకులు ఘాటుగా విమర్శించారు. గ్రామాల్లో రాజకీయ మనుగడ, ఓట్లు రాబట్టుకునేందుకు గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం దురాచనతోనే ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యానికి చట్టబద్దత కల్పించే అంశాన్ని తెరపైకి తెస్తున్నాయన్నారు.

వైద్యరంగంలో అత్యంత ప్రతిభావంతులైన వారు మాత్రమే వైద్యులుగా ఎంపికవుతారని, వీరికి తగిన జీతభత్యాలు, సదుపాయాలు కల్పించటంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు ప్రజల దృష్టిలో వైద్యులను దోషులుగా నిలబెట్టేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ప్రభుత్వం ప్రజారోగ్య వ్యతిరేక విధానాలను మానుకోకపోతే నిరసన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి: అద్దంకి మండలం శాంతినగర్ వద్ద సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిలిస్టుకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన పి.రవిబాబు సోమవారం అర్ధరాత్రి సమయంలో అద్దంకి నుంచి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. హైవే పోలీసు వాహనం సిబ్బంది గుర్తించి రవిబాబును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు.


గిద్దలూరులో రాచర్ల గేటు వద్ద ట్యాంకర్లలో నీటిని పట్టుకుంటున్న మహిళలు


జయరాంపురంలో ఎద్దుల బండిలో నీరు తెచ్చుకుంటున్న దృశ్యం


ఒంగోలులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పైపుతో నీళ్లు పట్టుకుంటున్న మహిళ


నగరంలో నీటి కష్టాలకు నిదర్శనం ఈ చిత్రం


మార్కాపురంలో సుదూర ప్రాంతం నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం


ఒంగోలు రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నీటి కోసం ఏర్పాటు చేసి బిందెల లైను

బిందెడు నీటికీ బారులు

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీలో నీటి కోసం ఇంటిల్లిపాదితో కలిసి ట్యాంకరు వద్ద బిందెడు నీటి కోసం బారులు తీరాల్సిందే. ప్రతిరోజు ఒక వ్యక్తికి 80 లీటర్లు అవసరమవుతుంది. వీటిని ప్రస్తుతం మున్సిపాలిటీ మనిషికి 40 లీటర్ల చొప్పున సరఫరా చేసేందుకు ట్యాంకర్ల ద్వారా రోజుకు 600 నుంచి 610 ట్రిప్పులు సరఫరా చేస్తున్నారు. కొంతమంది రాత్రి పూట ట్యాంకర్ల కోసం బజారులోనే డ్రమ్ములు, ప్లాస్టిక్ బిందెలతో నిరీక్షిస్తున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. రెండు రోజులకొకసారి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తుండటంతో పల్లెల నుంచి వచ్చి పట్టణంలో స్థిరపడిన వారు తిరిగి గ్రామాలకు పయనమవుతున్నారు. వృత్తిరిత్యా స్థిరపడిన వారు కుటుంబ సభ్యులను గ్రామాలు వదిలేసి ఇంటి యజమాని పట్టణంలో ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. వారాంతరాల్లో దుస్తులు తీసుకుని కుటుంబసభ్యులు స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం పట్టణంలో 180 బోర్లకు 38 బోర్లు మాత్రమే పని చేస్తున్నాయి. దరిమడుగు సమీపంలో మహమ్మద్‌సా కుంటలో బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తమవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని బోర్లు రీచార్జి అయ్యాయి. మున్సిపాలిటీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలలో నీటి లభ్యతను గుర్తించి సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.


చాకలి బజారులో ట్యాంకరు కోసం ఎదురు చూస్తున్న మహిళలు

నీటి కష్టాలు

ఒంగోలు నగరం, పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలైన మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెంలలో నీటి కష్టాలకు నిదర్శనం ఈ చిత్రాలు. నీటి ఎద్దడిని పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు.



ఎండుముఖం పట్టిన ఎస్ఎస్ ట్యాంకు, ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న మహిళ

నగరంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి: శిద్దా

ఒంగోలు కార్పొరేషన్ : నగరంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు నగరపాలక సంస్థ కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణకు ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని మంత్రి నివాసంలో కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్‌లలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైతే అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీరు అందించాలని తెలిపారు. ఇదే సమయంలో మంత్రి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో సుమారు రూ.1800 కోట్లతో రహదారులు అభివృద్ధి చేశామన్నారు. గృహనిర్మాణంలో జిల్లాలోనే దర్శి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 1250 గృహాలు నిర్మించడం లక్ష్యం కాగా, 1093 గృహాలు నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం బీసీ సంక్షేమ సాధన సమితి ఆధ్వర్యంలో పర్యావరణ రహిత సైకత గణపతి ఇసుకతో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహానికి సంబంధించిన పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ, దర్శి గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.


వై.పాలెంలో రిక్షాతో తెచ్చిన నీటిని పశువుల కోసం తొట్టిలో పోస్తున్న రైతు

రిక్షా నీళ్లే గేదెలకు రక్ష

ఎర్రగొండపాలెం రూరల్: తాగు నీటి కష్టాలు ప్రతి పల్లెను పలకరిస్తున్నాయి. అన్నిచోట్ల ఇప్పుడు నీటి సమస్యే కనిపిస్తోంది. పట్టణం పల్లె తేడా లేకుండా వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి కష్టాలు అధికమవుతున్నాయి. మనుషులకే ఇబ్బందులు వచ్చిన సమయంలో పశువులకు నీటిని ఎలా సమకూర్చుకుంటున్నారని కొందరిని పలకరించగా వారి కన్నీటి కష్టాలు చెప్పుకున్నారు. ఎర్రగొండపాలెం సమీపంలోని జంగాలపల్లి వద్ద కొన్ని కుటుంబాలు కేవలం పశుపోషణపైనే జీవనం సాగిస్తున్నారు. అందులో నాలుగు కుటుంబాలలో ఒక్కొక్కరు 5 నుంచి 8 గేదెలను మేపుతున్నారు. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీవిస్తున్నారు. పావులూరి వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి తనకున్న 5 గేదెల కోసం రెండెకరాలు కౌలుకు తీసుకుని అందులో గ్రాసం పెంచుతున్నాడు. మరి నీటి సంగతి అంటే అదే పొలంలోని బోరు వద్ద నుంచి రిక్షాతో తెచ్చుకుని వాటిని తొట్టిలో నింపి వాటి దాహం తీర్చుతున్నాడు. వేసవిలో ఆ బోరు కూడా రాక నీటి కోసం ఎంతో ఇబ్బందులు పడ్డామని తెలిపారు. పంచాయతీ అధికారులు పంపే ట్యాంకర్లు కూడా తమ దగ్గరకు వచ్చేవి కాదంటున్నారు. ఇప్పుడు కూడా కొద్దిపాటి నీరు బోర్లలో వస్తుంటే వాటిని రిక్షాకు అమర్చుకున్న ట్యాంకుకు నింపి పశువుల కోసం తెచ్చుకుంటున్నామన్నారు. ఇక్కడ అందరిదీ అదే తీరు. రిక్షా నీరే వారి పశువులకు రక్ష అని వారు చెబుతున్నారు.

ఈ ఫొటోలో ఒక కుటుంబం వారి ఇంటి అవసరాల కోసం ఇలా ఆటోలో నీటిని తరలించుకుపోతున్నారు. మురారిపల్లి చెరువు వద్ద ఉన్న బోరు నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న మురారిపల్లె గ్రామానికి ఆటోలో నీరు తీసుకెళుతున్నారు. గ్రామంలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నప్పటికీ ట్యాంకర్ల వద్ద చిన్నపాటి వివాదాలు, నీరు సరిపోక పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఆటో ఏర్పాటు చేసుకుని బిందెలు, డ్రమ్ములు నింపుకుని ఇలా ఇంటికి తీసుకువెళుతున్నారు.


ఆటోలో నీటిని తరలించుకుంటున్న ఓ కుటుంబం


గిద్దలూరులోని రాచర్ల రోడ్డులో ట్యాంకర్‌పైకి ఎక్కి నీరు తోడుకుంటున్న దృశ్యం


గిద్దలూరులో నీటి కోసం బిందెల క్యూ


రాచర్లలో మిర్చి పంట కాపాడుకునేందుకు ట్యాంకరుతో నీరు పెడుతున్న రైతు


గిద్దలూరులో చుక్కనీరు లేని సగిలేరు నది


నిరుపయోగంగా ఉన్న బైరేనిగుండాల నీటిపథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఓవర్ హెడ్ ట్యాంక్

ఆరోగ్య ఉప కేంద్రాలకు ఫీవర్...

- పక్కా భవనాలు, సిబ్బంది కొరత
- 535 ఉపకేంద్రాలకు 100కే స్వంత భవనాలు

కనిగిరి : అసలే వ్యాధులు కాలం.. వర్షా కాలం కావటంతో జ్వరాలు సోకి పల్లెల్లో ప్రజలు మంచాన పడుతున్నారు. వైద్యసేవలు అందించాల్సిన ఈ సమయంలో ప్రభుత్వ వైద్యసేవలు నామమాత్రంగా మారాయి. ఆరోగ్య సేవలు అందించడంలో కీలకమైన సిబ్బంది కొరతతో ఉపకేంద్రాలు మూతబడుతున్నాయి. మందులు కొరత పట్టి పీడిస్తుంది. జిల్లాలో 535 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా 100కు మాత్రమే స్వంత భవనాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, విష జ్వరాలు విజృంభించడంతో పాటు సాధారణ వ్యాధులకు గురైనా ప్రైవేట్ ఆసుపత్రులను రోగులు ఆశ్రయిస్తున్నారు.


సిబ్బంది కొరతతో మూతపడిన లింగారెడ్డిపల్లి ఉపకేంద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలోని వైద్య ఉపకేంద్రాలు గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు. ప్రజలు వీటి ద్వారా నామమాత్రపు సేవలు అందడం లేదు. 25 వేల జనాభా ఉన్న ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 7 వేల జనాభా ఉన్న పరిధిలో అనుభందంగా ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే మౌలిక వసతులు కల్పించ లేదు, వసతులు ఉన్నచోట సిబ్బంది ఉండరు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యసేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పామూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం, ఆరు మండలాల్లో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో 54 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. నాలుగు కేంద్రాలకే స్వంత భవనాలు ఉన్నాయి. పేరుకే తప్ప ఎటువంటి వైద్యసేవలు అందడం లేదు.

అంబవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఇరుకైన గదుల్లో ఉండటం వలన వైద్యసేవలు అందించలేకపోతున్నారు. పీసీపల్లి, వెలిగండ్ల, సీయస్ పురం, పామూరు మండలాల్లో 34 ఉప కేంద్రాలు ఉండగా ఒక్క దానికి పక్కా భవనం లేదు. దీంతో సిబ్బంది ఉన్నా వైద్యసేవలు అందటం లేదు, కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లోని లింగారెడ్డిపల్లి, సీతారామపురం గ్రామాల్లో ఉప కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నా సిబ్బంది వినియోగించడం లేదు. ఉపకేంద్రాలకు ప్రభుత్వం అద్దె నెలకు రూ.250లు ఇస్తారు. ఇంత తక్కువ మొత్తానికి అద్దెలకు కనీసం చిన్న గది కూడా దొరకదు. గతంలో ఉపకేంద్రాల నిర్వహణకు ఏడాదికి రూ.10 వేలు కేటాయించే వారు. దీంతో ఫర్నిచర్, స్టేషనరీ, విద్యుత్ బిల్లులు, వైద్య పరికరాలు కొనుగోలు చేసేవారు. గత ఏడాది రూ.1100లు తగ్గించారు. దీంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు

సిబ్బంది కొరత

ఆరోగ్య ఉపకేంద్రాలకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కనిగిరి, పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లో మండలంలో లింగారెడ్డిపల్లి, పాతపాడు, గురవాజీపేట, తాళ్ళూరు, పొనుగోడు, వగ్గంపల్లి, హెచ్‌ఎంపాడు, రాళ్ళపల్లి కంకణంపాడు, గుడిపాటిపల్లి, మారెళ్ళ, పీసీపల్లి తదితర కేంద్రాల్లో సిబ్బంది కొరతతో వైద్యసేవలు అందించడం లేదు. ఉన్న చోట సిబ్బంది కొందరు గ్రామాలకు వెళ్లకుండా పీహెచ్‌సీలలోనే ఉంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏదో నామమాత్రంగా మినహా అవసరమైన మందులు పీహెచ్‌సీలో అందుబాటులో లేవు. దీంతో మెడికల్ షాపుల్లో రోగులు మందులు కొనుగోలు చేస్తున్నారు. ఏ వ్యాధులు వచ్చినా ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజలు వెళ్లాల్సి వస్తుంది.


పంచాయతీ భవనంలో నామమాత్రంగా కొనసాగుతున్న ఉప కేంద్రం

54 కేంద్రాల్లో నాలుగింటికే పక్కా భవనా లు

కనిగిరి నియోజకవర్గంలో 54 ఉప కేంద్రాలు ఉండగా నాలుగు కేంద్రాలకే పక్కా భవనాలు ఉన్నాయి. కనిగిరి మండలంలో మూడు, హనుమంతునిపాడు మండలంలో ఒకటి ఉన్నాయి. మిగిలిన చోట గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇరుకైన అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. పామూరు మండలంలో 14 ఉండగా ఒక్క పక్కా భవనం లేదు. వెలిగండ్ల మండలంలోని రామగోపాలపురం, సీయస్‌పురంలోని

విద్యార్థులకు రాత పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

ఒంగోలు రూరల్ : ప్రముఖ ఆడిటర్ బాలా కుమారుడు సందీప్ పెళ్లిరోజు, మనుమడు సాత్విక పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కొప్పోలులో బెజవాడ సుందరరామయ్య ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో రాతపుస్తకాలు, బ్యాగులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ బాలాకుటుంబసభ్యులు, పాఠశాల కరస్పాండెంట్ ఓగిరాల వెంకట్రామయ్య, పాటిబండ్ల వీరరాఘవులు, పల్లపోలు శేషగిరిరెడ్డి, చుండూరి శివప్రసాదు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

13

ఒంగోలు

ప్రకాశం ● బుధవారం 23 ఆగస్టు 2017

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

కొత్తపట్నం(ఒంగోలునగరం): మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే భక్తులు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని కొత్తపట్నం ఎస్‌ఐ ఆంజనేయులు చెప్పారు. విగ్రహం ఏర్పాటు స్థలం, నిమజ్జనం వంటి వివరాలు తెలియజేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకుసహకరించాలనివిజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు క్రైం : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యయత్నం చేశాడు. అద్దంకి మండలం కలవకూరుకు చెందిన యు. హనుమంతరావు నగరంలోని గద్దలగుంటలో బంధువుల ఇంటికి వచ్చాడు. అనంతరం లాయర్‌పేటలో ఉన్న బార్‌లో మద్యంతోపాటు పురుగు మందు కలుపుకొని తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి రిమ్స్‌కు తరలించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ఒంగోలు క్రైం : అనుమానంతో భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైన సంఘటన స్థానిక శ్రీరామ్ కాలనీలో చోటుచేసుకుంది. తోకా శ్రీను తన భార్యపై అనుమానంతో మంగళవారం దేవుని పటం ఆమె తల మీద పెట్టి 'నీ ప్రవర్తనపై నిజం చెప్పాలని' కోరాడు. ఆ సమయంలో వారి మధ్య పెనుగులాట జరిగి దేవుడు పటం పగిలింది. దీంతో ఆమెకు గాయమైంది. ఈ మేరకు ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతూ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆటో బోల్తా... ఇద్దరికి స్వల్ప గాయాలు

ఒంగోలు క్రైం : ఆటోబోల్తా పడి ఇరువురికి గాయాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం ప్రకాశం భవనం ఎదురుగా జరిగింది. వేగంగా వెళుతున్న ఆటో ముందు వెళుతున్న మోటారు సైకిలిస్టును తప్పించబోయి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. బాధితుల వివరాలు తెలియలేదు.

గ్రామీణ వైద్యులకు శిక్షణ ప్రారంభించాలి

ఒంగోలు నగరం : గ్రామీణ వైద్యులకు పారామెడిక్స్ శిక్షణను వెంటనే ప్రారంభించాలని జిల్లా రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి బట్టు బాలాజీరావు ఒక ప్రకటనలో కోరారు. గతంలో రాష్ట్రంలోని 60 శాతం మంది ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు పారామెడిక్స్ శిక్షణ ఇచ్చి వారికి పరీక్షలు నిర్వహించినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన వారికీ శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు.

బ్యాంకుల సమ్మె విజయవంతం



మూతేసిన బ్యాంక్

ఒంగోలు వ్యవసాయం : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ తొమ్మిది ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం చేపట్టిన బ్యాంకుల సమ్మె విజయవంతమైంది. స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని ఆంధ్రాబ్యాంకు మెయిన్ బ్రాంచి వద్ద బ్యాంకు ఉద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశానికి యూఎఫ్‌బీయూ కన్వీనర్ వి.పార్థసారథి అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ ఈ సమ్మె తమ జీత భత్యాల పెంపు కోసం కాదని, బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకునేందుకేనని చెప్పారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక సంస్కరణల పేరుతో, బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణ లాంటి చర్యలు చేపట్టి బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. దేశంలో 12మంది కార్పొరేటర్లు రూ.2.28లక్షల కోట్లు బకాయిలు బ్యాంకులకు కావాలనే చెల్లించకపోయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రజల శ్రేయస్సు కోసం చేస్తున్న సమ్మెకు అందరూ మద్దతునిచ్చి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నవంబరు నెలలో వరుసగా రెండు రోజులు సమ్మె చేపట్టాలని, ప్రభుత్వం దిగిరాకపోతే త్రీవస్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎల్ఐసీ ఉద్యోగ తదితర సంఘాల నాయకులు బ్యాంకర్లు చేపట్టిన సమ్మెకు మద్దతునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకులకు చెందిన 474 బ్రాంచిలు మూతపడడంతో సుమారు రూ.6,800 కోట్లు ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు పి.కె. రాజేశ్వరరావు, శోభన్‌బాబు చిటితోటి, వి.రామచంద్రరావు, కసుకుర్తి జానకిరామయ్య, నాగరాజు, నరేంద్రబాబు, యు. వేణుగోపాల్, నరేంద్ర కుమార్,పి.నరసింహం, విజయమోహన్, పారా శ్రీనివాసరావు, చలపతి, ఎంఎస్.సాయి, ఏఐటీయూసీ నాయకులు పి.వి.ఆర్.చౌదరి, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.వి.కొండారెడ్డిలు, శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, రాజీవ్, వి.రామయ్య, కిరణ్, రాకేష్, నారాయణాచార్యులు, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మెకు సీపీఐఎంఎల్ మద్దతు

ఒంగోలు నగరం : బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సీపీఐ (ఎంఎల్) మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

జోన్‌లలోనే వీధి వ్యాపారాలు చేసుకోవాలి

ఒంగోలు కార్పొరేషన్ : స్మార్ట్ సిటీలో భాగంగా నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, వీధి వ్యాపారులు సహకరించి, ఫుట్‌పాత్‌లపై కాకుండా కేటాయించిన జోన్‌లలోనే వ్యాపారాలు చేసుకోవాలని కమిషనరు ఎస్. వెంకటకృష్ణ కోరారు. మంగళవారం స్మార్ట్ సిటీ ప్రతినిధి రూపరాణి కార్పొరేషన్ కార్యాలయంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే నగరంలో విభజించిన జోన్‌లలో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారులు సహకరించి స్మార్ట్ సిటీసాధనకు కృషి చేయాలని కోరారు.

కేంద్రియ విద్యాలయ విద్యార్థికి కరాటేలో బహుమతి

ఒంగోలు విద్య : మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక కేంద్రియ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న టి.శ్రీరామ్‌కు ప్రథమ బహుమతి లభించింది. సుమారు 300 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ విద్యార్థికి గోల్డుమెడల్‌తో పాటు సర్టిఫికెట్‌ను కూడా ప్రదానం చేశారు. శ్రీరామ్‌ను మంగళవారం ప్రిన్సిపల్ బి.శేఖర్, కరాటే మాస్టర్ డి.వెంకటేశ్‌లు అభినందించారు.

మద్యం దుకాణం వద్దని మహిళల ఆందోళన



ఫ్లెక్సీలను ధ్వంసం చేస్తున్న మహిళలు

ఒంగోలు క్రైం : మద్యం దుకాణం వద్దని మహిళలు ఆందోళనకు దిగిన సంఘటన మంగళవారం నగరంలోని షిర్డీ సాయినగర్‌లో చోటుచేసుకుంది. మద్యం దుకాణం ఏర్పాటుకు ఎక్సైజ్ పోలీసులు అనుమతిచ్చారు. యజమానులు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయగా మాజీ కౌన్సిలర్ పగిడి రాములు ఆధ్వర్యంలో మహిళలు దుకాణంలో ఉన్న బాటిళ్లను పగులకొట్టి బోర్డును తగలబెట్టారు. మహిళలు మద్యం దుకాణం వద్దంటే అక్కడ దుకాణాన్ని తీసివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేసిన ఆంధ్రజ్యోతి పత్రికలోని కథనాన్ని అధికారులకు మహిళలు చూపిస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తాలూకా ఇన్‌స్పెక్టర్ గంగా వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి వెళ్లి ఆందోళకారులతో మాట్లాడి ఎక్సైజ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

విరాట్‌నగర్‌లో మద్యం దుకాణం వద్దంటూ మంత్రి శిద్దాకు వినతి

ఒంగోలు కార్పొరేషన్ : నగరంలోని విరాట్‌నగర్‌లో మద్యం ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి ఎక్సైజ్ డీసీ జోస్‌ఫ్ కు ఫోన్ చేసి దుకాణ ఏర్పాటును పరిశీలించాలని ఆదేశించారు.

ఉద్యోగ మేళాలో 32 మంది నాగార్జున విద్యార్థుల ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్ : మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలోని శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా జరిగింది. కళాశాల కరస్పాండెంట్ వి. రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సి. వసంతలక్ష్మీ, ఐసీఐసీఐ బ్యాంకు హెచ్ఆర్ మేనేజర్ ధర్మ పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు సుమారు 250 మంది మేళాలో పాల్గొన్నారు. వీరిలో 32 మంది ఎంపికయ్యారు. వీరికి ఆఫర్ లెటర్లను అందజేశారు. ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులను కాలేజి కరస్పాండెంట్ రాంప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్. యోగయ్య చౌదరిలు అభినందించారు.

కారుణ్య నియామకాల్లో విద్యార్హత తగ్గింపుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారుణ్య నియామకాలలో విద్యార్హత తగ్గింపు, వద్దనుకున్న వారికి పరిహారం పెంచడంపై దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సమితి కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమూరి ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, బహుజన విద్యార్థి సంఘ నాయకుడు ఎం. ఆదినారాయణ, మేకల హరిబాబు, పిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితిపండుగను పురస్కరించుకొని ఈ నెల 24 వ తేదీ ఉదయం పది గంటల నుంచి స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తాతా బధరీనాథ్ తెలిపారు. స్థానిక తాతా ప్రసాద్ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి క్లబ్ ఆధ్వర్యంలో నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలకు ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోడూరి కిషోర్, మోదుకూరి శ్రీనివాసరావు, గుర్రం బదరీ, అన్నకోట శ్రీనివాసరావు, బియ్యపు విజయకుమార్, ఆలపాటి విష్ణువర్ధనరావు, నేరెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పోస్టర్లను ఆవిష్కరించారు.

అసభ్య దూషణ చేశారంటూ విశ్రాంత ఉద్యోగిపై ఫిర్యాదు

ఒంగోలు క్రైం : మహిళలపై అసభ్యంగా మాట్లాడిన విశ్రాంత ఉద్యోగి పెంకుల సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్సై సురేష్ తెలిపారు. పేర్నమిట్ట శాంతినగర్‌లో రిటైర్డ్ డీఈ పెరికల సుబ్బారావు నివాసం వద్ద ఉండి ఆ రోడ్డును వచ్చివెళ్లే మహిళల పట్ల అసభ్యపదజాలంతో మాట్లాడుతున్న సుబ్బారావుపై మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశాడు.

'దామచర్ల' విద్యార్థినులకు కంటి పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్ : స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల మెడికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్, మహిళా సాధికారత కమిటీ, ఎన్ఎస్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మోడరన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోడరన్ కంటి ఆస్పత్రి వైద్యులు డి. అర్పణ షాఫర్ మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలైతే దేహానికి దీపం నేత్రాలని, మానవుని శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రభావం నేత్రాలపై ఖచ్చితంగా ఉంటుందని తెలిపారు. గ్లకోమాని కూడా ప్రాథమిక దశలోనే నివారించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమలత, అనంతలక్ష్మి, డాక్టర్ పద్మావతి, యామిని అమ్మాజి, కంటి ఆస్పత్రి పీఆర్వో ఎస్‌కే నరేష్, టెక్నీషియన్లు శ్యాంబాబు, డి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు పోటీలు

ఒంగోలు కార్పొరేషన్ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శివాజి తెలిపారు. మంగళవారం స్థానిక ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ క్యాంపస్‌లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ కో ఆర్డినేటర్ శివాజి మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో పోస్టర్ పెయింటింగ్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, టూరిజం ఫొటోగ్రఫీ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు అంశాల్లోని విజేతలకు సెప్టెంబరులో విజయవాడలో జరిగే ప్రపంచ పర్యాటక దినత్సోవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా బహుమతి ప్రదానోత్సవం చేస్తారని పేర్కొన్నారు. 94405 20219 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.యూనివర్సిటీ ఈసీ మెంబర్ టీఎస్ఎస్. సింగ్, స్పెషలాఫీసర్ నిర్మలామణి, డాక్టర్ హైమావతి పలువురు పాల్గొన్నారు.

నేడు ప్రకాశం జయంతి వేడుకలు

అద్దంకి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఉదయం 8 గంటలకు అద్దంకిలో జరుగుతాయని ప్రకాశం మిత్రమండలి సభ్యులు గాడేపల్లి దివాకర్ దత్తు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా బంగ్లారోడ్డులోని ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ విభాగాలలో గీతామందిరంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.



శంఖవరప్పాడులో బోరింగ్ చుట్టూ నిలిచిన మురుగు నీరు

పారిశుధ్యం పడక

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం అయినప్పటి నుంచి ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సైడ్‌డ్రైన్‌ల పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించింది. అయితే క్షేత్ర స్థాయిలో సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు...

- **శంకవరప్పాడులో విషజ్వరాల విజృంభణ**
- **డెంగ్యూ జ్వరంతో చిన్నారి మృతి**
- **50 మందికి జ్వరపీడితులు**
- **గ్రామాల్లో ముందుకు కదలని మురుగు**
- **ఆందోళనలో గ్రామస్థులు**
- **కానరాని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది**

అద్దంకి: అద్దంకి మండలంలోని శంకవరప్పాడు, ధర్మవరం, చెరువుకొమ్ముపాలెం, వెంకటాపురం, శింగరకొండపాలెం తదితర గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇళ్లలోని మురుగుతో పాటు పశువుల కొష్టాల నుంచి వచ్చే వ్యర్థాలు కూడా సైడ్‌డ్రైన్‌లకు చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాలకు మురుగు మొత్తం రోడ్లపై చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. సైడ్‌డ్రైన్‌లు పూడ్చి వేయటంతో సమస్య మరింత తీవ్రం అవుతోంది. అన్ని గ్రామ పంచాయతీలకు పారిశుధ్య పనుల కోసం నిధులు కేటాయింపు జరిగినప్పటికి పుస్తకాలలో వినియోగం జరుగుతున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం పనులు జరగటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

విజృంభిస్తున్న వాధులు

గ్రామాల్లో పారిశుధ్య సక్రమంగా లేకపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అద్దంకి మండలంలో శంకవరప్పాడు, బల్లికురవ మండలం వల్లాపల్లిలలో జ్వరపీడుల సంఖ్య ఎక్కువగా ఉంది. శంకవరప్పాడులో బిజ్జం పూజిత(9) అనే బాలిక డెంగ్యూ జ్వరంతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ గ్రామంలో సుమారు 50 మందికి పైగా విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఎక్కువ మంది బాధితులు గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ వద్దనే వైద్య చికిత్సలు పొందుతున్నారు. మరి కొంతమంది అద్దంకిలోని ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కూడా శంకవరప్పాడులో ఒక్కసారిగా విష జ్వరాలు విజృంభించి వంద మంది వరకు అనారోగ్యానికి గురయ్యారు. అయితే గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.శంఖవరప్పాడులో ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న సైడ్ డ్రైన్ పూడిక తీయకపోవటం, కొందరు షాపులు ఏర్పాటు చేసుకోవటంతో మురుగు ముందుకు కదలటం లేదు. దీనికి తోడు పలుచోట్ల సైడ్‌డ్రైన్ నీరు ముందుకు కదలకుండా అడ్డుకట్టలు వేయటంతో ఎక్కడిక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నది. నెలల తరబడి మురుగు నిలవటంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలను వ్యాపింపజేస్తున్నాయి. అయితే గ్రామపంచాయతీ అధికారులు కనీసం మురుగు పారుదలకు చర్యలు తీసుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగుకాలువలలో పూడిక తీత పనులు చేపట్టడంతో పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



శంఖవరప్పాడులో వైద్యం కోసం కూర్చొని ఉన్న రోగులు



ధర్మవరంలో పేరుకు పోయిన మురుగు



చెరువుకొమ్ముపాలెంలో సైడ్‌డ్రైన్ నిండా పెరిగిన గడ్డి



వెంకటాపురంలో రోడ్డు పైనే నిలిచి ఉన్న మురుగు

నేడు వనితాకార్డు మేళా

అద్దంకిరూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం వనితాకార్డుల మేళాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహనరావు మంగళవారం తెలిపారు. చందలూరు, పంగులూరు, తాళ్లూరులో వనితాకార్డుల మేళాలు జరుగుతాయని, కేవలం రూ.100లతో వనితా కార్డు పొందటం వల్ల ప్రయాణచార్జిలో 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. రూ.లక్ష ప్రమాద బీమా వర్తిస్తుందని, కావాల్సిన వారు రేషన్ కార్డుతో పాటు కుటుంబసభ్యుల గ్రూఫ్ ఫొటోతో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు శిక్షణ

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని ఎన్టీఆర్ డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు సంబంధించి మంగళవారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎంవీ.రత్తయ్య ప్రకటనలో తెలిపారు. ట్రైనర్స్ సి.శ్యామ్ సుందర్, జె.గోపీనాథ్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్, రీజనింగ్, అర్థమేటిక్, ఎబిలిటీలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎంఏ.రత్తయ్య పాల్గొన్నారు.

17 ఆటోలకు జరిమానా

మేదరమెట్ల : బొడ్డువానిపాలెం వద్ద మంగళవారం సాయంత్రం ఆర్టీసీ అధికారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళుతున్న 17 ఆటోలను ఆపి జరిమానాలను విధించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆర్టీసీ డీఎం రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ రాక

అద్దంకి: ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసరెడ్డి బుధవారం అద్దంకి రానున్నట్లు యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగే ప్రభుత్వ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థలు అనే అంశంపై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు.

లారీ డ్రైవర్ అరెస్టు

అద్దంకి: అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు మారాసు సుబ్బారావు మృతికి కారణమైన లారీడ్రైవర్ అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ అబ్దుల్‌నవీను మంగళవారం అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పొగ రహిత పాఠశాలలే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీపీ

సంతమాగులూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు అన్నారు. మంగళవారం సంతమాగులూరు కాలనీ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ పొయ్యిలను ఆయన పంపిణీ చేశారు. ప్రతి పాఠశాలలో గ్యాస్ పొయ్యిలను తప్పనిసరిగా వినాయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం వండి పెట్టించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయులు పుల్లారావు, వలీఖాన్, కుంచాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

అద్దంకి రూరల్: ఆలిండియా డాక్ సేవక్స్ యూనియన్ ఏఐజీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అద్దంకి సబ్ పోస్టాఫీస్‌లో తపాలా ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు మన్నెం త్రిమూర్తులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తపాలా ఉద్యోగుల సమస్యలపై ప్రధాని మోది, సీఎం చంద్రబాబులకు లేఖ రాశారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.మీరావలి, సాయికుమార్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, పోస్ట్ మ్యాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులు మిలీనియం మార్చ్‌కు తరలిరండి

పంగులూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పూర్తిస్థాయి పింఛన్ సౌకర్యం కల్పించి సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న విజయవాడలో చేపట్టిన మిలీనియం మార్చ్‌కి హాజరు కవాలని జిల్లా, మండల బాధ్యులు ప్రతాప్, బి.రాంబాబు, రహంతుల్లా కోరారు. సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన మిలీనియం మార్చ్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

బోరు బావులపై అప్రమత్తంగా ఉండండి : ఎంపీడీవో

బల్లికురవ: వినియోగంలోకి బోరు బావులను పూడ్చాలని ఎంపీడీవో ఎం.శ్యామ్‌ప్రసాద్ కోరారు. మంగళవారం బల్లికురవ మన గ్రోమోర్, అధికారుల పర్యవేక్షణలో బోరుబావులపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రమాదాలు జరగక ముందే ప్రజలు అప్రమత్తం కావాల్సి ఉందని, వాడకం లేని బోరు బావులను పూడ్చి వేయాలన్నారు. ర్యాలీలో ఈవోఆర్డీ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది, ఏపీఎం సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టండి : డీఎల్‌పీవో



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సుమతీకళ

బల్లికురవ: అన్ని గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలని డీఎల్‌పీవో సుమతీకళ ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వల్లాపల్లిలో వణికిస్తున్న విషజ్వరాలు వార్తాకథనం ప్రచురితం కావడంతో మంగళవారం డీఎల్‌పీవో గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులు మెరుగుపరచాలని, సీజనల్ వ్యాధులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆ మె సూచించారు. రోడ్లను ఆక్రమించుకొని మురికి కాలువలు పూడ్చిన వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. బల్లికురవ గ్రామాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌ప్రసాద్, ఈవోఆర్డీ వెంకటస్వామి, సర్పంచ్ అల్లాఉద్దీన్, పంచాయతీ కార్యదర్శి బాబూరావు పాల్గొన్నారు.

కమనేష్ చంద్ర సిఫార్సులను అమలు చేయాలి

పంగులూరు: గ్రామీణ తపాల శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కమనేష్ చంద్ర సూచించిన సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వెంటేనే అమలు చేయాలని ఎన్ఎఫ్‌సీఐ రాష్ట్ర సహాయం కార్యదర్శి డి.మోహన్‌రావు, శోభన్‌బాబు డిమాండ్ చేశారు. జీడీఎస్ సేవకులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో 88 గ్రామీణ తపాల కార్యాలయాలు మూతపడ్డాయని, పది ఉపకార్యాలయాలు కూడా సమ్మెకు మద్దతుగా బుధవారం విధులకు దూరమవుతాయన్నారు. పంగులూరు మండలంలో పోస్టల్ ఉద్యోగులను కలిశారు. కార్యక్రమంలో నాయకులు మీరావలి, హనుమంతరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - ఆనందో బ్రహ్మ
వీఎన్ఎస్- నేనేరాజు-నేనేమంత్రి
మినీవిఎన్ఎస్ - లై

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - జయ జానికీ నాయక

రైతులకు రాయితీపై వరి విత్తనాలు : ఏవో

వేటపాలెం: రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందిస్తామని ఏవో పూర్ణచంద్రరావు తెలిపారు. మంగళవారం వేటపాలెం మండలంలోని పాపాయిపాలెం, వాకావారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగుకు ముందు కేజీ వరి విత్తనాలకు 3 గ్రాముల కార్బన్‌డిజంతో కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని ఏవో తెలిపారు. రాయితీపై ఎన్‌ఎల్‌ఆర్ 34449 (జిలకరమసూర) విత్తనాలు పంపిణీ చేస్తామని, రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఏఈఓ ఎం.గోపికృష్ణ, ఎంపీఈవో డి.కవిత, పి.కుసుమకుమారి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ....

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు

ఎ.రవీంద్రబాబు,
అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, చీరాల



మీ పరిధిలో ఎన్ని హాస్టల్స్ ఉన్నాయి ?

మొత్తం 22 హాస్టల్స్ ఉన్నాయి. అందులో నాలుగు హాస్టల్స్‌కు ఇన్‌చార్జి వార్డెన్‌లు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నారా?

ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తాం. ఎటువంటి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మెరుగైన వైద్య సేవలు అందేలా చేస్తాం.

ప్రస్తుతం హాస్టల్స్‌లో ఉన్న సమస్యలు ?

కాస్మోటిక్స్ నిధులు రిలీజ్ కాకపోవడంతో విద్యార్థులకు సబ్బులు వంటివి అందించలేక పోతున్నాం. ఈ సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తున్నట్లు మా పైఅధికారులు తెలిపారు.

ఇతర ఏ విభాగాలు చూస్తారు ?

సొసైటీలు ఏర్పాటు, కులాంతర వివాహాలు ప్రోత్సాహం వంటివి కూడా చూస్తుంటాం.

తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు ?

వసతి గృహంలో ఒక విద్యార్థి 3వ తరగతిలో చేర్చితే చదివించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలి.

సమస్యలను మీ దృష్టికి తీసుకురావాలంటే..?

హాస్టళ్లలోని సమస్యలను నా సెల్ నెంబర్ 9177438275 ద్వారా తెలియపరచవచ్చు.

- చీరాలరూరల్

కొత్తపేటలో పారిశుధ్యం అధ్వానం

● ఇబ్బందిపడుతున్న ప్రజలు

చీరాలరూరల్ : వేటపాలెం మండలం కొత్తపేట మేజర్ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా ఏకె పీ జూనియర్ కళాశాల ఎదురురోడ్డులో నిర్మించిన బహుళ అంతస్తుల నుంచి వెలువడే మురుగునీరు పోవడానికి ఎటువంటి మార్గమూ లేదు. కానీ అనుమతులు వచ్చేశాయి. అందులో నివాసాలు ఉంటున్నారు. అయితే బయటకు వెలువడుతున్న మురుగునీరు ఒకే చోట పేరుకుపోయి దుర్గంధం వెలువడుతున్నది. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వారు బానే ఉన్నారు. కానీ చుట్టుపక్కల వారి పరిస్థితి ఏమిటని అడుగుతున్నారు స్థానిక ప్రజలు. ఇది ఇలా ఉంటే వర్షాకాలం కావడంతో రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటం వల్ల దోమలు ఎక్కువ అయ్యి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.



అపార్ట్‌మెంట్ పక్క ఇంటి ముందుకు భారీగా చేరిన మురుగు

పంచాయతీ పరిధిలోని ప్రసాద్‌నగరంలో అయితే పారిశుధ్య కార్మికులు వారానికి ఒకసారి అయినా శుభ్రం చేయని పరిస్థితి నెలకొంది. దీంతో చెత్త పేరుకు పోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగు పరచాలి



పన్ను వసూళ్లలో కనబరిచే శ్రద్ధ గ్రామంలో పారిశుధ్యంపై కనబరచటం లేదు. అధికారులకు గ్రామంలో అధ్వాన పరిస్థితితులు కనిపించడం లేదు. అధికారులు, పాలకులు స్పందించాలి.

- జె.రాజు, సామాజిక కార్యకర్త

సమ్మెతో మూతపడ్డ బ్యాంకులు

● ఇబ్బందిపడ్డ ఖాతాదారులు



మూతపడిన కొత్తపేట ఎస్‌బీఐ

చీరాల : ఆల్ ఇండియా బ్యాంక్ యూనియన్స్ చేపట్టిన సమ్మె పిలుపు మేరకు మంగళవారం చీరాల పట్టణం, మండల పరిధిలో ఉన్న బ్యాంకులు మూతపడ్డాయి. ఈ సందర్భంగా పలు యూనియన్ల నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు మూతపడటంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల ఏటీఎంలలో నగదు నిల్వలు నిండుకున్నాయి. దీంతో అత్యవసరంగా డబ్బు అవసరమైన వారు ఇబ్బందిపడ్డారు. ఆయా బ్యాంకుల సిబ్బంది తమ బ్యాంకుల ముందు సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బ్యాంకుల యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

చీరాల: ఐటీసీ, ప్రథమ్‌సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9గంటలకు వాడరేవు పంచాయతీ కార్యాలయం వద్ద జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8886516798, 9493648223 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కుకింగ్ ఏజెన్సీలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ



చీరాలలో గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ



దేశాయిపేటలో గ్యాస్‌స్టవ్‌ను అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

చీరాల : మధ్యాన్న భోజన పథకం సంబంధించిన వంటను కుకింగ్ ఏజెన్సీలు గ్యాస్‌తోనే తయారు చేయాలని ఎంఈవో లక్ష్మీనారాయణ ఆదేశించారు. మంగళవారం చీరాల ఎంఈవో కార్యాలయం వద్ద మండల పరిధిలోని హెచ్‌ఎంలకు ఒక్కో పాఠశాలకు రెండు సిలెండర్లు చొప్పున ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 93 పాఠశాలలు ఉండగా 90 పాఠశాలలకు సిలెండర్లు వచ్చాయన్నారు. గ్యాస్ సిలెండర్లు కొనుగోలు పాఠశాల గ్రాంటు నుంచి హెచ్‌ఎంలు కొనుచేయవచ్చని చెప్పారు. కుకింగ్ ఏజెన్సీల నిర్వహకులు ఎక్కడా కట్టెలు పొయ్యి లేదా ఇతరత్రా మార్గాలతో వంట చేయకుడదని స్పష్టం చేశారు.

దేశాయి పేట(వేటపాలెం): దేశాయిపేట పాఠశాలలో కుకింగ్ ఏజన్సీలకు అందించిన గ్యాస్‌స్టవ్‌లను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాకబ్, ఏజెన్సీ నిర్వహకులు నాగేశ్వరమ్మ, అసిస్టెంట్ సుబ్బమ్మ, ఉపాధ్యాయులు అనీల్, ఆంజనేయులు, గుణశేఖర్, నాగరాజు, శైలజ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లును పూతదశలో భూమిలో కలియదున్నాలి

చీరాల : భూములలో సాగుచేసే పచ్చిరొట్ట పైర్లను పూతదశలో భూమిలో కలియదున్నాలని వ్యవసాయ విస్తరాణిధికారి సుబ్రహ్మణ్యం రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెం,తోటవారిపాలెంలలో రైతులు రాయితీ పై జీలుగు విత్తనాలు పొంది సాగు చేసిన జీలుగు పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగు పైరును పూతదశలో భూమిలో కలియదున్నటం వల్ల భూమి సారవంతమై పాలచౌడు విరుగుతుందన్నారు. భూమిలో కర్బన్‌శాతం పెరిగి నీరు నిల్పుకునే శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది ప్రసన్నకుమారి, ధీరజ్, సాంబశివరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వేటపాలెం: బ్రహ్మణ కార్పొరేషన్ ద్వారా నెలవారీ పింఛన్లు పొందేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు దరఖాస్తులు చేసుకోవాలని శ్రీసీతారామ బ్రహ్మణ భక్త సమాజం కార్యదర్శి బుర్రా సాంబశివరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లు నిండిన బ్రహ్మణులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతో పాటు ఫొటోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆంధ్రా బ్యాంకు అకౌంటు, ఆధార్, రేషన్‌కార్డు నమోదు చేయాల్సి ఉంటుదని తెలిపారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9000926010సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న అభిమానులు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

వేటపాలెం: సినీహీరో చిరంజీవి 62వ జన్మదిన వేడుకలను చిరంజీవి అసోసియేషన్ నాయకులు, అభిమానుల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని నీలకంఠాపురంలో గల అనాథ వృద్ద శరణాలయంలో అభిమానుల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మావిడాల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పృధ్వి వెంకటేశ్వర్లు, జిల్లా జాయింట్ సెక్రటరీ నాశిక వెంకటేశ్వర్లు, బండారు బాలసుబ్రహ్మణ్యం, పృధ్వి ప్రసాద్, గుంటూరి శ్రీనివాసరావు, కర్ణ కాళహస్తి, కరీముల్లా, బాబు, శరణాలయం కమిటీ సభ్యులు కోట సుబ్బారావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు అభివృద్ధి పథకాలు అందేలా చూడాలి : పీడీ

చీరాలరూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియపరిచే విషయంలో అలసత్వం పాటించవద్దని డీఆర్‌డీఏ పీడీ మురళి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి పథకాలు చేరాలన్నారు. పారిశుధ్యం, మురుగుదొడ్లు తదితర విషయాలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆర్.శ్రీనివాసులు, వేటపాలెం తహసీల్దార్ మాధవీలత పాల్గొన్నారు.

జీఆర్పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎస్పీ

చీరాల : చీరాల రైల్వే స్టేషన్‌లో ఉన్న జీఆర్పీఎఫ్ కార్యాలయాన్ని ఆర్పీఎఫ్ డీఎస్పీ ఆంజనేయులు మంగళవారం సందర్శించారు. డీఎస్పీ వచ్చిన విషయం తెలుసుకుని విజిట్ వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన విలేఖరులను కలిసేందుకు ఆయన నిరాకరించారు.

ప్రాథమిక స్థాయి నుంచి విద్యాబోధన మెరుగుపడాలి

చీరాల : ప్రాథమిక స్థాయి నుంచి విద్యాబోధన మెరుగుపడాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎం బాబు అన్నారు. చీరాల గరల్స్‌హైస్కూల్‌లో నేషనల్ ఏచీవ్‌మెంట్ సమ్మరీ-2017పై అధ్యాపకులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా రెండురోజుల పాటు ఇచ్చిన శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఉపాధ్యాయులకు సరళమైన రీతిలో విద్యార్థులకు బోధించే విధానాన్ని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	జయ జానకి నాయకా
సంగం	లై
సాయిప్యాలెస్	ఆనందో బ్రహ్మ
శాంతి	నేనే రాజు-నేనే మంత్రి

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కురిచేడు : మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర రెడ్డి తెలిపారు. కురిచేడులో ప్రారంభం కావలసిన పాఠశాల నిర్మాణం ఆలస్యం కావడం వల్ల దర్శి మండలం వెంకటాచలం పల్లె గ్రామం వద్ద నిర్వహిస్తున్నామన్నారు. అక్కడ 2017-18 విద్యా సంవత్సరాని సంబంధించి 5, 6, 7 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9848078024 నంబరులో సంప్రదించాలన్నారు.

వర్షాలకు ఛిద్రమైన రోడ్లు

రాకపోకలకు ఇబ్బందులు

మరమ్మతులపై దృష్టిపెట్టని అధికారులు


కంకర లేచి, గుంతలు పడిన తానంచింతల రోడ్డు

దర్శి : దర్శి ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పలుచోట్ల రహదారులు కోసుకుపోయాయి. ఈ నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి-దొనకొండ రోడ్డులో తుమ్మెదలపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆర్ అండ్‌బీ రోడ్డుకు గండి పడింది. దర్శి-దొనకొండ రోడ్డు నుంచి నడింపల్లి వెళ్లే రోడ్డు కోసుకుపోయింది. దర్శి-పోతవరం రోడ్డు నుంచి తానంచింతల వెళ్లే రహదారి కంకర లేచిపోయి గుంటలు పడి అధ్వానంగా తయారైంది. దర్శి నుంచి మోటుపల్లి వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోలేదు. తుమ్మెదలపాడు గ్రామస్థులు స్వచ్ఛందంగా రోడ్డుకు పడిన గండిని పూడ్చుకున్నారు. మిగిలిన రోడ్లు అసౌకర్యంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కోసుకుపోయిన నడింపల్లి రోడు

బషీర్‌బాషా కుటుంబానికి సహకారం

దర్శి : మండలంలోని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఎస్‌కే బషీర్‌బాషా కుటుంబానికి యూటీఎఫ్ నాయకులు రూ. 1.40 లక్షల కుటుంబ సంక్షేమ సంఘీభావ విరాళం అందజేశారు. నగదును యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వి.రాజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.కోటిరెడ్డి కుటుంబసభ్యులకు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ యూనియన్‌లో సభ్యులుగా చేరిన ఉపాధ్యాయుల కోసం కుటుంబ సంక్షేమ పథకం ద్వారా ఈ సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ దర్శి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.రామిరెడ్డి, పి. కాశీం, నాయకులు భాస్కరరెడ్డి, యల్లమందారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు సన్మానం

కురచేడు : మండలంలో ఈవోఆర్డీగా పనిచేసిన కొండా కోటేశ్వరరావు పదోన్నతిపై చీరాల ఎంపీడీవోగా వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గడ్డం వెంకట రత్నమ్మ హాజరై మాట్లాడారు. కోటేశ్వరరావు పదవికే వన్నె తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ తాను ఇక్కడ సంతృప్తిగా ఉద్యోగం చేశానన్నారు. అందరి సహకారం బాగుందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, గడ్డం బాలయ్య, కిలారి కొండయ్య, సుంకర గాలిబ్ రావు, గంధం గురునాథం, సర్పంచ్ పోతిరెడ్డి నాగిరెడ్డి, ఆలా గోవిందు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

దర్శి : అంకితభావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని ఏపీటీయూసీ జిల్లా నాయకుడు కె.జీవరత్నం పేర్కొన్నారు. ఎన్‌ఏపీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు వై.మల్లారెడ్డి, ఏసు, జె.వెంకటేశ్వర్లును ఉత్తమ అవార్డులు తీసుకున్న సందర్భంగా స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హనుమంతరావు, దేవయ్య, శ్రీనివాసరావు, శంకర్, చిన్నయ్య, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, తిరుపతిరెడ్డి, బ్రహ్మారెడ్డి, నాగతేజ పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

కురిచేడు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస రావు తెలిపారు. 23న ఉదయం 10 గంటల నుంచి ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, ఎస్టీ, 24న కాపు, బీసీ, 2న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు ఆధార్, రేషన్ కార్డులు, ఆన్‌లైన్ దరఖాస్తు, బ్యాంకు పాస్ పుస్తకం నకళ్లు 2 పాస్‌పోర్టు ఫొటోలు తీసుకు రావాలన్నారు.

దొనకొండలో..

దొనకొండ : కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి జరుగుతాయని ఎంపీడీవో అనుమల్ల రాజేందర్ తెలిపారు. ఈ నెల 23 ముస్లిం, క్రిష్టియన్, ఎస్టీ, 24న కాపు, బీసీ, 28న ఎస్సీ కార్పొరేషన్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చెరువులకు జలకళ

దొనకొండ : ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలకు బీడు భూములుగా దర్శనమిస్తున్న పలు గ్రామాల్లోని చెరువులకు జలకళ సంతరించుకుంది. గత మూడేళ్లు సరైన వర్షాలు కురవక చెరువుల్లో చిల్లకంప, రబ్బరు చెట్లు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత వర్షాలకు గంగదేవిపల్లె, పెద్దన్నపాలెం, నరసింహనాయునిపల్లె, పోలేపల్లి మరికొన్ని గ్రామాలకు చెందిన చెరువుల్లో సమృద్ధిగా నీరు చేరుకుంది. దీంతో పశువుల దాహార్తికి వ్యవసాయబోర్లకు భూగర్భజలాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని రైతులు చెబుతున్నారు. మరొకసారి రెండు, మూడు వానలు కురిస్తే అన్ని చెరువులు నిండుతాయనే ఆశాభావంతో ఉన్నారు.


గంగదేవిపల్లె చెరువుకు చేరిన నీరు

వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిబంధనలు పాటించాలి

● సీఐ కేవీ రాఘవేంద్ర

దర్శి : వినాయక విగ్రహాలు ఏర్పాటుకు నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సీఐ కేవీ రాఘవేంద్ర సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏ ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారో, ఎన్నిరోజులు ఉత్సవాలు చేస్తారో వివరాలు తెలియజేయాలన్నారు. మండపాల వద్ద రక్షణ చర్యలు పూర్తిగా నిర్వహకులే తీసుకోవాలన్నారు. పాటకచేరీలకు అనుమతులు పూర్తిగా నిషేధించినట్టు తెలిపారు. అశ్లీల డ్యాన్సులు, అసభ్యకర పాటల కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సీఐ రాఘవేంద్ర

రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకుల బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చకూడదని, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనరాదన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

దర్శి : దర్శి ప్రాంతంలో సాగుచేసిన కంది, సజ్జ, జొన్న పైర్లకు సోకిన తెగుళ్ల నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో బి.సంగమేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని మారెడ్డిపల్లి, తుమ్మెదలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, సజ్జ, జొన్న పైర్లను పరిశీలించారు. ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీపై సూక్ష్మపోషకాలైన జింకు, జిప్సం, బోరాన్‌లను పంపిణీ చేస్తుందని చెప్పారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లను, విత్తనాలను సరఫరా చేస్తున్నామని వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎస్.శశి, ఆత్మ బీటీఎం వై.నాగభూషణచారి, ఎంపీఈవో ఎస్.అఖిల్ పాల్గొన్నారు.



పైర్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శైలజారాణి

పత్తి పంటలో మెగ్నీషియం లోపం

దొనకొండ : మండలంలోని గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటకు మెగ్నీషియం లోపం ఏర్పడిందని ఏవో ఎ.శైలజారాణి తెలిపారు. తెల్లబాడు, పడమర కంభంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెగ్నీషియం లోపం కారణంగా ఎర్రతెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గుతుందన్నారు. నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేటు పైరు వేసిన 45 నుంచి 75 రోజుల తర్వాత రెండు సార్లు పిచకారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమ్మెతో వినియోగదారుల ఇబ్బందులు

కురిచేడు : బ్యాంకుల్లో ప్రభుత్వం సంస్కరణలకు వ్యతిరేకంగా సిబ్బంది సమ్మెకు దిగడంతో మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకులు మూత బడ్డాయి. స్థానిక ఆంధ్రాబ్యాంకు, సిండికేట్ బ్యాంకు శాఖలు తెరుచుకోలేదు. ఖాతాదారులు బ్యాంకులకు వచ్చి ఉసూరుమంటూ వెనుదిరిగారు. స్థానిక బ్యాంకుల్లో సోమవారం నగదు నిల్వలు నిండుకోవడంతో మంగళవారం తీసుకోవచ్చులే అనుకున్న వారికి నిరాశే ఎదురయింది.

ఉపాధ్యాయులకు అవగాహన

దర్శి : ఉపాధ్యాయులకు స్థానిక జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో మంగళవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై విషయ నిపుణులు రాజ్యలక్ష్మి, రమేష్, గణేష్‌లు అవగాహన కల్పించారు. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం గురించి వివరించారు. ఎంఈవో కె.రఘురామయ్య, కాంప్లెక్స్ ఛైర్‌పర్సన్ బి.రమాదేవి, పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్ వాల్‌పోస్టర్ విడుదల

దర్శి : ఏపీసీపీఎస్‌ఈఏ మిలియన్ మార్చ్ సెప్టెంబర్ 1న విజయవాడలో జరుగుతున్న సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం గోడపత్రికను తహసీల్దార్ బి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు రంగరావు, సత్యనారాయణలు మాట్లాడుతూ మిలియన్ మార్చ్ కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వల్లీకుమార్, వీఆర్వో రాయవరపు శ్రీనివాసరావు, రంగస్వామి, శివప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న తహసీల్దార్

సినిమాలు

దర్శి

వెంకటేశ్వర	ఫిదా
శ్రీనివాస	నక్షత్రం
శివశంకర్	గౌతమ్‌నంద
భాస్కర్	బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్

బీడు భూములన్నీ సస్యశ్యామలం

● క్వాలిటీ కంట్రోల్ డీఈ మహబూబ్

మారెళ్ళ (ముండ్లమూరు) : గంగన్నపాలెం ఎత్తిపోతల పథకం కింద 2300 ఎకరాలు సాగులోకి రానున్నాయని, బీడుభూములన్నీ సస్యశ్యామలం కానున్నాయని క్వాలిటీ కంట్రోల్ డీఈ షేక్ మహబూబ్ తెలిపారు. మండలంలోని మారెళ్ళ పంచాయతీ పరిధిలోని గుండ్లకమ్మ నదిపై రూ. 22 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన గంగన్నపాలెం ఎత్తిపోతల పథకం-2ను ట్రయల్‌రన్‌ను డీఈ షేక్ మహబూబ్ సుభాని మంగళవారం పరిశీలించారు. ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో కాంట్రాక్టర్లు, సిబ్బందిని అభినందించారు. ఎత్తిపోతల పథకానికి మొత్తం 26 డీసీలు ఉండగా పైపులైన్‌కు ఎక్కడా లీకులు లేకపోవడంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించినట్లు క్వాలిటీ కంట్రోల్ అధికారులు గుర్తించి ఐడీసీ అధికారులకు కూడా అభినందించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది శివప్రసాద్, ఇరిగేషన్ ఏఈ మధుసూధన్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ట్రయల్‌రన్‌ను పరిశీలిస్తున్న అధికారులు →



రుణాలు సకాలంలో చెల్లించాలి

మారెళ్ళ (ముండ్లమూరు) : స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సద్వినియోగం పరుచుకొని, తిరిగి సకాలంలో చెల్లించాలని, తద్వారా వడ్డీ లేని రుణాలు పొందవచ్చని మారెళ్ళ సిండికేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రాజేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మారెళ్ళలో మారెళ్ళ సంఘం-1, మారెళ్ళ సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ సంఘ అధ్యక్షురాలు నరసమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అయినరాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి పొదుపు గ్రూపు గ్రామ సంఘంలో రూ.1000 పొదుపు చేసుకోవాలని సూచించారు. తీసుకున్న స్త్రీనిధి ఎస్సీ, ఎస్టీ, బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు పరిధిలో మొత్తం 89 గ్రూపులు ఉండగా 2 సంఘాలు చెల్లించడం లేదన్నారు. ఇప్పటి వరకు రూ. 4 కోట్ల రుణాలు అందించినట్టు చెప్పారు. వెలుగు సీసీ కోటేశ్వరి మాట్లాడుతూ గ్రామ సంఘాలు పటిష్ఠంగా ఉండాలంటే ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. స్త్రీనిధి, సీఐఎఫ్ అర్హత ఉన్న గ్రూపులను బట్టి రుణ సౌకర్యం అందిచడం జరుగుతుందన్నారు. సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించిన పొదుపు గ్రూపులకు మరిన్ని రుణాలు అందిస్తామన్నారు. సమావేశంలో సీసీ వి.కోటేశ్వరి, గ్రామ సంఘ అధ్యక్షుడు ప్రతిమ, నాగలక్ష్మీ, పొదుపు సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వరి

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

బొప్పూడివారిపాలెం (ముండ్లమూరు) : సేంద్రియ వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జెడ్.శ్రీధర్ అన్నారు. మండలంలోని బొప్పూడివారిపాలెం, తమ్మవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల దిగుబడి తగ్గడమే కాక ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రైతు రథం పథకం ద్వారా మండలానికి 7 ట్రాక్టర్లు మంజూరయ్యాయని, అర్హత గల రైతులను ఎంపిక చేసి, వాటిని పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కిషోర్, ఎంపీఈవో లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో శ్రీధర్



రోడ్డు పక్కన మట్టి తీస్తున్న దృశ్యం

కాలువ పనులు ప్రారంభం

పడమరవీరాయపాలెం (కురిచేడు) : మక్కెవారి వీధిలో సోమవారం కాలువ పనులు ప్రారంభమయ్యాయి. గత కొంత కాలంగా రోడ్డు మీదకు బురద వచ్చి రాకపోకలకు ఇబ్బందిగా ఉండటమే కాక దోమల ఆవాసంగా మారింది. సిమెంట్ రోడ్డుపై ఎవరి ఇంటి ముందు వారు మట్టి దిబ్బలు వేయించి ఎత్తు లేపారు. దీంతో మురుగు ఎక్కడి కక్కడే పేరుకు పోయింది. సమస్యను తెలుసుకున్న సర్పంచ్ ఆలా శేషమ్మ ప్రొక్లెయిన్‌తో మట్టిని తీయించి, కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై జాప్యం వద్దు

ఎర్రగొండపాలెం : నియోజక వర్గంలో ఐదు మండలాల్లో పేద ప్రజలకు మంజూరైన ఎన్టీఆర్ గృహాల నిర్మాణంలో ఏఈలు, అం గన్‌వాడీ భవనాల నిర్మాణంలో పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ పోలప్ప అన్నారు. మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ పోల ప్ప మాట్లాడుతూ మండలంలో 113 ఎన్టీఆర్ గృహాలు, పెద్దారవీడుకు 55, పుల్లలచెరువుకు 49 గృహాలు మంజూరు కాగా, నేటికీ పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏఈలను హెచ్చరించారు. అంగన్‌వాడీ భవనాల విషయంలో జాప్యం సహించబోమన్నారు. నిర్మాణంలో ఉన్నవి, పనులు ప్రారంభం కానివాటి వివరాలు ఏఈ ప్రభాకర్‌ను అడిగి తెల్సుకున్నారు. సమావేశంలో ఈఈ రాందాస్, డీఈ వేణుగోపాలరెడ్డి, హౌసింగ్ డీఈ శ్రీని వాసరావు, తహసీల్దార్లు ఎన్.వెంకటేశ్వర్లు, రవికుమార్, జయపాల్, డీటీ రమాదేవి, సీడీపీవో రమీజాబాను, వి.వెంకటలక్షమ్మ, ఎంపీడీవోలు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్యను అధిగమిస్తాం

మార్కాపురం: మున్సిపాలిటీల్లో మంచినీటి సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిధుల కేటాయిస్తున్నారని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ టి.మోహన్ అన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో మంచినీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 180 డీప్ బోర్లకుగాను 38 బోర్లు మాత్రమే అరకొర గా పని చేస్తున్నాయన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఉన్న డెడ్ స్టోరేజీ నీరు 10 రోజులకు మాత్రమే ఓవర్ హెడ్ ట్యాంకులను నింపగలమన్నారు. ప్రస్తుతం సాగర్ నీటిని ట్యాంకర్ల ద్వారా 600 ట్రిప్పుల ను పట్టణ ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయంగా నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి బో ర్లు వేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా చే సేందుకు అన్ని ఏ ర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉన్న బోర్లలో 50 బోర్లను రీబోరు చేసేందుకు రూ.50 ల క్షల నిధులు కేటాయి ంచామన్నారు. నీటి లభ్యతను బట్టి 15 కి లో మీటర్ల దూరం నుంచైనా బోర్లు వేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఫిజియోథెరపీ పరీక్షలతో ఉపయోగం

ముండ్లమూరు : దివ్యాంగులకు ప్రతిరోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించడం వల్ల వారిలో మార్పు వస్తుందని ఎంఈవో ఇండ్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దివ్యాంగుల భవనంలో ఫిజియోథెరపీ పరీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పి.శ్రీరామచంద్రమూర్తి, ఎస్‌కే మస్తాన్‌వలి, ఫిజియోథెరఫిస్ట్ శ్రీనివాసరావు, ఐఆర్‌టీ ఉపాధ్యాయులు ఫిలిప్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

పడమరగంగవరం (కురిచేడు) : పంటల వివరాలు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ ట్యాబ్‌లలో నమోదు చేయించుకోవాలని ఏవో జ్యోత్న దేవి సూచించారు. మంగళవారం పడమరగంగవరం, రెడ్డెన్నపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఈవో తిరుమల రావు, ఎంపీఈవోలు మల్లిఖార్జున, రుఫియా పాల్గొన్నారు.



పంటల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి

పామూరు : మండలంలోని ఎల్ఎన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యురాలు పాలపర్తి రమాదేవి ప్లేట్లు, గ్లాసులను మంగళవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు,పుస్తకాలను అందిస్తున్నారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, బట్టరుశెట్టి నర్సయ్య, పోస్టుమ్యాన్ ప్రసాద్, ఉపాధ్యాయులు నజీర్‌బాషా, గద్దే సుధాకరరావు, రవికుమార్, మాల్యాద్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పామూరు : మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి, బదిలీ అయిన ఉపాధ్యాయులు షేక్ రషీద్ బేగం జేసీఏ గోపాల్ మాల కొండారెడ్డి, ఎస్.మల్లికార్జున, ఈవీ కృష్ణారెడ్డి, ఎస్‌డి నాసర్‌వలి, ఇందిరా కుమారి, ఎ.రవికిరణ్‌లను హెచ్‌ఎం కె.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ తుపాకుల శ్రీను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు కె.మాధవశర్మ, కె.వెంకటేశ్వర్లు, ఎస్.రాజ్యలక్ష్మి, డి.శ్రీనివాసులు, మోహన్‌రావు, పి.శ్రీనివాసులు, షేక్ రంజాన్‌బీ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెంటర్ వరుణ్ పర్కర్

కనిగిరి : పట్టణంలోని జీసీ అండ్ వైపీఎన్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉద్యోగాలు సాధనపై ఆఫ్‌లైన్ క్లాసులు నిర్వహించారు. ఏపీఎస్‌డీసీ ద్వారా మెంటర్ వరుణ్ పర్కర్ ఉద్యోగాలు ఎలా సాధించాలి, ఏ విధమైన నైపుణ్యం కలిగి ఉండాలి తదితర అంశాల గురించి వివరించారు. చదువుతోపాటు వివిధ రకాల ఉద్యోగాలకు సంబంధించిన సిలబస్‌పై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డీసీ ప్రతినిధి షేక్ ఫిరోజ్, కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ కరణం చెంచుబాబులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం: కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ, కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీల్లో ఉన్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి పి.రాజశేఖర్ అన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని వెలుగొండ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్ల క్రితం సొసైటీ భూముల్లో వేసిన బోర్లు ఒట్టిపోవడంతో వ్యవసాయం భారంగా మారిందన్నారు. ఒట్టిపోయిన బోర్లను రీబోరు చేయించటం, వాటికి మోటార్లు, పైపులు మంజూరుకు ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. వీరప్రసాదు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు సంజీవకుమార్ తిరుమలవాసు, మాజీ అధ్యక్షుడు నెమిలయ్య పాల్గొన్నారు.

వేతన సంఘ సిఫార్సులు అమలుచేయాలి

మార్కాపురం: 7వ యూజీసీ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయాల ని ఎఫిలియేటెడ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (ఏసీటీఏ) ఆధ్వర్యంలో ఎస్‌వీకేపీ కళాశాలలో మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కారదర్శి డాక్టర్ ఈవీ సురేష్ కుమార్ మాట్లాడుతూ పార్ట్‌టైమ్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, 2004 నుంచి విధుల్లో ఉన్నవారికి పింఛన్ విధా నం అమలు చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి 4
కందుకూరు
ప్రకాశం ● బుధవారం 23 ఆగస్టు 2017
కందుకూరు | లింగసముద్రం | గుడ్లూరు | ఉలవపాడు | వలేటివారిపాలెం

వంతెనల పక్కన ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

వలేటివారిపాలెం: మండలంలోని పలు గ్రామాలలో వంతెనల పక్కనున్న ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్‌వి సుబ్బారావు తెలిపారు. వంతెనల పక్కన ఇసుక తరలిస్తే బ్రిడ్జిల మన్నిక దెబ్బతింటుందని చెఆప్పరు. ప్రభుత్వం కేటాయించిన క్వారీలలోనే ఇసుకను తీసుకెళ్ళాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన క్వారీలలో కాకుండా మిగిలిన చోట్ల నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షాకాలంలో జఠిలమైన నీటి సమస్య

- తాగునీటి సంగతి దేవుడికెరుక వాడుక నీటికీ కటకటే
- అనేక గ్రామాలలో చేతిబోర్లే దిక్కు

కందుకూరు: వర్షాకాలం ప్రారంభమయ్యాక కందుకూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య జఠిలమైంది. నిన్న మొన్నటి వరకు ఆగుతూ సాగుతూ నడిచిన మంచినీటి పథకాలు నేడు పూర్తిగా వట్టిపోయి మొరాయించటంతో ప్రజలు నీటికోసం పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రక్షిత పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగునీటి అవసరాలకు పనికిరాని పరిస్థితి కాగా కనీసం గృహంలో వాడుక అవసరాలకు, పశువులకు కూడా ఈ నీరందక చేతిబోర్లు వద్దకు పరుగులు తీస్తున్నారు. లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 40 గ్రామాలకు తాగునీరందించే రాళ్లపాడు - రోళ్లపాడు మంచినీటి పథకం గత నెల రోజులుగా పూర్తిగా నిలిచిపోవటం, ఈ గ్రామాలలో స్థానిక పథకాలు కూడా వినియోగంలో లేకుండా పోవటంతో నీటి కోసం చేతి బోర్లు వద్దకు పరుగులు తీస్తున్నారు. ఒక్కో గ్రామంలో రెండు మూడు బోర్లు మాత్రమే పనిచేస్తుండటం, అవి కూడా భూగర్భ జలాలు పాతాళానికి చేరటంతో రెక్కలు నొప్పులొచ్చేలా కొడితే తప్ప బుంగ నిండకపోతుండటంతో నతమతమవుతున్నారు. మండి - చెర్లోపాలెం రక్షిత నీటి పథకం ద్వారా నీరు సరఫరా అవుతున్న గ్రామాలలోను సగం గ్రామాలలో ఇదే దుస్థితి నెలకొని ఉంది. ఈ పరిస్థితుల్లో గృహావసరాలకు, పశువులకు కనీసం రోజుకి ముప్పై నలభై బుంగల నీళ్లు అవసరం అవుతుండటంతో ఒక మనిషికి పూర్తిగా ఆ పని సరిపోతున్నదని ప్రజలు వాపోతున్నారు. చేతి బోర్లు వద్ద క్యూ అమలవుతుండగా మా వంతు వచ్చేవరకు వేచి ఉండి ఒక్కో బుంగ కొట్టుకుని వచ్చే సరికి రెక్కలు ముక్కలు వుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోను నీటి సమస్య నానాటికీ జఠిలమవు తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడా చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోవటంతో భూగర్భజల మట్టం ఇప్పట్లో పెరిగే పరిస్థితి కనిపించటం లేదని, రాళ్లపాడు రిజర్వాయరులోకి ఐదారు అడుగుల మేర అయినా నీరు చేరితే తప్ప ఈ సమస్య తీరే పరిస్థితి కానరావటం లేదు.


లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెంలో బోర్ల వద్ద నీటికోసం మహిళల పాట్లు

ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించండి


బస్సును పునః ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అంకభూపాలపురం (వలేటివారిపాలెం): ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కందుకూరు శాసనసభ్యులు పోతుల రామారావు తెలిపారు. మండలంలోని అంకభూపాలపురంలో ఎమ్మెల్యే రామారావు మంగళవారం ఆర్టీసి బస్సును పునః ప్రారంభించారు. రామారావు మాట్లాడుతూ ప్రవేటు వాహనాలు ఎక్కి ప్రమాదాల బారీన పడవద్దని చెప్పారు. ప్రతి గ్రామానికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ప్రయాణికులందరూ ఆర్టీసి సేవలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి దోహదపడాలన్నారు. అంకభూపాలపురం, రామచంద్రాపురం, లింగపాలెం, కట్టెమ్మ పాలెం, వీరన్నపాలెం గ్రామాలలోని విద్యార్థులు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు ఆర్టీసి బస్సును పునరుద్ధరించినట్లు ఆయన తెలిపారు. ఆర్టీసి బస్సు రావడం ఆలశ్యమైనప్పటికీ వేచి ఉండి ఆర్టీసి బస్సుల్లోనే ఎక్కి ప్రయాణించాలన్నారు. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. అంతేగాకుండా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చినట్లవుతుందన్నారు. గ్రామీణ ప్రజలందరూ ఆర్టీసి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రామారావు చొరవతో 10ఏళ్ళ నాటి కలనెరవేరిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజరు శ్రీనివాసులు, టిడిపి నాయకులు పరిటాల భాస్కర్‌రావు, బండారు సోమరాజు, కాకు వెంకటస్వామి, నల్లమోతు చంద్రమౌళి, బక్కమంతుల మాల్యాద్రి, ప్రెగడ సుధాకర్ రావు, మద్ది అంజయ్య, చెంచు శ్రీనివాసులు, ప్రెగడ మోహన్‌రావు, ఎన్.హరిబాబు, లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ హుండీ ఆదాయం రూ. 36,26,985

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి ఆరు వారాలకు 18 హుండీల ద్వారా రూ.30,26,985 ఆదాయం లభించినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆ నగదుతో పాటు 222 గ్రాముల బంగారం, 1180 గ్రాముల వెండి లభించినట్లు ఆయన చెప్పారు. అవిగాక అన్నదానం హుండీకి 25,050 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. అంతేగాక 26,500 రూపాయలు పాతనోట్లు లభించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కందుకూరు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, పాలకవర్గ సభ్యుడు దేవకి సుబ్రమణ్యం, తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లీనరీకి కార్యకర్తలు తరలి రావాలి

వలేటివారిపాలెం: కందుకూరు రాజ్ థియేటర్‌లో బుధవారం జరగనున్న ప్లీనరీ సమావేశాలకు కార్యకర్తలందరూ భారీగా తరలిరావాలని వైసీపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఇరపని అంజయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ సమావేశం కందుకూరు నియోజకవర్గం వైసీపి కన్వీనర్ తూమాటి మాధవరావు ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. ఆ సమావేశంలో జగన్ ప్రకటించిన నవరత్నాల అంశాలపై చర్చ జరగనున్నట్లు పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె - ర్యాలీ



ఆందోళనలో పాల్గొన్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

కందుకూరు : దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలోని బ్యాంకు ఉద్యోగులు మంగళవారం ఒకరోజు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా బ్యాంకులన్నీ మూతపడగా ఉద్యోగులు కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌బిఐ వద్ద నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఈ సమ్మె బ్యాంకు సిబ్బంది ప్రయోజనాల కోసం కాదని, బ్యాంకు డిపాజిట్‌దారులు, రైతులు, శ్రామికులు నిరుద్యోగ యువత కోసమని చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకుల మూసివేతకు జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే బ్యాంకుల విలీన ప్రయత్నాలు ప్రారంభించారని, దీనివలన ప్రజలకు, బ్యాంకు ఖాతాదారుల ఆర్థిక ప్రయోజనాలకు గండి పడుతుందని పేర్కొన్నారు. రైతులు, శ్రామికులు, ఇతర్రతా సామాన్య మధ్యతరగతి ప్రజలకు రుణ పరపతి దెబ్బతింటుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, బ్యాంకు ఛార్జీలు ఎక్కువవుతాయని వివరించారు. పేద, మధ్యతరగతి ప్రజలు దాచుకున్న కొట్లాది రూపాయల కష్టార్జితాన్ని రుణాలుగా పొంది వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన కార్పోరేట్ శక్తుల నుండి ఆ రుణాలను వసూలు చేయాలని, రుణ ఎగవేతదారులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఒక్కరోజు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో మహిళా ఉద్యోగులతో పాటు ఎస్‌బిఐ లోకల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఉద్యోగుల సంఘం నాయకులు శేషారావు, నజీర్, అశోక్, శాయికృష్ణ, కిరణ్‌కుమార్, కాశయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి కొనుగోలు పథకం కింద ఎస్సీలు దరఖాస్తులు చేసుకోవాలి

వలేటివారిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలోని ఎస్సీలు భూమికొనుగోలు పథకం కింద దరఖాస్తు చేసుకుంటే ఎస్సీ కార్పోరేషన్ నుండి నిధులు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ ఎస్‌వి సుబ్బారావు తెలిపారు. అయితే భూములు అమ్మేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. సెంటుభూమిలేని నిరుపేదలు మాత్రమే ఈ పథకానకు అర్హులని ఆయన తెలిపారు. వర్షాధారం పైనే ఆధారపడిన మెట్ట భూములకు 3 ఎకరాలకు ఆ పథకం కింద 9లక్షలు, ఒకసారి వరిపంట పండే భూములకు ఎకరాకు 12లక్షలు, రెండు సార్లు వరిపంట పండే భూములకు ఎకరాకు 15లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిడిఓ వ్యవసాయ ధికారి, తహసీల్దార్ కలిసి కమిటీగా ఏర్పడి అర్హులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆ కమిటీ భూగర్భ జలాలను ఆధారంగా భూములను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రైతుల పొలాలను అమ్మేందుకు సిద్ధంగా ఉన్నప్పుడే ఆ పథకం కింద కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అయితే రైతులు అమ్మే భూములన్నీ ఒకే చోట ఉండాలన్నారు. అర్హత కలిగిన ఎస్సీ లబ్దిదారులు భూమి కొనుగోలు పథకం కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నవరత్నాల సభకు హాజరుకావాలి

ఉలవపాడు(కందుకూరు): నేడు కందుకూరులో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రాజ్‌థియేటర్ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నవరత్నాల సభకు జిల్లా వైసీపి అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరవు తారని మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలిచెర్ల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచారకమిటీ సభ్యులు రామాల శింగారెడ్డి, కరేడు గ్రామ పార్టీ అధ్యక్షులు దగ్గుమాటి సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో మంగళవారం కోరారు.

నేడు టీఆర్ఆర్‌లో ఎన్‌సీసీ సెలక్షన్స్

కందుకూరు : టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సిసి)లో చేరేందుకు ఈనెల 23న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌సిసి ఆఫీసర్ ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి ఎంపికల ప్రక్రియ ప్రారంభమవు తుందని, మొదటి సంవత్సర విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చినపవనిలో రెండోరోజూ కొనసాగిన పోలీస్‌పికెట్

లింగసముద్రం: మండలంలోని చినపవని గ్రామంలో పోలీస్ పికెట్ రెండవ రోజు కూడా కొనసాగుతుంది. గ్రామంలో గత ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణలు ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో పోలీసు ఉన్నతాధికారులు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుడ్లూరు ఎస్ఐ ఉన్నం వేమన మాట్లాడుతూ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తగ్గేంతవరకు పోలీస్‌పికెట్ కొనసాగుతుందని చెప్పారు.

కామన్ యాక్షన్‌ప్లాన్ లబ్దిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

కందుకూరు: వివిధ కార్పోరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఈనెల 23,24,28 తేదిలలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటలకు జరుగుతాయని ఎంపిడిఓ జి. హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఎస్‌టి, మైనారిటీ, క్రిస్టియన్‌లకు, 24న కాపు, బిసిలకు, 28న ఎస్‌సి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో పథకముల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుదారులు, సంబంధిత బ్యాంకు మేనేజర్లు, రుణాల లబ్దిదారుల ఎంపిక కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము, విద్యార్హతల ధృవీకరణ పత్రములు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకుని హాజరు కావాలని కోరారు.

● సినిమాలు

కందుకూరు

రాజ్	- ఫిదా
యువరాజ్	- వైశాఖం
ప్రశాంతి	- ఆనందోబ్రహ్మ
కోటేశ్వర	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవ స్క్రీన్-1	- జయ జానకి నాయక
రాఘవ స్క్రీన్-2	- లై

28న కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం ఇంటర్వ్యూలు

వలేటివారిపాలెం: ఎస్సీ,ఎస్టీ, బీసి కార్పోరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్దిదారులకు వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ విజయ్‌శేఖర్ తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్దిదారులందరూ సంబంధిత ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ఎంపిడిఓ విజయ్‌శేఖర్ తెలియజేశారు.

రైతుల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి

● **ఎమ్మెల్యే పోతుల రామారావు**

లింగసముద్రం: రైతుల సంక్షేమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు బాద్యతగా పనిచేయాలని కందుకూరు శాసనసభ్యులు పోతుల రామారావు పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారాలు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రామారావు మంగళవారం మండలంలోని మాలకొండరాయునిపాలెం, గంగపాలెం, విశ్వనాధపురం గ్రామాలలో పర్యటించారు. మాలకొండరాయునిపాలెంలో వివిధ శాఖల పనితీరుపై, ప్రజాసమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ టిడిపి నాయకులు వంటేల రామకృష్ణ, పొంకం బ్రహ్మయ్య, గ్రామస్థులు మేకనబోయిన శ్రీనివాసులు, మల్లేబోయిన కోటేశ్వరరావుతదితరులు ఇటీవల వ్యవసాయ శాఖ ద్వారా రెండు మూడు నెలల క్రితం పంపిణీ చేసిన పిల్లిపెసర విత్తనాలు తమ గ్రామంలో ఒక్కరైతుకు కూడా ఇవ్వలేదని వారు ఎమ్మెల్యే రామారావు దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నించగా ఆ శాఖ అధికారి హాజరు కాలేదని సిబ్బంది చెప్పడంతో ఎమ్మెల్యే రామారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏయే గ్రామాలలో సాగు చేసిన పంటల వివరాలు, ఏమేరకు విత్తనాలు రైతులకు అవసరమో గుర్తించకుండా మొత్తం విత్తనాలు ఒకటి రెండు గ్రామాలకు పంపిణీ చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కందుకూరు ఏడీఏ నాగరాజుతో ఫోన్లో ఈ విషయమై వివరణ కోరారు. వ్యవసాయ శాఖాధికారి గైర్హాజరుపై కూడా అసంతృప్తి చెందారు. ఇలాగే సిబ్బంది కూడా సరైన సమాధానాలు ఇవ్వకపోవడంపై కూడా అసంతృప్తి చెందారు. కనీసం రబీలోనైనా రైతులందరికి శనగ, ఇతర విత్తనాలు సంపూర్తిగా ఇచ్చేలా ఇప్పటినుంచే సమాచారం సేకరించాలన్నారు. అలాగే రైతులకు భూసార పరీక్షా ఫలితాల కార్డులు అందజేసి దాని ఆధారంగా పంటను సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు గ్రామాలలో తిరిగి తగిన సలహాలు, సూచనలు, అవగాహన కల్పించకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రైతులందరూ తమ పొలాలలో పంటసంజీవని కుంట లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు ఎన్‌ఆర్‌జిఎస్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలలో రోడ్లకిరువైపులా చిల్లచెట్లను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. మాలకొండరాయు నిపాలెం గ్రామంలో ఏమేరకు మరుగుదొడ్లు అవసరమో సర్వే చేసి ఈ నెల 25లోపు తనకు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ముక్తేశ్వరంలో తాగు నీటి ఎద్దడిని నివారించేందుకు ట్యాంకర్ల ద్వారా నీరు తోలించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవిచంద్రకుమార్‌ను ఆదేశించారు. అనంతరం గంగపాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఎంపిటీసి సభ్యులు అత్తంటి రంగయ్య, టిడిపి నాయకులు అత్తంటి వెంకట్రావు తదితరులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఆదెన్న, ఇన్‌ఛార్జ్ కె.కోటేశ్వరరావు, టిడిపి నాయకులు హరిబాబు, మండల టిడిపి అధ్యక్షులు సిహెచ్ వీరబాబు, మాజీ అధ్యక్షులు సిహెచ్ సదానందం, బట్టరుశెట్టి రాఘవ, మండల టిడిపి ఉపాధ్యక్షుడు అడపా నరసయ్య, కొణిదెన శ్రీనివాసులు, తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ వై.మహ లక్ష్మి, ఇతర మండల స్థాయి అధికారులు, ఇంకా పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



గంగపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు



కేకు కట్ చేస్తున్న జడ్పీటీసీ శ్రీకాంత్, అభిమానసంఘం అధ్యక్షుడు రమేష్ తదితరులు

దివ్యాంగుల పాఠశాలలో చిరంజీవి జన్మదిన వేడుకలు

కందుకూరు : కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెగాస్టార్ అభిమానసంఘం అధ్యక్షుడు దండే రమేష్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగ చిన్నారుల మధ్య కేకు కట్ చేసి చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కందుకూరు జడ్పిటిసి కంచర్ల శ్రీకాంత్ చౌదరి కేకు కట్ చేయగా చిన్నారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు డి.సుమన్, హర్ష, మోహన్, కె. హరి, నాగార్జున, సాయి, కె. మనోజ్, రమేష్, సుప్రీమ్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్టెప్ యువజనోత్సవ పోటీలలో 'ప్రకాశం' హ్యాట్రిక్

కందుకూరు : జిల్లా యువజన సర్వీసుల విభాగం (స్టెప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొనేందుకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నాలుగు విభాగాలలో అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వేదికగా జరిగిన డివిజన్‌స్థాయి పోటీల లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించారు. వక్తృత్వ పోటీలో ప్రథమ సంవత్సర సిఎస్‌ఇ విభాగ విద్యార్థి కె.సత్యగోపాల్, జానపద గీతాలాపనలో శ్రీలక్ష్మి బృందం, జానపద నృత్య విభాగ పోటీలలో రుక్సానా బృందం వన్ యాక్ట్ ప్లే విభాగంలో మేరా మీడియా మహాన్ అనే ప్రధాన ఇతివృత్తంతో ప్రదర్శించిన హవీలారాణి బృందంలు డివిజనల్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయి యువజనోత్సవాలకు అర్హత పొందిన వీరు అక్టోబరు నెలలో ఒంగోలులో జరగనున్న పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ రామయ్య అభినందిస్తూ జిల్లాస్థాయిలో సైతం మెరుగైన ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి కళాశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

భూసార పరీక్షలు, సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● **ఏడీఏ నాగరాజు**

కందుకూరు: రైతులు భూసార పరీక్షల ప్రాముఖ్యతను గుర్తించి పరీక్షలకు అనుగుణంగానే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చునని కందుకూరు ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని మోపాడు గ్రామంలో మంగళవారం ఎఓ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడిఏ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేలల సంరక్షణకు పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో పాటు సేంద్రీయ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. చౌడు భూములలో జి ప్సమ్, జింక్‌లను వినియోగించటం ద్వారా సారవంతమైన భూములుగా మార్చుకోవాలని సూచించారు. ఎఓ అబ్దుల్ రహీం మాట్లాడుతూ వరిసాగులో డ్రమ్ సీడర్ ప్రాముఖ్యతను, వర్షాభావ పరిస్థితులలో ఆరుతడి పంటల ప్రాముఖ్యతను వివరించారు. కౌలు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సాగు ధృవీకరణ పత్రాన్ని, రెవిన్యూ శాఖ ద్వారా రుణ అర్హతపత్రాన్ని జారీ చేస్తారని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మోపాడులో బోర్ల ఆధారంగా సాగుచేసి ఉన్న ఖరీఫ్ వరిపైరుని పరిశీలించి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు జి.వెంకటరావు, జి.మధు, ఎంపిఇఓలు రమణయ్య, ఇస్మాయిల్, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.



వరిపైరుని పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు, ఎఓ అబ్దుల్ రహీం

'ప్రకాశం' అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఎస్వీయూ డాక్టరేట్

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలం దిస్తున్న చాపాటి ప్రకాశరావు పిహెచ్‌డి పట్టా పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టెస్టింగ్ టూల్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులలో నాణ్యతా ప్రమాణాలను పెంచడంపై ప్రకాశరావు సమర్పించిన ఎన్హాన్సింగ్ ది సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ క్వాలిటీ ఆటోమేటిక్ టెస్ట్ సూట్ జనరేషన్ అండ్ ప్రయారిటైజేషన్ టెస్టింగ్ టూల్స్ అనే పరిశోధనా గ్రంధాన్ని విశ్లేషించిన శ్రీవెంకటేశ్వరా విశ్వవిద్యాలయం పిహెచ్‌డికి అర్హత సాధించి నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు ప్రొఫెసర్ గోవిందరాజులు మార్గదర్శకత్వంలో పరిశోధనా గ్రంధాన్ని ప్రకాశరావు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావుని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందిస్తూ కళాశాల సిబ్బంది పరిశోధనా కార్యక్రమాలకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ట్రెజరర్ కంచర్ల శ్రీకాంత్, ప్రిన్సిపాల్ డా. ఎం.లక్ష్మణరావులతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సైతం ప్రకాశరావుని ప్రశంసించారు. పిహెచ్‌డి పట్టాపొందిన ప్రకాశరావు మాట్లాడుతూ తన పరిశోధనా కార్యక్రమం పూర్తిస్థాయిలో సహాయ సహకారా లందించిన కళాశాల యాజమాన్యానికి, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



పీహెచ్‌డీ సాధించిన ప్రకాశం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రకాశరావు

నేడు రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

జరుగుమల్లి : మండల పరిషత్ కార్యాలయంలో నేటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. జరుగుమల్లిలోని మండలల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 258 మంది అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలకు సబ్సిడీ రుణాలకు ఎంపిక చేస్తామన్నారు. సిండికేట్‌బ్యాంక్, యూనియన్‌బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్ ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. దరఖాస్తు దారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి సబ్సిడీ రుణాలకు ఎంపికలు

టంగుటూరు: సబ్సిడీ రుణాలకు లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం ఈనెల 23,24,28 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో సీహెచ్. హనుమంతురావు మంగళవారం తెలిపారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్, మైనార్టీల కార్పొ రేషన్‌ల నుంచి ఆయా వర్గాల యు వతకు సబ్సిడీ రుణాలు అంద జేస్తారు. ఇందుకు టార్గెట్లు ఆయా కార్పొరేషన్ల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. ఈసబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులకు గత నెలలోనే గడువు ముగిసింది. బ్యాంకు అధికారుల స మక్షంలో దరఖాస్తుదారుల నుంచి అర్హులైన వారిని టార్గెట్‌కు లోబడి ఎంపిక చేస్తారు.తొలి రోజైన 23వ తేదీ ఎస్టీ, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల నుంచి ఎంపిక జరుగుతుంది.

అలాగే 24న బీసీ, కాపు కార్పొరేషన్ వారికి, 28న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖా స్తుదారుల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీవో వివరించారు. దరఖాస్తుదారులంతా ఈ ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

జరుగుమల్లి : జరుగుమల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కారించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. అరుణ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోటు పద్మావతిని కలసి విన్నవించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ మాట్లాడుతూ వాటర్ ట్యాంక్‌తో పాటు, జెండా పోల్, స్టేజితో పాటు పాఠశాల ఆటస్థలం చుట్టూ ప్రహరిగోడ నిర్మించాలని విన్నవించారు. సమస్యలను జిల్లా పరిషత్ దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా పరిశీలిస్తానని ఎంపీపీ వివరించారు.

పేదల సంక్షేమానికి ఆదర్శవంతమైన పథకాలు



చంద్రన్న బీమా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే స్వామి

- ప్రతి పేదకూ లబ్ధి
- ఎమ్మెల్యే స్వామి
- చంద్రన్న బీమా పత్రాల అందజేత

సింగరాయకొండ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోని మిగతా రాష్ట్రాలు సైతం మెచ్చుకుంటున్నాయని ఎమ్మెల్యే డా.డోలాశ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎంపీడీవో కార్యాయయంలో మంగళవారం నిర్వహించిన నియోజవర్గ స్థాయిలో సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రన్న బీమా సభ్యులకు ఇన్స్యూరెన్స్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇది దేశంలోనే ఆదర్శవంతమైన పథకంగా మారిందన్నారు. ప్రతి పేదకూ చంద్రన్న బీమా వరమని అన్నారు. దీంతో పాటు ఎన్టీఆర్ భరోసా, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎన్టీఆర్ గృహ కల్ప తదితర పథకాలు పేదలకు ధైర్యాన్నిస్తున్నాయని ఆయన వివరించారు. పథకాలను రాజకీయాలకు అతీతంగా అందించేలా కార్యకర్తలు, నాయకులు ఐక్యతతో కృషి చేయాలని స్వామి పిలుపునిచ్చారు. అనంతరం చంద్రన్న బీమాదారులు 15 మందికి రూ.6.25 లక్షల పత్రాలను అందజేశారు. కార్యకమ్రంలో ఎంపీపీ యాటగిరి శోభారాణి, ఎంపీడీవో షేక్ జమీవుల్లా, వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల శింగయ్య, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుదర్శి ప్రసాదరావు, షేక్ సంధాని బాషా, కూనపురెడ్డి సుబ్బారావు, రాయి పేర్రాజు, గాంధీ చౌదరి, మోటుపల్లి వెంకటేశ్వర్లు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పీఎన్‌సీఏ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే స్వామి సూచించారు. ఈ మేళాలో బడా బహుళజాతి కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలలో రాణించిన వారికి మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ముందుగా పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

మద్యం దుకాణాలు తొలగించాలి

టంగుటూరు: టంగుటూరులోని జన సంవర్ధక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకా ణాలను తొలగించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బక్కా తిరుమలరావు మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం జిల్లా పోలీస్ అధికారితోపాటు సీఐ, ఎక్సైజ్ సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల కు వినతిపత్రాలు పంపించారు. ముస్లిం సోదరులు అతిపవిత్రంగా భావించే దర్గా పక్కన మద్యం దుకాణం ఉండడం దారుణం అన్నారు. ఇక్కడే పొగాకు గ్రేండింగ్ కేంద్రం ఉందని, వందలాది మంది మహిళా కూలీలు పనులు చేస్తుంటారని ఆయన గుర్తుచేశారు. ఒంగోలుకు వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన ఉన్న ఈదుకాణం మహిళలకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు.మద్యం బాబులు రోడ్డుపై వాహ నాలుంచి, రోడ్డుమీద, ఈప్రాతంలో ఎక్కడబడితే అక్కడ తాగి దొర్లుతున్నారని, రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయని హెచ్చరించారు.అలాగే మరొక మద్యం దుకాణం ఆర్ టీసీ బస్టాండ్,రైల్వే స్టేషన్ సమీపాన పెట్టారని,దీని వలన మద్యం బాబులతో జనం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు.తక్షణమే ఈరెండు మద్యం దుకాణాలను అక్కడి నుంచి ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతాలకు మార్చాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



కాల్వలను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగమణి

సింగరాయకొండ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సింగరాయకొండ సర్పంచ్ డా.కుంభా నాగమణి పేర్కొన్నారు. స్థానిక సుందర్‌నగర్ ప్రాంతంలో మంగళవారం వార్డు బాట కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ ఇంట, బయట పరిశుభ్రత పాటించాలన్నారు. పరిశరాల పరిశరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాల రావాన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేలా కాల్వలను శుభ్రంగా ఉంచాలన్నారు. కాల్వల్లో చెత్తలు వేయకుండా జాగ్రత్త పడాలన్నారు. నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్‌తో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరుబయట నీటి నిల్వలు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆమె అన్నారు.

అనంతరం పారిశుధ్య సిబ్బంది మురుగు కాల్వల్లో దోమల నివారణకు ఎబెట్ ద్రావణాన్ని చల్లారు. వీధులు శుభ్రపరిచి బ్లీచింగ్ వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వణుగూరి బ్రహ్మానందరెడ్డి, శానటరీ ఇన్స్పెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

టంగుటూరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సీఐ మురళీకృష్ణ సూచించారు.

వినాయక చవితి సందర్భంగా సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని టంగుటూరు, సింగ రాయకొండ, కొండపి, జరుగుమల్లి ఎస్సైలు వెంకటేశ్వర్లు, హజరత్తయ్య, చం ద్రశేఖర్, సోమశేఖర్‌తో మంగళవారం ఒంగోలు రూరల్ సీఐ టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో సమావేశ మయ్యారు. ఈసంద ర్భంగా వినాయక ఉత్సవాలపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆయన ఎస్ఐలతో చర్చించారు. అనుమతి లేకుండా వినాయక విగ్రహాలకు అంగీకరించేది లేదన్నారు. విగ్రహం వద్ద మైక్ పర్మిషన్ ప్రత్యేకంగా తీసుకోవాలని, నిమజ్జనం సందర్భంగా జరిపే ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి తీసుకోవల్సిందేనన్నారు. ఊరేగింపుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, మద్యం సేవించి ర్యాలీలో పాల్గొన వద్దని వారు హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకునే భక్తులంతా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని సిఐ సూచించారు. ఈవిధివిధానాలకు తప్పక పాటించాలని ఎస్సైలకు సీఐ మురళీకృష్ణ సూచించారు.

పచ్చిరొట్ట పంటలతో భూమికి మేలు

పొన్నలూరు: పచ్చిరొట్ట పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందించడం కీలకమని వ్యవసాయశాఖాధికారి ఎస్.కోటయ్య అన్నారు. ముప్పాళ్ళ, సింగరబొట్లపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటలు సాగుచేసి పూత దశకు వచ్చిన తరువాత భూమిలో కలియదున్నడం వలన పోషక విలువలు పెరగడంతో పాటు భూమి సారవంతంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులకు 100శాతం రాయతీతో జింకు, జిప్సం, బోరాన్ ఎరువులు అందించడం జరుగుతుందన్నారు. అవసరైన రైతులు వచ్చి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగ పర్చుకోవాలని కోటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జాలయ్య, ఉద్యానవనశాఖ ఎంపీఈవో పాండు, రైతులు పాల్గొన్నారు.

ఎమార్సీకి బీరువా బహూకరణ

పొన్నలూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనానికి పొన్నలూరు గ్రామ నివాసి ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వరపర్ల హరిబాబు 5,500ల రూపాయలు ఖరీదు చేసే బీరువాను బహుకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవి చంద్రబాబు, పలువురు ఉపాధ్యాయులు దాత హరిబాబును అభినందించారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం : ఎంపీపీ



క్రీడా కిట్ పంపిణీ చేస్తున్న పద్మావతి

జరుగుమల్లి : ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తుందని ఎంపీపీ పోటు పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడా సామగ్రిని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి, పిల్లల్లో ఆసక్తిని పెంపొందించడానికి ప్రభుత్వం వీటిని సమకూర్చి ప్రోత్సహిస్తుందన్నారు. ఎంఈవో నాగేంద్రవదన్ మాట్లాడుతూ మం డలానికి 42 స్పోర్ట్స్ కిట్స్ మంజూరయ్యాయ ని వాటిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. బదిలీల్లో మండలం నుంచి 30 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా, 26 మంది ఉపాధ్యాయులు జరుగుమల్లికి వచ్చారని వివరించారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు సోమయ్య, కొనూరి యానాదిరావు, గ్రామ పెద్దలు దగ్గుమాటి సుబ్బారెడ్డి, ఎన్ వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు

బకాయిలు త్వరగా చెల్లించాలి

టంగుటూరు: ఉపాధి కూలి 8నెలల బకాయి ఉంది.దానిని వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని కోరారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గడచిన ఏడాది జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రక్రియ కొనసాగుతుంది. ఈసందర్భంగా టంగుటూరు పంచాయితీ పరిధిలో జరిగిన పనుల నుండి తనిఖీ బృందం గుర్తుంచిన అంశాలపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ జయంత్ మాట్లాడుతూ కూలియే జీవనాధారంగా జీవించే ఉపాధి కూలీలకు ఇంత ఎక్కువ రోజులు కూలి చెల్లించకపోవడంతో వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గడచిన సంవత్సరానికి పంచాయితీలో రూ1.05 కోట్లు విలువైన ఉపాధి పనులు జరిగాయని, పనులన్నీ పారదర్శకంగా కొనసాగించామని చెప్పారు. 879 మంది కూలీలు సగటున 70 రోజులు పని చేశారని ఆయన వివరించారు. పనులన్నీ ప్రజలకు ఉపయోగపడేలా ఎంపిక చేసుకోవడం జరిగిందని, ఈఏడాది గతంలో కంటే ఎక్కువ పనులు మంజూరు చేయాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, పంచాయతీ సభ్యుడు బెజవాడ వెంటేశ్వర్లు, టీఏ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ యరమాల నిరంజన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు

కొండపి: తహసీల్దార్ శ్రీశిల్ప, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మంగళవారం ఎమ్మెల్యే స్వామి దంపతులను కలిసి బొకే ఇచ్చి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. తూర్పు నాయుడు పాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తూర్పునాయుడిపాలెం (టంగుటూరు) : ఎమ్మెల్యే స్వామికి టంగుటూరు ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో వీరు ఎమ్మెల్యేను కలసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ఎంపీపీ వెంట టీడీపీ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మత్స్యకారులకు టీడీపీ అండ

ఎమ్మెల్యే స్వామి



శ్రీ

సింగరాయకొండ : మత్స్యకారులకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. గత ఏడాది సెప్టంబర్ 2వ తేదీన మండలంలోని పాకలపల్లె పాలేనికి చెందిన ఏ.సుబ్బారావు సముద్రం లోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందారు. గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్సు స్కీం కింద సుబ్బారావు భార్య సంపూర్ణకు తూర్పు నాయుడిపాలెంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే స్వామి అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖాధికారి సంగాని శ్రీనివాసులు, సహకార సంఘ అధ్యక్షుడు జి.వెంకటస్వామి, పీకల మాజీ సర్పంచ్ సైకం చంద్రశేకర్, ఊళ్లపాలెం మాజీ సర్పంచ్ గొల్లపోతు రాఘవులు, సుదర్శి ప్రసాదరావు, కూనపురెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిధుల చెల్లింపుపై గందరగోళం



సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్

టంగుటూరు : డీఆర్‌డీఏ-వెలుగు వారి ఆడ్వాన్స్‌డ్ పేమెంట్స్‌తో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లుకు సంబంధించిన నిధుల చెల్లింపులో అవరోధాలు ఎదురయ్యాయి. మంగళవారం టంగుటూరులో జరిగిన కొండపి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి పనుల సమీక్షలో ఈ సమస్యపై కొద్ది సేపు గందర గోళం నెలకొంది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై చర్చ వచ్చింది. టంగుటూరు ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ-వెలుగు వారి ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లుకు రెండవ విడత నిధుల చెల్లింపు జరగలేదని, దీంతో వాటి నిర్మాణాలు అర్ధాంతంగా నిలచి పోయాయని తన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణాల్లో ప్రజాప్రతినిధులను ఎందుకు భాగస్వాములను చేయడం లేదని వెలుగు ఏపీఎం రాజారావును కోరారు. ఆయన బదులిస్తూ ఒక దశలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని మరింత వేగం పెంచాలని భావించిన ప్రభుత్వం ఈ బాధ్యతను డీఆర్‌డీఏ-వెలుగు వారికి అప్పగిం చిందని, జిల్లాల్లో ఇందుకోసం కొన్ని మండలాలు ఎంపికచేశారని, వీటిలో టంగుటూరు ఒకటన్నారు. ఈవిధానం ప్రకారం మండలంలో తాము కొద్ది మంది కాంట్రాక్టర్లను ఎంపిక చేసి వారికి మరుగుదొడ్ల నిర్మాణ బాధ్యతను అప్పగించినట్లు వివరించారు. ఇందుకు ముందుగా కాంట్రాక్టర్‌కు ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి అడ్వాన్స్ పేమెంట్ కింద రూ.6వేల లెక్కన స్త్రీనిధి నిధుల నుంచి చెల్లించామన్నారు. ఇంతలోనే తమకు సెర్ప్ నుంచి కొత్త ఆదేశాలు వచ్చాయని, ప్రస్తుతం స్వచ్ఛభారత్ మిషన్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు పుష్కలంగా వస్తున్నందున ఇక నిధులు చెల్లించవద్దని, ఇప్పటికే చెల్లించిన నిధులు తిరిగి వసూలు చేసుకోవాలని సెర్ప్ సూచించిందన్నారు. దీంతో తాము రెండవ విడత నిధులు చెల్లింపు నిలిపి వేశామని ఆయన వివరించారు. ఇదే పద్ధతిని నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిర్మించిన వందలాది మరుగుదొడ్లకు రెండవ విడత నిధుల చెల్లింపు వెలుగు వారు నిలిపివేసినట్లు సమావేశంలో మిగిలిన ఏపీఎంలు తెలియ జేశారు. అయితే కాంట్రాక్టర్లంతా 70శాతం పనులు పూర్తి చేసినందున నిధుల కోసం ఇబ్బంది పడుతున్నారని, ఇప్పుడు మిగిలిన నిధులు ఎవ్వరు చెల్లిస్తారని ఎంపీపీ ప్రశ్నించారు.

నిర్మాణ పనులు పూర్తి చేస్తే ఎస్‌బీఎం నుంచి నేరుగా నిధులు వస్తాయని అధికారులు చెప్పగా అవి కాంట్రాక్టర్‌కు ఇస్తారా! లబ్దిదారుడికి ఇస్తారా అన్న ప్రశ్న తలెత్తింది. సీసీ రోడ్లు త్వరితగతి పూర్తి చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో రక్షిత మంచినీటి పథకాలపై చర్చించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మంచినీటిపై ప్రత్యేక శ్రద్ద తీసు కోవాలని ఉదయభాస్కర్ చెప్పారు. ఎవెన్యూ ప్లాంటేషన్ వేగవంతం చేయాలని వెలుగు ఏపీఎంలకు సూచించారు. కార్యక్రమంలో టంగుటూరు, కొండపి, పొన్నలూరు, మర్రిపూడి, జరుగుమల్లి ఎంపీడీవోలు సిహెచ్ హనుమంతురావు, ఏ.ప్రభాకరరావు, పమిడి పద్మజ, సుబ్బారావు, విజయలక్ష్మి. టంగుటూరు, కొండపి తహశీల్దార్లు కామేశ్వరావు, శ్రీశిల్ప, పంచాయతీరాజ్ ఏఈలు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, అధికారులు, ఏపీఎం, ఏపీవోలు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

దాతల సహకారం అభినందనీయం

పొన్నలూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, గ్రామస్థుల సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర బాబు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలకు మంగళవారం నాడు కందుకూరు రోటరీక్లబ్ వారు 4,5 తరగతుల వారికి నోటు పుస్తకాలు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటా వెంకటేశ్వర్లు సహకారంతో కందుకూరు రోటరీక్లబ్ వారు 9వేలు ఖరీదు చేసే రాతపుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్, కందుకూరు జడ్పీటీసి కంచర్ల శ్రీకాంత్, కార్యదర్శి తానికొండ సురేష్, ట్రెజరర్ వెంకటకేశవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ పిఆర్‌సీ చెల్లించాలి

సింగరాయకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవ పిఆర్‌సీ చెల్లించాలని వైఎస్‌ఆర్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి అన్నారు. అమృత బీఈడీ కాలేజీలో సోమవారం రాత్రి బదిలీలపై వెళ్ళిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాలిరెడ్డి మాట్లాడుతూ నేటికీ పదవ పీఆర్‌సీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. 1984వ సంవత్సరంలో నియమితులైన స్పెషల్ టీచర్స్ సర్వీసెస్‌కు నేషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మహేశ్వరరావు, గుంజి పద్మావతి, బీసాబత్తిన శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు డిసిహెచ్ మాలకొండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వి.రామకృష్ణరావు, కాలేజీ కరస్పాండెంట్ కేశవరపు వెంకటశేషమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఇన్‌చార్జి తహసీల్దార్

జరుగుమల్లి : మండల కేంద్రమైన జరుగుమల్లిలో ఎస్సి, బీసీ హాస్టల్‌ను మంగళవారం రాత్రి ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిషోర్ బాబు సందర్శించారు.

విధి నిర్వహణలో భాగంగా హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మెనూను పరిశీలించారు. ఆయనతో పాటు వీఆర్వో సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- **ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన**
- **పాలేటిలో రహదారులపై కందకాలు**

జరుగుమల్లి : ఈ నెల 16న జిల్లా టాబ్లాయిడ్ నందు ప్రచురితమైన పాలేరు ఇసుకాసురులు అనే శీర్షికకు స్పందించిన రెవెన్యూ యంత్రాంగం మంగళవారం పాలేరులో ఇసుక అక్రమ రవాణాకు ఏర్పాటు చేసుకున్న రహదారులపై కందకాలు ఏర్పాటు చేశారు. పాలేరులో 482 సర్వే నెంబరులో 5 ఎకరాలులో ఇసుక రీచ్ ఏర్పాటు చేసినట్లు ఆ ప్రాంతం మినహా మరే ప్రాంతంలో ఇసుక రవాణా చేపట్టినా వారిపై చర్యలు చేపట్టనున్నట్లు రెవెన్యూ అధికారులు వివరించారు. పాలేరులో ఇద్దరు రక్షకబటులతోపాటు, ఇద్దరు వీఆర్‌ఏలను నియమించినట్లు వీఆర్‌వో ఎన్.సుబ్బారావు వివరించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలనే ప్రభుత్వ నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా జరగకుంటే సహజ సంపదను కాపాడుకోవచ్చునని ప్రజలు అంటున్నారు.



కందకాలు చేపడుతున్న అధికారులు

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

జరుగుమల్లి : వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ సోమశేఖర్ హెచ్చరించారు. స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఉత్సవాల్లో జరిగే వివాదాలకు ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని సూచించారు. నిర్దేశించిన రోజునే విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. గ్రామాల్లో సౌండ్ పొల్యూషన్ లేకుండా విగ్రహాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి
4
కనిగిరి
ప్రకాశం • బుధవారం 23 ఆగస్టు 2017
కనిగిరి | హనుమంతునిపాడు | వెలిగండ్ల | సీఎస్‌పురం | పామూరు | పీసీపల్లి

ఏడో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె

పామూరు : కమలేష్ చంద్ర సిపార్సులు వెంటనే అమలు చేసి, న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరుతూ అల్‌ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారంతో ఏడో రోజుకు చేరింది. జీడీఎస్‌లు విధులను బహిష్కరించి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరికి ఏఐటీయూసీ, సీఐటీయూ లాంటి జాతీయ కార్మిక సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. కమిటీ రిపోర్టులోని సానుకూల అంశాలను పోస్టల్ డిపార్ట్‌మెంట్ భారీ కుదింపులకు పన్నాగాలు పన్నుతుందని జీడీఎస్‌లు సంఘటితంగా ఉండి కుట్రలను ఎదుర్కోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు పాతర

- రూ. 36 కోట్లు గుంతలమయం
- నాయకులే గుత్తేదారులు
- పర్సంటేజీలతో రాజీపడుతున్న అధికారులు

కనిగిరి : ఆర్‌అండ్‌బీ రోడ్లు అవినీతికి అలవాలంగా మారాయి. పదికాలాల పాటు ఉండాల్సిన రహదారులు నెలల కాలానికే రూపుకోల్పోతున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు పాతరేస్తుండటంతో తారులేచి, పనుల్లో డొల్లతనం బయట పడుతుంది. నాయకులే కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు తమ పర్సంటేజ్‌లతో సరిపెట్టుకుంటున్నారు.

రోడ్డు, భవనాల శాఖ నిర్మాణాలంటేనే ఆదాయ వనరుగా మారింది. పనుల కోసం నేతలు, గుత్తేదారులు పోటీ పడుతున్నారు. తారురోడ్లు నిర్మించినా కొద్ది రోజులకే గుంటలు పడటం, మార్చివేయటం పరిపాటిగా మారింది. నాణ్యత లేకుండా నిర్మిస్తుండటంతో శాశ్వతంగా ఉండాల్సిన రోడ్లు వెంటనే శిథిలమవుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు అక్షరాల రూ.36 కోట్లతో నూతనంగా నిర్మించిన కనిగిరి-సీఎస్‌పురం రోడ్డు నెలలు తిరక్క ముందే గుంతలమయమైంది.

నియోజకవరంలో మండల కేంద్రాలను కలుపుతూ డబుల్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కనిగిరి- సీఎస్‌పురం 36 కి.మీ.ల డబుల్‌రోడ్డుకు రూ.36.6 కోట్లు, సీఎస్‌పురం నుంచి పామూరు 17 కి.మీ.ల డబుల్ రోడ్డుకు రూ. 19 కోట్లు, ఎండీఆర్ ప్రాణాళిక కింద నిధులు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న పెద్ద సంస్థ కాంట్రాక్టర్లు స్థానిక నేతలకు బిట్లు, బిట్లుగా ఇవ్వడం, వీరిలో కొందరు స్థానిక కాంట్రాక్టర్లకు బిట్లు అమ్ముకోవడం మరికొందరు తామే సొంతంగా తారురోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది.

తూతూ మంత్రంగా పనులు..

డబుల్ రోడ్డు నిర్మాణంలో ఉన్న రోడ్డును ఇరువైపులా ఒకటిన్నర మీటర్ త్రవ్వి ఆ స్థానంలో జీఎస్‌బీ, వెట్‌మిక్స్‌తో నిర్మించాలి. ఉన్న తారురోడ్డులో సమానంగా ఏడుమీటర్ల తారు లేయర్ వేయాలి. తారు రోడ్డు నిర్మాణంలో ముందుగా డస్టు 30 శాతం, 12 ఎంఎం చిప్సు 30 శాతం, 60 ఎంఎం చిప్సు కలిపి వాటర్ మిక్సింగ్‌తో 8 అంగుళాల మందంగా వేయాలి. దీనిపై రోలింగ్‌తో బాగా చదును చేయాలి. వాటరింగ్ చేయాలి. అయితే డస్ట్, జీఎస్‌బీ కలిపి వేశారు. వెట్ మిక్సు 10 అంగుళాల మేర డస్ట్ 30 శాతం, 20 ఎంఎం 20 శాతం, 40 ఎంఎం 20 శాతం, 12 ఎంఎం 20 శాతం, 6ఎంఎం 20 శాతం వాటర్ క్యూరింగ్‌తో వేయాలి. వాటరింగ్ చేస్తూ రోలర్ బాగా తిప్పాలి. ఆ తరువాత బీటీ మూడు అంగుళాల తారు వేయాలి. అయితే డస్టు, 12, 40 ఎంఎం కంకరు కలిపి తూతూ మంత్రంగా తారు రోడ్లు నిర్మించారు.


కంకరు లేచి పగుళ్లు ఇచ్చిన తారురోడ్డు


నాశిరకంగా కనిగిరి-సీఎస్‌పురం రోడ్డు

మూణ్ణాళ్ల ముచ్చటగా డబుల్ రోడ్లు..

కనిగిరి-సీఎస్‌పురం రహదారి వేసిన మూడునెలలు తిరగక ముందే గుంతలమయం అయింది. సీఎస్‌పురం - కనిగిరి డబుల్‌రోడ్డు నిర్మాణం అత్యంత నాశిరకంగా చేసి చేతులు దులుపుకున్నారు. పాతరోడ్డును పూర్తిగా తొలగించి కొత్తరోడ్డును వేయాలని నిబంధనలు ఉండగా కాంట్రాక్టర్లు పాతరోడ్డును కొన్నిచోట్ల తొలగించి మరికొన్ని చోట్ల ఉంచి మెటల్ వేశారు. చిప్స్ వేసిన తర్వాత రోడ్డు రోలర్‌తో బాగా తొక్కించిన అనంతరం తారు నిర్మాణం చేయాల్సి ఉండగా నామమాత్రంగా తొక్కించి పని అయిపోయిందనిపించారు. రోడ్డు హెచ్చుతగ్గులు లేకుండా సమాంతరంగా కంకర పేర్చకుండా వదిలేశారు. దీంతో గుంతల మయం అయింది. రోలర్‌తో సరిగా తొక్కించకపోవడంతో రోడ్డు కుంగిపోయింది. మొగళ్ళూరు నుంచి కోటాలపల్లిలోపు రోడ్డు దిగిపోవడంతో సంబంధిత కాంటాక్టర్ అక్కడక్కడ కంకరను తోలి తాత్కాలికంగా మరమ్మతులు చేసే ప్రయత్నం చేశారు. కొన్నిచోట్ల పాత రోడ్డును తొలగించకుండానే డబుల్‌రోడ్డు నిర్మాణం సాగింది. అలాగే సీఎస్‌పురం- పామూరు 17 కి.మీ.ల రోడ్డు నిర్మాణం అవకతవకలగానే జరిగింది.

సీఎస్‌పురం నుంచి పామూరు, సీఎస్‌పురం నుంచి కనిగిరి డబుల్ రోడ్లకు ఇరువైపులా వేసిన సైడ్ బరమ్స్ నాశిరకంగా నిర్మాణాలు సాగాయి. రోడ్డు పక్కన ఉన్న మట్టిని తీసి పోసి రోడ్డు రోలర్‌తో బాగా తొక్కించాల్సి ఉండగా నిబంధనలు పాటించలేదు. తగినంత నీరు పోయకుండానే రోలర్‌తో తొక్కించడంతో చిన్నపాటి వర్షం వచ్చినా ద్విచక్రవాహనాలు దిగబడుతున్నాయని వాహనదారులు అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిపెట్టి రోడ్డు నిర్మాణాల అవకతవకలపై చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిబంధనలు పాటించాలి

కనిగిరి : నగర పంచాయతీలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉప్పు శ్రీనివాసులు పేర్కొన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటుపై మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మండపాల నిర్వహణకు మధ్య తగినంత దూరం ఉండాలని, కమిటీ సభ్యులు వివాదాలకు పోరాదని సూచించారు. నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనంలో చేపట్టాల్సిన చర్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

రేపు శాంతి కమిటీ సమావేశం

పామూరు : వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకు డీఎస్పీ కె.ప్రకాశరావు ఆ.ధ్వర్యంలో ఈ నెల 24న శాంతి క మిటీ సమావేశం సీఐ ఎం.రాజేష్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని ఎ స్సై ఉసా సాంబశివయ్య తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు హాజరై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

రేపు రుణాలకు ఇంటర్వ్యూలు

పామూరు : కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేస్తుకున్నవారి ఈ నెల 24 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నాగభూషణరావు తెలిపారు. 24న బీసీ, కాపు, 28న ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఆర్‌ఎంపీలకు చట్టబద్ధత కల్పించడంపై హర్షం

కనిగిరి టౌన్ : ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సేవలను గుర్తించి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూ సీఎం చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ పట్టణ, గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక కార్యదర్శి సూరె రాజు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గ్రామీణ వైద్యులకు శిక్షణతోపాటు, సర్టిఫికెట్ కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఆరు నెలలు జిల్లా మెడికల్ కళాశాలలో శిక్షణ తోపాటు, మూడునెలలు ప్రభుత్వ ఆసుపత్రిలో, మూడునెలలు 104 చంద్రన్న సంచార వైద్యచికిత్స వాహనాల ద్వారా గ్రామాల్లో వైద్యసేవలు అందించాలని నిబంధన చేసిందన్నారు. తద్వారా తమకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూ జీవో జారీ చేయడం వల్ల 65 వేల మంది గ్రామీణ వైద్యులకు మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

దాతల సహకారం అభినందనీయం


స్థల పత్రాలను ఇస్తున్న దాతలు

పామూరు : మండలంలోని చిలంకూరు గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి అవసరమైన 12 సెంట్ల స్థలాన్ని దాతలు ఇవ్వడం అభినందనీయమని హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ టి. అహమ్మద్ ఉస్మాన్ అన్నారు. ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు గ్రామస్థులు మలినేని నారాయణ, వెంకట స్వామి, భాస్కర్, మిరియం వెంకట నారాయణ, కామినేని వెంకటస్వామి, పిడికిటి వెంకటనారాయణలు సుమారు రూ. 5 లక్షల విలువ గల 12 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. త్వరలో చేపట్టబోయే నిర్మాణానికి ఎమ్మెల్యే కదిరి బాబూరావు సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పి.రాజశేఖర్, సీహెచ్‌వో సీహెచ్ మురళీకృష్ణ, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

పామూరు : ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరణ చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఆ ప్రయత్నాలను సమష్టిగా ఎదుర్కోవాలని కోరుతూ యునైటెట్ ఫ్రమ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు జాతీయ బ్యాంకుల సిబ్బంది సమ్మె చేపట్టారు. సమ్మె కారణంగా ఎస్‌బీఐ, ఆంధ్రా, సిండికేట్, ఇం డియన్ బ్యాంకు సిబ్బంది బ్యాంకులను మూసివేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బ్యాంకుల ప్రయివేటీకరణ, విలీనం ఆపివేయాలని, బడాబాబుల మొండి బకాయిలను వసూలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, వినియోగదారులపై పడే అధిక సర్వీసు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని, ఎఫ్ఆర్‌డీఏఐ బీఐయూ బిల్లును వ్యతిరేకించాలని, బ్యాంకు బోర్డు బ్యూరో రద్దుచేయాలని కోరారు. ప్రజా వ్యతిరేక బ్యాంకుల సంస్కరణలు తొలగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్టేట్, ఆంధ్రా, సిండికేట్ బ్యాంకుల మేనేజర్లు కె.విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సంప్రదాయాలను గౌరవించాలి

పామూరు : సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తే ఉత్తమమైన విద్య అలవడుతుందని సర్పంచ్ డీవి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక వివేకా ఆర్ట్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సర్పంచ్ డీవి మనోహర్, ఎస్సై ఉసా సాంబశివయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యంతో ముందుకుసాగితే ఉన్నత శిఖరాలను శులభంగా చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివేకా విద్యాసంస్థల అధ్యక్షుడు కె.రామిరెడ్డి, డైరెక్టర్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బండి భాస్కరరావు, ప్రిన్సిపాల్స్ మూర్తి మహాలక్ష్మయ్య, రాఘవ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ మనోహర్

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

పామూరు : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దివ్యాంగుల సేవా కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి, పంచిపెట్టారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆకుపాటి వెంకటేష్, గుత్తి అనిల్, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిడుగు శ్రీనివాసులు, గుత్తి మాధవ, రవి, ఫిషన్‌సింగ్, రామూర్తి, శివ,గఫూర్,సుబ్బారావు,మహేష్, కాపు యువనేతలు పాల్గొన్నారు.


దివ్యాంగులకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న అభిమానులు

విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

పామూరు : వినాయచవితి సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై ఉసా సాంబశివయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎన్ని రోజులు విగ్రహాలు ఉంచుతారు, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు వంటి వివరాలు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. మండలపాల వద్ద తగన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కమిటీ నిర్వాహకులేదనన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


తారురోడ్డు మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ రవికుమార్

సీఎస్‌పురం (పామూరు) : రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పా టించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్చూరు ఆర్‌అండ్‌బీ ఈఈ రవికుమార్ సూచించారు. మండలంలోని చెర్లోపల్లి పంచాయతీలో రూ.2.45 కోట్ల తో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రోడ్డుకు వాడుతున్న మెటీరియల్‌ను ప రిశీలించి అధికారులకు, గుత్తేదారులకు తగు సూచనలు చేశారు. ఈయన వెంట పీఆర్ స్పెషల్ జేఈ ఆదిశేషు, సర్పం చ్ ఆదినారాయణ, గుత్తేదారుడు మామిడాల భాస్కర్

వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి

● ప్రత్యేకాధికారి వేణుగోపాల్

పీసీపల్లి : గ్రామాల్లో వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రామంలో కూడా బహిరంగ మల విసర్జన కనిపించకూడదని దృఢసంకల్పంతో ఓడీఎఫ్ కింద గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. స్వచ్ఛభారత్ కింద ప్రతిగ్రామంలోనూ ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీకి ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించి మరుగుదొడ్ల అవశ్యకతను తెలియజేయాలని ఎంపీడీవో సురేష్ బాబును ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన వారికి త్వరితగతిన జియో ట్యాగింగ్ చేసి, బిల్లులు వచ్చేలా చూడాల్సిన బాద్యత ఆర్‌డబ్ల్యూస్‌శాఖపై ఉందన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కనిగిరి టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం నాయకుడు కేశవరావు అన్నారు. పట్టణంలోని సుందరయ్యభవనంలో సీపీఎం కార్యకర్తలకు మంగళవారం రెండవరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాదశక్తులు విజృంభించి ఘర్షణలకు పెచ్చరిల్లుతున్నా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ భజన చేస్తున్న సీఎం చంద్రబాబు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి అమరావతి చుట్టూ గాలిమేడలు కట్టుకొని భ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల్లో రుణమాఫీ అమలు పూర్తిస్థాయిలో చేయకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు మాలకొండారెడ్డి, పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, మాలకొండయ్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీసీ కేశవరావు

సూక్ష్మపోషకాలను వినియోగించుకోవాలి

కనిగిరి : ప్రభుత్వం నూరుశాతం రాయితీపై ఇస్తున్న జింకు, జిప్సమ్, బోరాన్, సూక్ష్మపోషకాలను భూసార పరీక్షా కార్డుల్లో సూచించిన విధంగా వి నియోగించుకోవాలని విస్తరణాధికారి జి.వెంకటస్వామి కోరారు. మండలంలోని పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పెట్టుబడి తగ్గించుకునే విధంగా మిరప, వంగ, టామోటా, నాటే విధానంలో ఈసే ప్లాంటర్ మిషన్‌ను ఎలా ఉపయోగించుకోవాలో రైతులకు వివరించారు. మిషన్ పూర్తి ఖరీదు రూ. 4వేలు కాగా 50 శాతం రాయితీతో రూ. 2 వేలకే అందిస్తామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకిరెడ్డి అంకిరెడ్డి, ఎంపీఈవోలు లక్ష్మిప్రసన్న, షేక్ నజ్మా, బీవీ సుబ్బయ్య, ఇక్రిశాట్ సిబ్బంది ఏలిషా, మురళి,రె పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.


కంకణంపాడులో పొగనారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో జైనులాబ్దిన్

వెలిగండ్లలో..

మండలంలోని కంకణంపాడు, కేపీ అగ్రహారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో షేక్ జైనులాబ్దిన్ అధ్వర్యంలో జరిగింది. అగ్రహారం గ్రామంలోని పొగాకు నారు దొడ్లను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. రూట్‌రాట్ నివారణకు స్కేటిన్ 2 గ్రాముల మందు లీటర్ నీటిలో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

వెలిగండ్ల : ఉపాధిహామీ పనులకు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి కోరారు. గన్నవరం, రామలింగాపురం, నాగిరెడ్డిపల్లి, పీఎన్‌వరం, రామలింగాపురం గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో జైనులాబ్దిన్, ఎంఈవో దాసు ప్రసాద్, ఏపీవో, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి

డిగ్రీ, పీజీ అడ్మిషన్లకు రేపటితో గడువు పూర్తి

కనిగిరి టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ల గడువు ఈ నెల 24 వరకు ఉంటుందని అధ్యయనం కేంద్రం కోఆర్డినేటర్ పి.రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

కనిగిరి టౌన్ : మండలంలోని వాగుపల్లి గ్రామంలో మంగళవారం పేకాట ఆడుతున్న అయిదుగురుని అరెస్టు చేసి,త రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఉప్పు శ్రీనివాసులు అధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

సీఎస్‌పురం (పామూరు) : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పావలి తిరుపతయ్య, మన్నేపల్లి చంద్ర, రవి, కోటా అశోక్, బోయిన మహేంద్ర, ఇండ్లా శ్రీను, హజరత్‌నాయుడు, షేక్ మస్తాన్, గోగిశెట్టి శ్రీను, రమేష్, తోట చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక గ్రామసభ

వెలిగండ్ల : ప్రజావేదిక గ్రామసభ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరుగుతుందని ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సభలో తనిఖీ బృంద సేకరించిన వివరాలను తెలియజేయనున్నట్టు చెప్పారు. ఉపాధి కూలీలు, అధికారులు, స్థానిక పాలకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జామాయిల్, సుబాబుల్‌కు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం

● ఏఎంసీ చైర్మన్ దారపనేని

కనిగిరి : జామాయిల్, సుబాబుల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ వెల్లడించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గుంటూరులో గత వారం కలెక్టర్ వినయ్‌చంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 493 జీవో అమలు చేసి, సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణరెడ్డిలు పేపర్ మిల్స్ కంపెనీ ప్రతినిధులతో చర్చించినా మూడు మాసాలుగా కొనుగోలుపై అధికారుల నుంచి స్పందన కొరవడిందన్నారు. రైతుల మద్దతు ధరపై కలెక్టర్ వినయ్‌చంద్ ఆదేశాల మేరకు బుధవారం భద్రాచలం ఐటీసీ రాజమండ్రి ఏపీపీఎం పేపర్ మిల్స్ కంపెనీ ప్రతినిధులతో చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ అధికారులు, ఏఎంసీ చైర్మన్లతో జామాయిల్, సుబాబుల్, మద్దతు ధరలపై పరిస్థితులను పర్యవేక్షించడానికి కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ చర్చలకు జిల్లా నుంచి కనిగిరి, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్లు హాజరవుతారని తెలిపారు.

సులభమైన పద్ధతిలో బోధించాలి


టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సర్వశిక్షాభియాన్ అధికారి

సీఎస్‌పురం (పామూరు) : విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థమయ్యేలా బోధించాలని జిల్లా సర్వశిక్షాభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కొండారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పద్ధతులు, వంటగ్యాస్ వినియోగం, విద్యాకమిటీ నియామకాలు, త్రైమాసిక పరీక్షా విధానాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎస్ కోఆర్డినేటర్ యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

హనుమంతునిపాడు : సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ఎంఆర్సీ నందు సీపీఎస్ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.పెద్దిరాజు, సీపీఎస్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి సూర్యనారాయణ, సభ్యులు శ్రీరాంమూర్తి, హానిష్, ఖాజా, వెంకటేశ్వర్లు, గౌస్ బాషా, బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

హనుమంతునిపాడు : మండలంలోని వాలిచర్ల జడ్పీ హై స్కూల్‌లో విద్యార్థినులకు ఎంపీపీ గాయం బలరామిరెడ్డి మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే బాలికలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సైకిళ్లను అందజేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పెరిగేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అంజలి, జి.ఆదినారాయణరెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బలరామిరెడ్డి

సిమెంట్ రోడ్డు పక్కన మొక్కలు నాటే కార్యక్రమం

మార్టూరు: గ్రామ పంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీ నుంచి రాజుపాలెం వరకు నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరుపక్కల మంగళవారం మొక్కలను నాటారు. జిల్లా ఎస్సీ సెల్ నాయకులు బండి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వెలుగు డీఆర్పీలు వారి సహకారంతో కిలోమీటరు వరకు రోడ్డకు ఇరువైపులా గానుగ, వేప 400 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీసీ రవికుమార్, కాలనీవాసులు చంద్రరావు, ఎం.వెంకయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యదర్శనం యాత్రను ప్రారంభించిన పురందేశ్వరి

కారంచేడు(చీరాల) : దేవాదాయ,ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యదర్శనం యాత్రకు భక్తులు కారంచేడు మండలం నుంచి మంగళవారం బయలుదేరారు. బీజేపీ మహిళామోర్చా జాతీయ అధ్యక్షురాలు, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు దివ్యదర్శనం పేరుతో రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలను ఉచితంగా సందర్శించే విధంగా చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో దామా నాగేశ్వరరావు, ఆశ్రమ స్వామిజీ ప్రణవానంద స్వామి పాల్గొన్నారు.


యాత్రను ప్రారంభిస్తున్న పురందేశ్వరి

రైతుబంధును సద్వినియోగం చేసుకోవాలి

ఏఎంసీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి

పర్చూరు: రైతుబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని పర్చూరు మార్కెట్‌యార్డు చైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి అన్నారు. పథకం అమలు, మార్కెట్‌యార్డు ద్వారా చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులు నిల్వచేసుకున్న దాన్యాలకు రూ.2 లక్షల వరకు రైతుబంధు ద్వారా రుణం పొందే సదుపాయం ఉందన్నారు. రైతుల వద్ద ఉన్న మిర్చిని తిరిగి కొనుగోళ్ళు చేయటానికి త్వరలో పర్చూరు మార్కెట్‌యార్డులో కొనుగోళ్ల కేంద్రాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ షేక్ జమాలుద్దీన్, గ్రామ సర్పంచ్ యద్దనపూడి సరోజిని, కార్యదర్శి ఎం.వరలక్ష్మి, డైరెక్టర్స్ దండా శ్రీనివాసరావు, కోడూరి శేషబ్రహ్మాచారి, పోపూరి లక్ష్మి, తమ్మలూరి రమాదేవి, లగడపాటి అంకమ్మ గాంధీ, చెరుకూరి రమేష్, జరుగుల శ్రీనివాసరావు, చప్పిడి సాంబశివరావు, యూడీసీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణదీక్ష కోసం శాంతిహోమం

పర్చూరు(చెరుకూరు): నవభారత నిర్మాణదీక్ష కోసం లోకశాంతి కోరుతూ పర్చూరు ప్రాంతీయ బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు చెరుకూరులోని త్రివిక్రమ అగస్తేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విప్రులకు ఎంతోమేలు కలుగుతుందని సంఘ ప్రతినిధి శనగవరపు లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాదించాలని వారు పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రమేష్, పూర్ణానందశాస్త్రి, గుడిపాటి సాంబశివరావు, స్థానిక అర్చకులు పాల్గొన్నారు.

పత్తికి ప్రత్యామ్నాయంగా అపరాలు వేసుకోవాలి

మార్టూరు: పత్తి రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలు పంటను వేసుకోవాలని పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు తప్పనిసరిగా ఎకరాకు 10 నుంచి 15 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఒంగోలు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ ఎం.ప్రభాకరరావు రైతులను కోరారు. మంగళవారం వలపర్ల గ్రామంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి కె.వెంకటకృష్ణ అధ్యక్షత వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి బ్రహ్మయ్య, వెలగ రామాంజనేయులు, గోనుంట్ల మోహన్‌రావు, ఏఈవో మౌలాలి, ఎంపీఈవో అనురాధ పలువురు రైతులు పాల్గొన్నారు.

సమ్మెతో మూతపడిన బ్యాంకులు

చినగంజాం : ప్రభుత్వరంగ బ్యాంకులపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ పిలుపు మేరకు మండల పరిధిలోని బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండి యా, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు, కడవకుదురులో ని సిండికేట్ బ్యాంకు, చింతగుంపల్లిలోని విజయ బ్యాంకు, సంతరావూరులోని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం మూసివేసి సమ్మె పాటించారు. లావాదేవీలు జరిపేందుకు వచ్చిన ఖాతాదారులు బ్యాంకులు మూసి ఉండటంతో వెనుతిరిగి వెళ్లారు.



మూతపడిన ఇంకొల్లు ఎస్‌బీఐ

ఇంకొల్లు మండలంలో...

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా మంగళవారం మండలంలోని బ్యాంకులు మూతపడ్డాయి. ఇంకొల్లులో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇంకొల్లు టౌన్ శాఖ, ఆంధ్రాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకులు మూసివేయటంతో ఆర్థిక లావాదేవీలు జరగక అసౌకర్యానికి గురయ్యారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

చినగంజాం : సోపిరాల సత్యం హైస్కూల్‌లో 2016-17లో పదో తరగతిలో 9.5 పాయింట్లు సాధించిన కట్టా మేఘన ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.హరనాథ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- అద్దె భవనాల్లో కార్యాలయాలు
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న ఒకనాటి ప్రభుత్వ వైద్యశాల


శిథిలావస్థకు చేరిన గ్రామచావిడి

పర్చూరు: ప్రభుత్వ ఆస్థుల పట్ల అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి కనపరచటం లేదు. ప్రభుత్వ ఆస్థులను కాపాడి వాటిని బావి తరాలకు అప్పజెప్పాల్సిన భాద్యతను అధికారులు విస్మరిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ భవనాలు శిధిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం వేలకు వేలు చెల్లించి మరీ అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. కొద్దిపాటి మరమ్మత్తులు చేయించి, వినియోగించుకోవటానికి వీలుగా ఉన్న భవనాలను సైతం గాలికొదిలేని ఎంచక్క అద్దెభవనాల్లో కార్యాలయాలను నిర్వహి స్తూ ప్రభుత్వ ఖజానాకు తూట్లు పెడుతున్నారు. ఏళ్ళ తరబడి శిదిలావస్థకు చేరుకొంటున్న కొన్ని ప్రభుత్వ భవనాలు ఆక్రమణదారుల చెరలోకి చేరిపోయినా వాటిని కాపాడాల్సిన భాద్యతను అధికారులు పట్టించుకోక పోవటం శోచనీయాంశం. స్థానిక ఎండీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఒకనాటి ప్రభుత్వ వైద్యశాలకు కొద్దిపాటి మరమ్మత్తులు చేసుకొంటే ఏదో ఒక కార్యాలయానికి వినియోగించుకోవచ్చని అధికారులకు తెలిసినా ఆదిశగా చర్యలు చేపట్టక పోవటం గమనార్హం. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, వెలగుకార్యాలయం, సబ్‌రిజిస్టార్ కార్యాలయం, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, గృహనిర్మాణశాఖ తదితర కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పర్చూరులోని పోలీస్ స్టేషన్ కార్యాలయానికి అనుకొని 9సెంట్ల విస్తీర్ణంలో ఉన్న గ్రామ చావిడి శిధిలావస్థకు చేరుకొంది. దీనిపై ఇప్పటికే కొంత మంది ఆక్రమణదారులు డేగ కన్ను వేసి ఉంచినట్లు సమాచారం. కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గరికాకుండా అధికారులు దృష్టి సారించాలని, దీంతోపాటు శిధిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త భవనాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అద్దె భవనంలో సబ్‌రిజిస్టార్ కార్యాలయం

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం

పర్చూరు: పర్చూరులోని అతిథిగృహంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ నియామక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కోఆర్డినేటర్ ఎండీ బాబూఖాన్ పాల్గొన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఎస్.కె.షరీద్, టౌన్ అధ్యక్షుడిగా షేక్ షజల్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మీర్సా తెలిపారు.

శిక్షణతో మెరుగైన విద్య

ఇంకొల్లు : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించే ఉద్దేశంతోనే ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని ఎంఈవో జయరాజ్ తెలిపారు. మంగళవారం వంకాయలపాడు స్కూల్ సముదాయంలో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఈవో పాల్గొని సూచనలు చేశారు.

అట్రాసిటీ కేసు విచారణ

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో ఈ నెల 19వ తేదీన మార్టూరు పోలీసుస్టేషన్‌లో రెండు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయి. అందుకు సంబంధించి మంగళవారం ఒంగోలు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీధర్ వలపర్ల వచ్చి బాధితులను విచారించారు.

సంక్షేమ పథకాలను సమర్థవంతగా నిర్వహించాలి

నియోజవర్గ ప్రత్యేక అధికారి చంద్రశేఖరావు

పర్చూరు: అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలని నియోజవర్గ ప్రత్యేక అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నియోజవర్గంలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి, మార్టూరు, చినగంజాం మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, పశుసంవర్ధక శాఖ ఆద్వర్యంలో చేపడుతున్న పశుగ్రాస క్షేత్రాల పురోగతి, గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేడుతున్న ఎన్టీఆర్ గృహనిర్మాణ యోజన పథకం పనితీరు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. నియోజకర్గంలో తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆ శాఖ డీఈఈ ప్రభాకరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

చినగంజాం : వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్.మేరమ్మ అన్నారు. మండలంలో చింతగుంపల్లి, రాజుబంగారుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మేరమ్మ రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు జశ్వంత్, సీ.హెచ్.చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజం

యద్దనపూడి : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ అన్నారు. కార్యాలయంలో మంగళవారం పదోన్నతిపై వెళ్లిన మండల ఉద్యోగులు కె.హరికృష్ణ, రాఘవలను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ఎంపీపీ దీనమ్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు రంగయ్యచౌదరి, మురళి, నాగేశ్వరరావు, సీతయ్య, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

చీమకుర్తి: వ్యవసాయ విద్యుత్ మోటార్లు కలిగిన మండల రైతులకు చీమకుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి, ట్రాన్స్‌కో డీఈ మాకినేని హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎస్ఎల్ సంస్థ వారు రైతుల వద్ద ఉన్న పాడైపోయిన మోటార్లను తీసుకొని ఉచితంగా ఫైవ్‌స్టార్ మోటార్లు ఇస్తారని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను సదస్సులో వివరిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయాణ యాతన

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

ఏళ్ల తరబడి పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజల అవస్థలు

నాగులుప్పలపాడు : మండలంలో గ్రామీణ రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పూర్తిగా దెబ్బతిని గోతులు పడి ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల నేల బ్రిడ్జిలు సైతం కూలిపోయి ఏళ్లు గడిచినా మరమ్మతులు కరువయ్యాయి. ఈ విషయమై ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు, అనేక పర్యాయాలు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

ఉప్పుగుండూరు - మాచవరం గ్రామాల మధ్య ఉన్న పంచాయితీ రాజ్ రోడ్డు 2009లో సంభవించిన తుపానుకు 6 కి.మీ మేర దెబ్బతింది. తారురోడ్డు లేచిపోయి పలు చోట్ల గోతులు పడ్డాయి. ఇదే రోడ్డులో భావనకుంట సమీపంలో నేల బ్రిడ్జి కూలిపోయింది. ఎనిమిదేళ్లుగా ఆ రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాకపోకలకు అవరోధం ఏర్పడింది. మాచవరం వాసులు అమ్మనబ్రోలు రోడ్డు నుంచి నాగులుప్పలపాడు మీదుగా ఉప్పుగుండూరుకు 15 కి.మీ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాపర్ల నుంచి అమ్మనబ్రోలు రోడ్డు వరకు ఉన్న రహదారి గోతులమయంగా మారింది. అగ్రహారం జంక్షన్ నుంచి రాపర్ల చేరుకునేందుకు వాహనదారులు పడుతున్నట్లు ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఓబనపాలెం - మాచవరం మధ్య నేల చప్టా కుంగిపోయి వాహనాలు వెళ్లేందుకు వీలుకాని పరిస్థితి ఉంది. ఒమ్మెవరం - ఉప్పుగుండూరు మధ్య సుమారు 4కి.మీ ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా మారింది. నడిచేందుకు కూడా వీలుకాని దుస్థితి నెలకొంది. ఈ రోడ్లన్నీ దెబ్బతిని ఏళ్ళు గడుస్తున్నా మరమ్మతులు కరువవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు గ్రామాలకు మధ్య ఉన్న లింకు రోడ్లు దెబ్బతినడం వలన జీవనానికి కూడా ఇబ్బందిగా మారింది. రోజువారీ అవసరాలు, సరుకుల చేరవేత, పాలు తదితరాలు తీసుకొచ్చేందుకు వ్యయ ప్రయాసాలకోర్చాల్సి వస్తోంది. ఇప్పటికైన సంబంధిత అదికారులు చర్యలు తీసుకొని గ్రామీణ ప్రాంత పంచాయతీ రాజ్ రోడ్లను బాగు చేయించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



భావనకుంట వద్ద సగం ఆనవాళ్లు లేని నేల బ్రిడ్జి



అధ్వానంగా ఉన్న మాచవరం రోడ్డు



గోతులమయమైన రోడ్డుతో అవస్థలు

ఒమ్మెవరం నుంచి ఉప్పుగుండూరు వెళ్ళే రహదారి 4కి.మీ మేర పూర్తిగా తెబ్బతింది. ఒమ్మెవరం వాసులు ఉప్పుగుండూరుకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేయించాలి.

- డి. అప్పారావు, ఒమ్మెవరం



ఎనిమిదేళ్లుగా మోక్షం లేదు

మాచవరం రోడ్డు దెబ్బతిని ఎనిమిదేళ్లయింది. ఉప్పుగుండూరు నుంచి అమ్మనబ్రోలుకు వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. అదేవిధంగా మాచవరం వాసులు ఉప్పుగుండూరుకు సులభంగా చేరుకోచ్చు. కానీ ప్రస్తుతం రోడ్డుతో పాటు, చట్టా కూడా దెబ్బతింది. దీంతో 16 కి.మీ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

- యు. సంజీవరావు, ఉప్పుగుండూరు



విద్యార్థులతో శిద్దా సుధీర్

విద్యాభివృద్ధికి సహకారం

చీమకుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని పారిశ్రామిక వేత్త శిద్దా వీరవెంకట సుధీర్ కుమార్ తెలిపారు. బండ్లమూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం చీమకుర్తి నివాసి ఆలూరి పెద్ద కుమారుడు అన్వేష జ్ఞాపకార్థం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల విద్యార్థులందరికీ యూనిఫాం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డి, ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు శిద్దా సుధాకర్, నూకల సుబ్రమణ్యం, గుర్రాల దామోదరం, హరి, ఎస్ఎంసీ చైర్మన్ జ్యోతి, పిచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు రమణమ్మ, పద్మజ, నాగేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలకు గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ

మద్దిపాడు : మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న 54 పాఠశాలలకు మంగళవారం ఎంపీడీవో సిహెచ్. కృష్ణ సిలిండర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పొగ పొయ్యి నుంచి మహిళలను దూరంగా ఉంచాలన్న ఉద్దేశంతో ఈ సిలిండర్‌లు పంపిణీ చేసిందని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఇండియన్ గ్యాస్ కంపెనీ ప్రతినిధులు కొండయ్య, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన బ్యాంకులు

చీమకుర్తి / సంతనూతలపాడు : సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు ఉద్యోగ సంఘాల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని బ్యాంకులు మూతపడ్డాయి. రూ. వందల కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో ఖాతా దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పని సరి

నాగులుప్పలపాడు : వినాయక చవితిని పురస్కరించుకొని ఈనెల 25 నుంచి గ్రామాలలో ఏర్పాటు చేసే మండపాలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎ. అజయ్‌బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్లో మండపాలు ఏర్పాటు చేసే భక్త మండళ్లు, ఆయా గ్రామాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి మండపం వద్ద కమిటీగా ఏర్పడి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులతోపాటు, విద్యుత్ శాఖ అనుమతి తప్పని సరి అని తెలిపారు. ఇతర మతస్థుల మనోభావలు దెబ్బతీసే కార్యక్రమాలు నిర్వహించకూడదని, అలాగే స్పీకర్‌లలో ఇష్టానుసారం సౌండ్ పెట్టకూడదని సూచించారు. ఎక్కడైనా గొడవలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలి

స్మార్ట్ ఫౌండేషన్ అధికారి విజయకుమారి విజ్ఞప్తి

నిప్పట్లపాడు సందర్శన

చీమకుర్తి : గ్రామాలను స్మార్ట్‌గా తీర్చిదిద్దటానికి ఎన్ఆర్ఐలు, దాతలు సహకరించాలని స్మార్ట్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి భూమిరెడ్డి విజయకుమారి కోరారు. మంగళవారం ఆమె నిప్పట్లపాడు గ్రామాన్ని సందర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిప్పట్లపాడు, బేస్తవారపేట మండలం మోక్షగుండంలను రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ గ్రామాలుగా గుర్తించిందని తెలిపారు. ఈ రెండు గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాత మరికొన్ని గ్రామాలను గుర్తిస్తామన్నారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మువ్వా రవికిరణ్ నిప్పట్లపాడును దత్తత తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం వలన ఈ గ్రామాన్ని గుర్తించామన్నారు. దీన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు 20 రాజీలేని సూత్రలను వేగవంతంగా అమలు చేస్తామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామస్థుల సూచన మేరకు తొలుత ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ భవనం, మురుగు కాలువలు, కరెంటు పోల్స్, అయ్యపురాజుపాలెం శ్మశాన వాటికలను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అనంతరం రూ. 13 లక్షలతో ఎన్ఆర్ఐ రవి కిరణ్ అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశాన వాటిక పనులను, అంగన్‌వాడీ భవనాలను, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో టి. కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్న విజయకుమారి

పెద్ద చెరువులో ఆక్రమణలు తొలగించాలి

సంతనూతలపాడు : పెద్ద చెరువులో ఆక్రమణలు తొలగించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ ఆర్. ప్రభాకరరరావు కోరారు. ఈమేరకు ఆయనకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. చెరువును కొందరు ఆక్రమించి గొర్రెలు, మేకల పెంపకందారులను చెరువు వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం నాయకులు బంకా సుబ్బారావు, టి. ప్రభుదాస్, ఎన్. వెంకటేశ్వరు తదితరులు ఉన్నారు.

ఘనంగా చలువాది జన్మదిన వేడుకలు

చీమకుర్తి : పెరల్స్ గ్రానైట్ కంపెనీ అధిపతి చలువాది వెంకట నాగరాజు జన్మదిన వేడుకలు రామతీర్థం వద్ద ఉన్న క్వారీ ఆవరణలో మంగళవారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, అత్మీయులు, అభిమానులు, క్వారీ కార్మికుల సమక్షంలో రాజా కేక్ కట్ చేశారు. తండ్రి నాగేశ్వరరావు, సతీమణి శ్రీదేవి, తనయుడు సాకేత్ రామనుజలకు కేక్ తినిపించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావిపాటి రాంబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కిష్టిపాటి శేఖర్‌రెడ్డి, కేఎంబీ రవి, మూర్తి, మర్రిపూడి చంద్రశేఖర్, గోగినేని నాగయ్య, మద్దాళి మాధవరావు తదితరులు రాజాకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీస్ యజమానుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, బయ్యర్లు చంద్ర, మోకేష్, తిమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యర్రగుంట్ల చంద్రశేఖర్, గోగినాని నాగయ్య, ఎస్. రంగయ్య, జి.ఎం. వెంకటేశ్వర్లు, కాశీ తదితరులు పాల్గొన్నారు.



చలువాది జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రానైట్ క్వారీల యజమానులు తదితరులు

ఓబీసీ మహాసదస్సు కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు నగరం : విజయవాడలో ఈ నెల 28వ తేదీన జరగబోవు ఓబీసీ మహాసదస్సు కరపత్రాన్ని మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఆ సదస్సుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా హాజరు కానున్నారని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె.బంగారుబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శులు శెగ్గం శ్రీనివాసులు, విన్నకోట సురేష్‌బాబు, ఓబీసీ జిల్లా మొర్చా ప్రధాన కార్యదర్శి పూనిపర్తి పవన్‌రాజ్, నరేంద్రయాదవ్, హరికృష్ణ, టి.నాగరాజు పాల్గొన్నారు.

నీటి ఇక్కట్లపై కదిలిన యంత్రాంగం


కమిషనర్‌తో మాట్లాడుతున్న మంత్రి శిద్దా


సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ తదితరులు

- అదనపు ట్యాంకర్లకు రూ. 50లక్షలు కేటాయించిన కలెక్టర్

- నగర వేసవి చెరువులు పరిశీలించిన ఎస్ఈ

- మంత్రి శిద్దా, ఎమ్మెల్యే దామచర్ల దృష్టి

ఒంగోలు కార్పొరేషన్ : నగరంలో తాగునీటి ఎద్దడిపై మునిసిపల్ ఇంజనీరింగ్ యంత్రాంగం అప్రమత్తమైంది. మంగళవారం మునిసిపల్ ఎస్ఈ కె. మోహన్, ఈఈ రామ్మోహన్‌రావు, కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ, మునిసిపల్ ఇంజనీర్ డి. సుందరరామిరెడ్డి వేసవి చెరువులను పరిశీలించారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ప్రజలకు సరిపడా నీరు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకునే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా నగరంలోని ఫిల్టర్‌బెడ్‌లూ పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్య పరిష్కారమయ్యే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిబ్బందికి సెలవులూ రద్దు చేసినట్లు తెలిపారు. ఎవరూ నీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఈ విషయం అర్థమయ్యేలా సిబ్బంది వివరించాలని చెప్పారు.

అప్రమత్తమైన యంత్రాంగం

తాగునీటి సమస్యపై కార్పొరేషన్ స్పెషలాఫీసర్, కలెక్టర్ వి. వినయ్‌చంద్ దృష్టి సారించారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. అదనపు ట్యాంకర్ల ఏర్పాటుకు అత్యవసరంగా రూ. 50 లక్షలతో టెండర్లు పిలవాలని ఆదేశించారు. అదేవిధంగా మంత్రి శిద్దా రాఘవరావుతోపాటు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుత తాగునీటి నిల్వల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఉన్న నీరు ఎన్ని రోజులకు సరిపోతుంది.. సరఫరాకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అదనపు నిధులు కేటాయించి అయినా ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. స్థానిక నీటి వనరులను సమర్థంగా వాడుకోవాలని చెప్పారు. అధికారులు మాట్లాడుతూ ఇప్పటి వరకు తలసరి 100 లీటర్ల సరఫరా చేస్తుం డగా 70 లీటర్లకు తగ్గించినట్లు తెలిపారు. నీటి ట్యాంకర్లను 32 నుంచి 50కు పెంచినట్లు వివరించారు. రోజూ 12.00 లక్షల లీటర్ల క్లోరినేటెడ్ నీటిని రూ. 60 వేలతో సరఫరా చేస్తున్నామన్నారు. సమస్యల కోసం 1800-425-2858 టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసినట్లు కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ, ఎంఈ. డి. సుందరరామిరెడ్డి తెలిపారు.

బహుమతులు ప్రదానం

ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకల సందర్భంగా శ్రీగాయత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంగళి కోదండ రామయ్య ఓరియంటల్ స్కూలులో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లోని విజేతలకు బహుమతులను రచయితల సంఘం కార్యదర్శి పొన్నూరి వేంకట శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్, జయశ్రీలు అందజేశారు. పోటీల్లో ఎస్. ఆదిత్య, ఎం. రాజ, కె. ఆఖిల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ కె. శ్రీరామశర్మ, వి. చలపతిరావు పాల్గొన్నారు.

దేవరంపాడు గ్రామస్థుల నిరసన

ఒంగోలు రూరల్ : దేవరంపాడు ఉప్పుసత్యాగ్రహ విజయస్థూపాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల హామీలు అమలు కాకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం దేవరంపాడు గ్రామస్థులు స్వాత్రంత్య సమరయోధుడు సాగి విజయరామరాజు విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. నేడు జరగనున్న టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాలను కూడా బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. గ్రామసర్పంచ్ చుంచు దశరథరామయ్య మాట్లాడుతూ 2014లో మంత్రి శిద్దా రాఘవరావు విజయస్థూప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. నిరసన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుల కుమారులు సాగి రామచంద్రరాజు, సాగి క్రిష్ణమరాజు, గ్రామస్థులు సాగి జగపతిరాజు, ముప్పవరపు శ్రీనివాసరావు, చుంచు శేషయ్య, చుంచు యల్లమంద, పెనుమత్సు నరసింహరాజు, చుంచు హరిబాబు, సాగి రాజ్యలక్ష్మి, పెనుమత్సు ప్రసన్నలక్ష్మి, సాగి సీతమ్మ, సాగి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఎరువులు ఉపయోగించుకోవాలి

ఒంగోలు రూరల్ : రైతులు భూసార పరీక్ష కార్డుల ఆధారంగా భూమిలో ఎరువులు వాడుకోవాలని ఏవో పి.వేణుగోపాల్ చెప్పారు. త్రోవగుంటలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో కుంచాల రామకృష్ణ, ఎంపీఈవోలు ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

థియేటర్	సినిమా
సత్యం	ఫిదా
రత్నమహల్	ఆనందోబ్రహ్మ
గోపి	జయజానకి నాయక
సాయిసరోజ్	లై
తులసీరాం	జయ జానకి నాయక
జయరాం	నిన్నుకోరి

గోరంట్ల సినిమాస్ స్క్రీన్స్‌లలో----

నక్షత్రం, గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ

24న ప్రైవేటు పాఠశాలలు బంద్


మాట్లాడుతున్న విశ్వభారతి హనుమంతరావు

ఒంగోలు కలెక్టరేట్ : కర్నూలులో ఆపుస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్యలపై విద్యార్థి సంఘాలు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆపుస్మా జిల్లా అధ్యక్షుడు విశ్వభారతి హనుమంతరావు తెలిపారు. స్థానిక వీఎన్‌జీ స్కూలులో మంగళవారం జరిగిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏదైనా దురదృష్టకర సంఘటనలో పాఠశాల యాజమాన్యాల పాత్ర ఉన్నట్లు అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప దాడి చేయడం తగదన్నారు. ఈ సంఘటన యావత్తు ప్రైవేటు పాఠశాలలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ బంద్‌కు జిల్లా జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, గుండారెడ్డిలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనాగార్జున సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వీఎన్‌జీ మాధవరావు, ఒంగోలు యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్ చౌదరి, ఈసీ మెంబర్ హనుమంతరావు, కందుకూరు రామారావు, అద్దంకి లక్ష్మీనారాయణ, కార్యదర్శి నలంద ప్రసాద్, కేఎంఎస్ వసుందారాదేవి, పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- మహిళలతో మాట్లాడిన కమిషనర్

ఒంగోలు కలెక్టరేట్ : ఐదారు రోజుల నుంచి నీరు రాకపోవడంతో మహిళలు రంగుతోటలో ఆందోళనకు దిగారు. నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 12వ డివిజన్‌లో ట్యాంకర్లకు పంపింగ్ వద్ద ఆందోళన చేయడంతో విషయం తెలుసుకసున్న నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ అక్కడకి వచ్చారు. దీంతో మహిళలు తమ సమస్యలను విన్నవించారు. గంట కూడా నీరు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ట్యాంకుల్లో సమృద్ధిగా నీరున్న సమయంలో రోజు మార్చి రోజు ప్రజలకు నీరు అందించామని, కానీ ప్రస్తుతం నీరు లేని కారణంగా కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. మహిళలు మాట్లాడుతూ రోజు మార్చి రోజు తాము నీళ్ల ఇవ్వమని అడిగామా అని ప్రశ్నించారు. అలా ఇచ్చి కాలువల్లో వృథాగా పోనిచ్చి ఇప్పుడు నీరు లేవంటే ఏలా అని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న వైసీపీ నగర కమిటీ అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు, వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్‌లు మహిళలకు అండగా నిలిచారు. కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మరో వైపు టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు అక్కడికి చేరుకున్నారు. నీరు రాకపోతే తమకు ఫోన్ చేస్తే ట్యాంకర్లు పంపుతామని చెప్పడంతో వైసీపీ నాయకులు జోక్యం చేసుకున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది.


కమిషనర్‌తో మాట్లాడుతున్న వైసీపీ నేతలు సింగరాజు, ప్రసాద్, ఆందోళన కారులు

నగరంలో ఈ వారం

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ రోడ్డు షోలు

ఒంగోలు వ్యవసాయం : నగరంలోని ప్రధాన కూడలల్లో ఈ నెల 23, 24వ తేదీల్లో బీఎస్ఎన్ఎల్ రోడ్డు షో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టెలికం జనరల్ మేనేజర్ బి.చంద్రసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు షోలో 3జీ సిమ్ ఉచితంగా ఇస్తామని, నెలకు రూ.49లకే ల్యాండ్‌లైన్ ఏర్పాటు చేస్తామని, రూ.249లకే నెలకు అన్‌లిమిటెడ్ ఇంటర్‌నెట్ సౌకర్యం, రాత్రి సమయంలో ఉచితకాల్స్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పాత బకాయిలకు రాయితీ ఇస్తున్నామని వినియోగదారులు చెల్లించి లబ్ధి పొందాల్సిందిగా ఆమె కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఒంగోలునగరం : స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీన ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని మారెళ్ల మోమోరియల్ ట్రస్టు నిర్వాహకుల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత మారెళ్ల వెంకటేశ్వర్లు 14వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరాన్ని మారెళ్ల వెంకటేశ్వర్లు మెమోరియల్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరం మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు.

27న వ్యాసరచన పోటీలు

ఒంగోలు కలెక్టరేట్ : మహాకవి గిడుగు రామ్మూర్తి పంతులు 155వ జయంతిని పురస్కరించుకొని జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఉదయం పది గంటలకు స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషకు గిడుగు చేసిన కృషి అనే అంశంపై పాఠశాల స్థాయిలో వ్యాస రచన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 29న జరిగే తెలుగు భాషా దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

31న వైసీపీ ఆధ్వర్యంలో నవరత్నాల సభ

ఒంగోలు కలెక్టరేట్ : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాల సభ ఈనెల 31వ తేదీన స్థానిక సీతారామ ఫంక్షన్‌హాలులో జరుగుతుందని వైసీపీ నగర కమిటీ అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు తెలిపారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మంగళవారమిక్కడ జరిగిన సమావేశంలో వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, యనమల నాగరాజు, కఠారి శంకర్, జే. ఆనందరావు, కాకుమాను సునీల్, దాట్ల యశ్వంత్ వర్మ, వల్లెపు మురళీ, మిరావలి, నత్తల భీమేష్, తోటపల్లి సోమశేఖర్ పాల్గొన్నారు.